ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ప్రకాశం 5
జిల్లా వార్తలు
ఆదివారం 17, మార్చి 2024




చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన ఎంపీ మాగుంట, ఆయన కుమారుడు రాఘవరెడ్డి


టీడీపీలో చేరిన అనంతరం చంద్రబాబుకు బొకే ఇస్తున్న కృష్ణచైతన్య

సైకిల్ స్పీడు

పలువురు ప్రముఖులు, అనుచరులు చేరిక

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పలువురు ప్రముఖుల చేరికతో టీడీపీ కూటమిలో జోష్ పెరిగింది. శనివారం ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డితోపాటు ఆయన కుమారుడు రాఘవరెడ్డి, వారి అనుచరులు చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. మరోవైపు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గరటయ్య, ఆయన కుమారుడు శాప్ నెట్ మాజీ చైర్మన్ కృష్ణచైతన్యతోపాటు అద్దంకి నియోజకవర్గానికి చెందిన వారి అనుచరులు పెద్దసంఖ్యలో బాబు సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఇంకోవైపు చీరాలకు చెందిన మాజీ మంత్రి పాలేటి రామారావు కూడా సైకిలెక్కారు. దీనికితోడు గత కొన్నిరోజుల నుంచి ఆయా నియోజక వర్గాల్లో టీడీపీలోకి జరుగుతున్న వలసల పర్వం శనివారం కూడా కొనసాగింది. దీంతో ఉమ్మడి జిల్లాలో ఒక్కసారిగా రాజకీయ సమీకరణల్లో పెనుమార్పు చోటుచేసుకుంది. ఈ చేరికల పరంపరతో టీడీపీ కూటమిలో ఉత్సాహం పెరగ్గా, అధికార వైసీపీలో అలజడి ఆరంభమైంది.

- ఇటు మాగుంట, అటు బాచిన కుటుంబం
- ఒంగోలు లోక్‌సభలో పలువురు ముఖ్యులు చేరిక
- కృష్ణచైతన్య వెంట అద్దంకి నియోజకవర్గ నేతలు
- గరటయ్యతో కలిసి పార్టీలో చేరిన మాజీ మంత్రి పాలేటి
- కిందిస్థాయిలో కదులుతున్న అధికారపార్టీ కేడర్

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

జిల్లాలో వైసీపీ నుంచి టీడీపీలోకి చేరుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. కొద్దిరోజుల క్రితం వైసీపీకి రాజీనామా చేసిన ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఆయన కుమారుడు రాఘవరెడ్డి శనివారం చంద్రబాబునాయుడు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. అటు అద్దంకి మాజీ ఎమ్మెల్యే గరటయ్య, ఆయన కుమారుడు చైతన్య కూడా చంద్రబాబు సమక్షంలో ఉండవల్లిలోని ఆయన నివాస గృహంలో టీడీపీ తీర్థంపుచ్చుకున్నారు. ఇటు ఎంపీ మాగుంటతోపాటు లోక్‌సభ పరిధిలోని వైసీపీకి చెందిన స్థానికసంస్థల ప్రజాప్రతినిధులు, కిందిస్థాయి నాయకులు పెద్దఎత్తున సైకిలెక్కారు. ఇటు కృష్ణచైతన్యతోపాటు అద్దంకి నియోజకవర్గం నుంచి పలువురు ముఖ్య నాయకులు టీడీపీలో చేరారు. చీరాల నియోజకవర్గంలో బలహీన వర్గాలకు చెందిన మాజీమంత్రి డాక్టర్ పి.రామారావు కూడా గరటయ్యతో కలిసి టీడీపీలో చేరారు. ఉమ్మడి జిల్లాలోని 10 నియోజకవర్గాలలో వైసీపీకి రాజీనామాలు చేసి టీడీపీలోకి ఆయా స్థాయిల్లోని ప్రముఖులు చేరడంతో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. అంతేకాక కిందిస్థాయిలో మరికొందరు నాయకులు వీరికి మద్దతుగా టీడీపీలో చేరేందుకు చర్చలు సాగిస్తున్నారు. తదనుగుణంగా ఆయా ప్రాంతాల్లో చేరికల పర్వం మరికొన్ని రోజులు కొనసాగే అవకాశం కనిపిస్తోంది. అనేక ప్రాంతాల్లో రాజకీయ సమీకరణలు టీడీపీ కూటమికి అనుకూలంగా మారబోతున్నాయి.


చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన డాక్టర్ గరటయ్య. డాక్టర్ పాలేటి రామారావు

మాగుంట ఆధ్వర్యంలో...

ఉండవల్లిలో శనివారం చంద్రబాబు సమక్షంలో ఎంపీ మాగుంట, ఆయన కుమారుడు రాఘవరెడ్డితోపాటు ఒంగోలు, కొండపి, దర్శి, కనిగిరి, గిద్దలూరు తదితర నియోజకవర్గాలకు చెందిన కొందరు అనుచరులు కూడా టీడీపీలో చేరారు. ఒంగోలులో సూపర్‌బజార్ మాజీ చైర్మన్ కుప్పం ప్రసాద్, అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ ఘనశ్యామ్, మార్నేని లక్ష్మీనారాయణతోపాటు పలువురు ఆయా వర్గాలకు చెందిన నాయకులు పసుపు కండువా కప్పించుకున్నారు. కొండపి నియోజకవర్గంలో జరుగుమల్లి మాజీ ఎంపీపీ బెల్లం సత్యం, ప్రస్తుత ఎంపీపీ అయిన ఆయన సతీమణి నిర్మలతోపాటు మండలంలో వారితో కలిసి పయనిస్తున్న వారు టీడీపీ గూటికి వచ్చారు. అలాగే కొండపి ఎంపీపీ స్వర్ణకుమారితోపాటు ఆ మండలంలోని కొందరు నాయకులు, పొన్నలూరు, మర్రిపూడి, టంగుటూరు నుంచి మరికొందరు నాయకులు చేరారు. శింగరాయకొండ మండలం నుంచి మాగుంట సంస్థల్లో పనిచేసే ఉద్యోగులతోపాటు కుటుంబ అభిమానులు చేరారు. దర్శి మున్సిపాలిటీలో కౌన్సిలర్ ఈసీరెడ్డి, అలాగే తూర్పుగంగవరం ఉపసర్పంచ్ వై.కాశిరెడ్డి, అభివృద్ధి ట్రస్టుబోర్డు చైర్మన్ గురుబ్రహ్మం, పోలవరం వైసీపీ నాయకులు శ్రీనివాసరావు, కురిచేడు మండలంలోని యాదవ సామాజికవర్గానికి చెందిన వ్యక్తులు టీడీపీలో చేరారు. కనిగిరి నియోజకవర్గంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చంద్రశేఖర్, అలాగే గిద్దలూరు నియోజకవర్గం రాచర్ల మండలంలో పట్టు ఉన్న సొసైటీ మాజీ అధ్యక్షుడు రంగసాయి, వారి అనుచరులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

బాచినతో భారీ చేరికలు

అద్దంకి మాజీ ఎమ్మెల్యే గరటయ్య, ఆయన కుమారుడు చైతన్యతోపాటు నియోజకవర్గంలోని పలువురు ప్రముఖులు వైసీపీకి గుడ్‌బై చెప్పి టీడీపీలో చేరారు. కొరిశపాడు ఎంపీపీ సాదినేని ప్రసన్నకుమారి, ఆమె భర్త మస్తాన్‌రావు, అలాగే బాపట్ల జిల్లా వైసీపీ రైతువిభాగం అధ్యక్షుడు చింతల పేరయ్య, పంగులూరు, సంతమాగులూరు, కొరిశపాడు పార్టీ మండల అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, చింతా రామారావు, రావి శ్రీధర్, పంగులూరు జడ్పీటీసీ సభ్యురాలు ప్రమీల సుబ్బారావు, నాగులపాడు సొసైటీ మాజీ చైర్మన్ సందిరెడ్డి రమేష్, వెల్లలచెరువు సొసైటీ మాజీ అధ్యక్షుడు చింతా శ్రీధర్, 19వవార్డు కౌన్సిలర్ వేజెండ్ల నాగరాజు, టి.కొప్పెరపాడు సర్పంచ్ శ్రీను, బొమ్మనంపాడు ఎంపీటీసీ భర్త హనుమంతరావు, అనుమలపాడు, కశ్యాపురం, నక్కబొక్కలపాడు, కె.రాజుపాలెం తదితర గ్రామాల సర్పంచ్‌లతోపాటు ఎంపీటీసీ సభ్యులు టీడీపీలో చేరారు. మాజీ ఎంపీపీలు, సొసైటీ అధ్యక్షులు కూడా పెద్దసంఖ్యలో టీడీపీలో చేరారు. వీరందరికీ బాబు పార్టీ కండువాలు కప్పి పార్టీలో చేర్చుకున్నారు. మిగిలిన గ్రామాల్లోని మరికొందరు నాయకులు సోమవారం నుంచి నియోజకవర్గంలో జరిగే వివిధ కార్యక్రమాల్లో చేరబోతున్నట్లు చైతన్య తెలిపారు. కాగా చీరాలలో రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా పనిచేసి మంత్రిగా పనిచేసిన బలహీనవర్గాల నాయకులు డాక్టర్ పాలేటి రామారావు టీడీపీలో చేరడంతో నియోజకవర్గంలోని ఆయన అనుచరులు కూడా ఆయనబాటలోనే పయనించారు.

కోడ్ కూసింది!

సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించిన సీఈసీ

- ఏప్రిల్ 18న నోటిఫికేషన్
- మే 13న పోలింగ్.. జూన్ 4న కౌంటింగ్
- అప్రమత్తమైన యంత్రాంగం
- నిబంధనల అమలుకు చర్యలు
- కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్

ఒంగోలు (కలెక్టరేట్), మార్చి 16: సార్వత్రిక ఎన్నికల సమరానికి కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) నగారా మోగించింది. దేశవ్యాప్తంగా ఏడు దశల్లో ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్‌ను శనివారం సాయంత్రం ప్రకటించింది. వెంటనే ఎన్నికల ప్రవర్తనా నియమావళి(కోడ్) అమల్లోకి వచ్చినట్లు ప్రకటించింది. దీంతో జిల్లాలో అధికార యంత్రాంగం తక్షణం కోడ్ అమలుకు ఉపక్రమించింది. సీఈసీ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం రాష్ట్రంలో ఏప్రిల్ 18న నోటిఫికేషన్ వెలువడనుంది. మే 13న పోలింగ్, జూన్ 4న ఓట్ల లెక్కింపు జరుగుతుంది. ఆ ప్రకారమే జిల్లాలోనూ ప్రక్రియ సాగుతుంది. జిల్లాలో తాజా లెక్కల ప్రకారం మొత్తం ఎనిమిది అసెంబ్లీ స్థానాల్లో 18,11,597 మంది ఓటర్లు ఉండగా వారి కోసం 2,183 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేశారు. అలాగే ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో పలు కీలక పనులను ఇప్పటికే చేపట్టారు.

ఫ్లెక్సీలు, పోస్టర్లు తొలగింపు

ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో తక్షణ చర్యలపై ఎక్కడికక్కడ అధికారులు దృష్టిపెట్టారు. తొలుత జిల్లావ్యాప్తంగా రెవెన్యూ, పంచాయతీ, మునిసిపల్ అధికారులు, సిబ్బంది తమ పరిధిలోని రాజకీయపక్షాల అలాగే ఓటర్లను ప్రభావితం చేసే ఫ్లెక్సీలు, కటౌట్లు, హోర్డింగ్‌లు తొలగించే చర్యలు చేపట్టారు. నేతల విగ్రహాలకు ముసుగులు వేయడం ప్రారంభించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఫొటోల తొలగింపు చర్యలు చేపట్టారు. ఈ ప్రక్రియ అంతా 24 నుంచి 48 గంటల్లో పూర్తిచేయాల్సి ఉంది. పోలీసు అధికారులు కూడా పలుచోట్ల చెక్‌పోస్టులు పెట్టి తనిఖీలు ముమ్మరం చేశారు. కోడ్ అమలులో భాగంగా ఇంకా పలు చర్యలు తీసుకోవాల్సి ఉండటంతో కలెక్టర్ శనివారం సాయంత్రం కీలక అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, అధికారిక బృందాలు, మండల స్థాయి అధికారులతో నిర్వహించిన ఈ కాన్ఫరెన్స్‌లో తక్షణ చర్యలపై పలు సూచనలు చేశారు.

జిల్లాలో 18,11,614 ఓట్లు

- 11,908 ఓట్లు పెరుగుదల

ఒంగోలు (కలెక్టరేట్), జనవరి 16 : జిల్లాలో 18,11,614 మంది ఓటర్లు ఉన్నారు. గత జనవరిలో ప్రకటించిన తుది ఓటర్ల జాబితాలో 17,99,706 ఓట్లు ఉండగా ఈ మూడు నెలల కాలంలో చేర్పుల అనంతరం 11,908 పెరిగాయి. కనిగిరి నియోజకవర్గంలో అత్యధికంగా 2,38,436 ఓటర్లు ఉండగా అత్యల్పంగా ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో 2,06,395 మంది ఉన్నారు. జిల్లాలో పురుష ఓటర్లు 9,02,521 మంది, మహిళా ఓటర్లు 9,08,986 మంది ఉన్నారు. పురుషుల కంటే స్త్రీల ఓట్లు 6,465 ఎక్కువ ఉన్నాయి.

అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఓట్ల వివరాలు

నియోజకవర్గం	కేంద్రాలు	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
ఎర్రగొండపాలెం	265	1,04,777	1,01,617	01	2,06,395
దర్శి	282	1,13,768	1,11,663	09	2,25,440
ఎస్ఎన్‌పాడు	256	1,04,997	1,08,707	04	2,13,708
ఒంగోలు	259	1,14,640	1,23,695	49	2,38,348
కొండపి	283	1,17,580	1,19,991	03	2,37,574
మార్కాపురం	257	1,07,448	1,06,000	08	2,13,456
గిద్దలూరు	284	1,18,747	1,19,454	20	2,38,221
కనిగిరి	207	1,20,564	1,17,859	13	2,38,436
మొత్తం	2,183	9,02,521	9,08,986	107	18,11,614

డ్వామాలో కుర్చీలాట..!

- పక్షం రోజుల్లో ముగ్గురు పీడీల మార్పు


అర్జున్‌రావు

ఒంగోలు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా నీటియాజమన్య సంస్థ (డ్వామా)లో కుర్చీలాట సాగుతోంది. ఆసంస్థ జిల్లా ఉన్నతాధికారి అయిన ప్రాజెక్టు డైరెక్టర్ పోస్టుకు పక్షం రోజుల్లో ముగ్గురు అధికారులు మారారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అధికారుల నియామకాల్లో బంతాట అనేక సందర్భాల్లో బహిర్గతం కాగా, ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో అదేతంతు కొనసాగుతోంది. గత నాలుగున్నరేళ్ల నుంచి పీడీగా కె.శీనారెడ్డి పనిచేశారు. సొంత జిల్లా కావడం, ఎక్కువకాలం పనిచేసిన నేపథ్యంలో ఎన్నికల నిబంధనల మేరకు ఆయన్ను కలెక్టర్ దినేష్‌కుమార్ మాతృశాఖకు సరెండర్ చేశారు. ఈమేరకు గతనెల 27న ఆయన ఉత్తర్వులు ఇచ్చారు. ఇన్‌చార్జి పీడీ బాధ్యతలను మార్కాపురం ఏపీడీగా పనిచేస్తున్న నిర్మలాదేవికి అప్పగించారు. ఆమె బాధ్యతలు స్వీకరించిన వారంరోజులకు పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో డీఎల్‌డీవోగా పనిచేస్తున్న వై.రాజగోపాల్‌ను ప్రభుత్వం ఇక్కడ పీడీగా నియమించింది. ఈనెల 11న ఆయన బాధ్యతలు స్వీకరించి పనిచేస్తుండగా, శుక్రవారం రాత్రి రాజగోపాల్‌ను తిరిగి సత్తెనపల్లి డీఎల్‌డీవోగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో ప్రస్తుతం బాపట్ల జిల్లా ఇన్‌చార్జి పీడీగా పనిచేస్తున్న కందుకూరు ఏపీడీ అర్జున్‌రావును నియమించారు. ఆయన శనివారం బాధ్యతలు స్వీకరించారు. అయితే పక్షంరోజుల వ్యవధిలో ముగ్గురు పీడీలు మారడంతో డ్వామా పరిధిలోని పలువురు సిబ్బందికి జీతాల బిల్లుల సమస్య ఎదురైనట్లు సమాచారం.

31 మండలాల్లో కరువు

- రబీ సీజన్‌పై ప్రభుత్వం ప్రకటన

ఒంగోలు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రబీ సీజన్‌కు సంబంధించి 31 మండలాల్లో కరువు పరిస్థితులు ఉన్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఆమేరకు శనివారం ఉత్తర్వులు ఇచ్చింది. ఈఏడాది రబీలో 44శాతం లోటు వర్షపాతం ఉండగా, పంటల సాగు మూడింట రెండు వంతుల విస్తీర్ణంలో మాత్రమే జరిగింది. సరైన సమయంలో వర్షాలు లేక పలు పంటల దిగుబడులు కూడా తగ్గిపోయాయి. అయితే సీజన్ ముగిసిన తర్వాత రెండు మాసాలపాటు పట్టించుకోని ప్రభుత్వం నాలుగురోజుల క్రితం కరువు పరిస్థితులపై హడావుడిగా జిల్లా అధికారులను నివేదికలు కోరింది. పంటల సాగు విస్తీర్ణం, దిగుబడులు, వర్షపాతం నమోదు, భూమిలో తేమశాతం, భూగర్భ జలాల పరిస్థితి తదితర కేంద్రప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా కరువు మండలాల ఎంపిక జరుగుతుంది. ఆ ప్రామాణికాల ప్రకారం జిల్లాలోని 38 మండలాల్లో 20చోట్ల తీవ్ర కరువు, 11చోట్ల ఒక మోస్తరు కరువు పరిస్థితులు ఉన్నట్లు కలెక్టర్ దినేష్‌కుమార్ రెండు రోజుల క్రితం ప్రభుత్వానికి నివేదించారు. అలాగే మిగిలిన 7 మండలాల్లో కూడా పలు అంశాలు సాధారణ స్థాయిలో ఉన్నప్పటికీ పంట దిగుబడులు తక్కువగా ఉన్నందున వాటిని కూడా కలిపి మొత్తం 38 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించాలని నివేదికలో పేర్కొన్నారు. అయితే ఆ ఏడింటి విషయాన్ని పక్కనపెట్టిన ప్రభుత్వం 31 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించింది. ఈ మండలాల్లో పంట రుణాల రీషెడ్యూల్, ఇన్‌పుట్ సబ్సిడీ అందజేత, తాగునీటికి నిధులు, అదనపు ఉపాధి పనిదినాల కల్పన తదితర కరువు సహాయక చర్యలకు అవకాశం ఉంది. కానీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కరువు మండలాలుగా ప్రకటించిన ప్రభుత్వం తదుపరి చర్యలు ఏ మేరకు తీసుకుంటుందనేది ప్రశ్నార్థకమే.

తీవ్ర కరువు ఉన్న మండలాలు

వైపాలెం, దోర్నాల, కురిచేడు, ముండ్లమూరు, దర్శి, పొదిలి, మర్రిపూడి, పెద్దారవీడు, మార్కాపురం, కంభం, తర్లుపాడు, హనుమంతునిపాడు, వెలిగండ్ల, పీసీపల్లి, సీఎస్‌పురం. పామూరు, సంతనూతలపాడు, ఒంగోలు, కొత్తపట్నం, పుల్లలచెరువు.

ఒక మోస్తరు కరువు మండలాలు

దొనకొండ, కొనకనమిట్ల, అర్ధవీడు, బేస్తవారపేట, నాగులుప్పలపాడు, చీమకుర్తి, రాచర్ల, గిద్దలూరు, కొమరోలు, కనిగిరి, కొండపి.

ఆశలు గల్లంతు

- ఆ ముగ్గురు ఎమ్మెల్యేలకు మొండిచెయ్యి
- దర్శి, ఎస్ఎన్‌పాడు, కందుకూరులో ఎవరిదారి వారిదే
- చీరాలలో అనుచరులతో ఆమంచి మంతనాలు
- మార్పుల్లేని వైసీపీ అభ్యర్థుల తుదిజాబితా

వివరాలు లోపలి పేజీల్లో..

మేయర్.. నిబంధనలు బేఖాతర్!

- కోడ్ వచ్చాక సచివాలయ సెక్రటరీలకు బహుమతులు
- సమావేశం పేరుతో ఇంటికి పిలిచి పంపిణీ

వివరాలు మెయిన్‌లో..

వారు అంటించారు..వీరు తేసేశారు..!



పోస్టర్లను తొలగిస్తున్న కార్పొరేషన్ సిబ్బంది

● ఎన్నికల కోడ్‌తో నగరంలో పోస్టర్ల తొలగింపు

వైసీపీ ప్రచార పిచ్చికి కార్పొరేషన్ అధికారులు అడ్డుకట్ట వేశారు. ఎన్నికల షెడ్యూలు రాకముందే శుక్రవారం రాత్రి నగరమంతా జగన్ ఫొటోతో పాటు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఫొటోలతో ముద్రించిన పోస్టర్లు నగరమంతా వెలిశాయి. అయితే శనివారం నుంచి ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో కార్పొరేషన్ అధికారులు రంగంలోకి దిగారు. నగరంలో వివిధ రాజకీయ పార్టీల పోస్టర్లను తొలగించేశారు. పలు రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేసే చర్యలు వేగవంతం చేశారు. ఇదిలా ఉండగా, వివిధ రాజకీయ పార్టీల ఫ్లెక్సీలను సైతం తొలగింపు చర్యలు చేపట్టారు. దీంతో వైసీపీ పోస్టర్ ప్రచార పిచ్చికి ప్రారంభంలోనే కార్పొరేషన్ అధికారులు అడ్డువేయడంతో ఆ పార్టీ శ్రేణుల మొహాలు చిన్నబోయాయి.

- ఒంగోలు (కార్పొరేషన్)



ఫ్లెక్సీలను తొలగిస్తున్న సిబ్బంది

వైభవంగా పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ఠ



ఆలయ ఆవరణలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఒంగోలు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : నాగులుప్పలపాడు మండలం కొత్తకోట గ్రామంలో పోలేరమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం శనివారం వైభవంగా జరిగింది. ఉదయం 9.48 గంటలకు వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. పురాతనకాలం నుంచి ఉన్న పోలేరమ్మ గుడి శిథిలావస్థకు చేరుకోడంతో గ్రామస్థులు ఆలయ పునఃనిర్మాణం చేపట్టారు. గురువారం నుంచి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ పూజా కార్యక్రమాలు నిర్వహించగా, శనివారం ఉదయం నూతన దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠను వైభవంగా జరిగింది. వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాలు, వ్యాపారాలు, ఇతరత్రా స్థిరపడిన గ్రామస్థులతోపాటు పలు గ్రామాలకు చెందిన వందలాదిమంది భక్తులు తరలివచ్చారు. అనంతరం భారీగా అన్నదానం నిర్వహించారు.

విద్యార్థులకు గ్రంథాలయ సభ్యత్వం



సభ్యత్వకార్డులను అందజేస్తున్న దాతలు

ఒంగోలు(కల్చరల్) మార్చి 16 : ఒంగోలులోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో విద్యార్థినులకు శనివారం గ్రంథాలయ సభ్యత్వాన్ని అందజేశారు. గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముందుగా అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి సిబ్బంది, పాఠకులు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు, దోస్తీ ఫౌండేషన్ ఛైర్మన్ షేక్ మహబూబ్, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పల్లెపాటి పేరయ్యలు స్థానిక పీవీఆర్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులకు సభ్యత్వ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాన్ని ఉపయోగించుకుని విజ్ఞానం పొందాలని, వారి కోసం అనేక పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. అనంతరం వారికి పెన్నులు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నున్నా ఆంజనేయులు, మొగిలి దేవ, శ్రీనివాసరావు, బొమ్మల కోటేశ్వరి, కె.సంపూర్ణమ్మ, జి.శాంసన్, కె.కృష్ణవేణి, ఎస్.అనిల్‌బాబు, వై.మృదుల్ కుమార్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే బాలినేని

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 16 : ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి శనివారం స్థానిక లాయర్‌పేటలోని తన నివాసంలో లబ్ధిదారులకు అందజేశారు. వివిధ అనారోగ్య సమస్యలు గల 60 మందికి సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.57.14 లక్షల చెక్కులను ఆయన పంపిణీ చేశారు. అనంతరం నేతాజీకాలనీ, జయప్రకాష్ కాలనీలో పలు అభివృద్ధి పనులకు, ఫారెస్టు కార్యాలయ సముదాయం వద్ద యాదవభవన్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం వైసీపీ కార్యాలయంలో జరిగిన పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలకు హాజరయ్యారు. కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, కార్పొరేటర్లు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా పేస్ వార్షికోత్సవం



మాట్లాడుతున్న శ్రీధర్

ఒంగోలు(విద్య), మార్చి 16: ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాల 16వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కళాశాలలో జరిగిన వేడుకలకు హాజరైన చెన్నై హెచ్‌సీఎల్ కంపెనీ ఫ్రెషర్ ప్రోగ్రామ్ హెడ్ స్టార్ ప్రకాష్ రాజశేఖర్ మాట్లాడుతూ ప్రస్తుతం ఐటీ రంగంలో ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవడానికి అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ 2008లో కేవలం 240 మంది విద్యార్థులతో ప్రారంభమైన తమ కళాశాల ప్రస్తుతం 6500 మంది విద్యార్థులకు విద్యానిలయంగా మారిందన్నారు. జిల్లాలో ఒక ప్రత్యేక గుర్తింపు సాధించిందని, ఉత్తమ విద్యా ప్రమాణాలు, నాణ్యమైన బోధన, అత్యధిక జీతంతో విద్యార్థులకు ప్లేస్‌మెంట్స్ కల్పిస్తున్నట్లు ఆయన చెప్పారు. అనంతరం కళాశాలలో గత పది సంవత్సరాల నుంచి పనిచేస్తున్న అధ్యాపకులను సత్కరించారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, ఏవో రమణబాబు, డీన్‌లు ఆర్.వీరాంజనేయులు, కె.రూపా అక్కేష్, అప్పారావు, టీఆర్.చైతన్య తదితరులు పాల్గొన్నారు.

శివనామ స్మరణతో లోకకల్యాణం



ప్రవచనం చేస్తున్న వేంకటశ్రీనివాసులు

ఒంగోలు(కల్చరల్) మార్చి 16: శివ నామస్మరణ సకల శుభప్రదమని ప్రముఖ ప్రవచకులు, ప్రరసం అధ్యక్షులు పొన్నూరి వేంకట శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం ఒంగోలు నగరం ఇల్లింద్రవారివీధిలోని శ్రీ శంకర బాల భక్త సమాజం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ గంగా అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి 54వ కల్యాణ మహోత్సవం 16 రోజుల పండుగ సందర్భంగా శివనామ వైభవం అన్న అంశంపై ఆయన ప్రవచించారు. విభూతి ధారణ ఐశ్వర్యానికి సంకేతం అని, శివాభిషేకం ద్వారా శాంతి సౌఖ్యాలు కలుగుతాయని పేర్కొన్నారు. అనంతరం నిర్వాహకులు ఆయనను స్వామి వారి శేషవస్త్రంతో ఘనంగా సన్మానించి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో బాలభక్త సమాజం ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

ఈసీ నిబంధనలను పాటించాలి

సింగరాయకొండ, మార్చి 16 : ఎన్నికల షెడ్యూల్ వెలుబడిన నేపథ్యంలో ఈసీ నిబంధలను విధిగా పాటించాలని తహసీల్దార్ భవానీ శంకర్, ఎంపీడీవో నగేష్‌కుమార్ స్పష్టం చేశారు. సింగరాయకొండఎంపీడీవో కార్యాలయంలో శనివారం పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 24 గంటలలోపు ప్రభుత్వ స్థలాల్లో ఉన్న రాజకీయ పార్టీలకు సంబంధించిన పోస్టర్లు, హోర్డింగ్‌లు, బ్యానర్లు, జెండాలు తొలగించాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులు ఏరాజకీయ పార్టీకైనా అనుకూలంగా వ్యవహరించినా, ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నా, వారి నుంచి బహుమతులు స్వీకరించినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తెలుగుదేశంలోకి భారీగా వలసలు

మాగుంటతోపాటు జరుగుమల్లి మాజీ ఎంపీపీ, సత్యనారాయణ, కొండపి ఎంపీపీ చేరిక ● వారివెంటే పలుగ్రామాల నాయకులు



చంద్రబాబు సమక్షంలో మాగుంటతోపాటు చేరుతున్న బెల్లం సత్యన్నారాయణ



పార్టీలోకి చేరుతున్న బొల్లినేని క్రిష్ణ తదితరులు



క్రిష్ణారెడ్డి, శ్రీనివాసరావు, మరో నలుగురికి టీడీపీ కండువాలు కప్పిన మాగుంట

కొండపి, మార్చి 16 : కొండపి నియోజకవర్గంలో వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు ఊపందుకున్నాయి. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డితో పాటు అతని అనుచరులుగా ఉన్న జరుగుమల్లి మాజీ ఎంపీపీ బెల్లం సత్యన్నారాయణ (సత్యం), కొండపి ఎంపీపీ కొండసింగు స్వప్నకుమారి శనివారం మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో చంద్రబాబు సమక్షంలో టీడీపీ తీర్థంపుచ్చుకున్నారు. సత్యన్నారాయణ భార్య బెల్లం నిర్మల ప్రస్తుతం జరుగుమల్లి ఎంపీపీగా ఉన్నారు. వీరితోపాటు కొండపి, జరుగుమల్లి మండలాలకు చెందిన పలుగ్రామాల వైసీపీ నాయకులు, క్రియాశీలక కార్యకర్తలు టీడీపీలో చేరారు. నియోజకవర్గంలోని పలు మండలాల్లోని గ్రామాల నుంచి వైసీపీ నాయకులు, గ్రామాలను ప్రభావితం చేయగల పట్టున్న నాయకులు త్వరలో సైకిలెక్కనున్నారు. ఆమేరకు టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి దామచర్ల సత్యన్నారాయణ ఇప్పటికే వారితో సంప్రదింపులు జరిపారని అంటున్నారు.

పలువురు చేరిక

మండలంలోని పెట్లూరు గ్రామ పంచాయతీ కోయవారిపాలెంకు చెందిన వైసీపీ నాయకుడు బొల్లినేని కృష్ణ శనివారం మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్‌లో టీడీపీలో చేరారు. పెట్లూరు గ్రామ టీడీపీ నాయకుడు గుజ్జుల శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో కృష్ణ టీడీపీలో చేరగా మాగుంట సాదరంగా ఆహ్వానించారు. అదేవిధంగా గుర్రప్పడియ గ్రామానికి చెందిన మారెడ్డి సుబ్బారెడ్డి (బియ్యం సుబ్బారెడ్డి), కొండపికి చెందిన దిశ మెంబర్ దుగ్గిరాల వెంకటేశ్వర్లు మాగుంటతోపాటు టీడీపీలో చేరారు. వీరితోపాటు మండలంలోని పలుగ్రామాల నుంచి మాగుంట అనుచరులుగా ఉన్న వారు సైకిలెక్కారు.

తేటుపురం నుంచి..

టంగుటూరు : మండలంలోని అనంతవరం పంచాయతీ పరిధి తేటుపురంనకు చెందిన ఐదుగురు వైసీపీ నాయకులు శనివారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరంతా మాగుంటతోపాటు తాడేపల్లి వెళ్లి టీడీపీ అధినేత చంద్రబాబు సమక్షంలో ఆపార్టీలో చేరారు. వారిలో అనంతవరంనకు చెందిన కసుకుర్తి శ్రీనివాసరావు కూడా ఉన్నారు. వీరిని ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అభినందించారు. వైసీపీలో కీలకంగా వ్యవహరించే వీరంతా టీడీపీలో చేరడంతో అనంతవరం పంచాయతీలో తిరుగులేని ఆధిపత్యంలో ఉండే వైసీపీకి బీటలు పడనున్నాయి.

టీడీపీలో చేరిన వారిని అక్కున చేర్చుకుంటాం

ఎస్ఎన్‌పాడు నియోజకవర్గ అభ్యర్థి బీఎన్ ● పలు కుటుంబాలు తెలుగుదేశంలో చేరిక ● సాదరంగా ఆహ్వానించిన విజయ్‌కుమార్



క్రిస్టియన్‌పాలెం నుంచి చేరిన వారితో విజయ్‌కుమార్



పార్టీలో చేరిన వడ్డెరరాజుపాలెం కార్యకర్తలతో బీఎన్

చీమకుర్తి, మార్చి 16: అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధిని కాంక్షించే తెలుగుదేశం పార్టీలోకి వచ్చిన వారిని ఆప్యాయంగా ఆదరించి అక్కున చేర్చుకుంటామని నియోజకవర్గ ఇన్‌చార్జి, అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ తెలిపారు. చీమకుర్తి పట్టణం క్రిస్టియన్‌పాలెం నుంచి యూనిట్ ఇన్‌చార్జి యడ్లపల్లి రామబ్రహ్మం, పాటిబండ్ల జక్రయ్య ఆధ్వర్యంలో శనివారం వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు జరిగాయి. వీరందరినీ విజయ్‌కుమార్ సాదరంగా ఆహ్వానించి పార్టీ కండువాలు వేశారు. త్వరలో జరిగే ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించటం ద్వారా చంద్రబాబునాయుడిని సీఎంగా చేద్దామని కోరారు. పార్టీ అన్నివిధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు అడకా స్వాములు, మన్నం ప్రసాద్, గొల్లపూడి సుబ్బారావు, కాట్రగడ్డ రమణయ్య, సూరంపల్లి హనుమంతరావు, ఉన్నం సుబ్బారావు, కర్ణా ప్రసాద్, బిక్షాలు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బడుగులకు భరోసా

సంతనూతలపాడు: రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాలకు భరోసా ఇచ్చే పార్టీ టీడీపీ అని నియోజకవర్గ ఇన్‌చార్జి బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఒంగోలులోని తన కార్యాలయంలో పేర్నమిట్ట పరిధిలోని 40వ డివిజన్‌లోని వడ్డెరరాజుపాలెం నుంచి గుంజా అంకమ్మరావు ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన పలు కుటుంబాలు విజయ్‌కుమార్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన తన్నీరు రఘు, బండారు ప్రతాప్, తన్నీరు జీవన్, విష్ణు, రాకేష్, సతీష్ చిరంజీవి, అంకమ్మరావు, పోతురాజు, అరుణ్, శేఖర్ వారందరికి పార్టీ కండువాకప్పి ఆహ్వానించారు. అనంతరం బీఎన్ మాట్లాడుతూ వైసీపీ నియంతల నాయకుల పార్టీ అని, దాని వల్ల పేద, మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర సెక్రటరీ అడకా స్వాములు, వివరం గోవిందు, తన్నీరు వెంకట్రావు, చిన్న, ఆట్లూరి బ్రహ్మయ్య పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీ రాజుపై బొట్లా వర్గం దాడి

మంత్రి సురేష్ సమక్షంలో ఘటన

కందులూరు వైసీపీలో బహిర్గతమైన విభేదాలు

టంగుటూరు, మార్చి 16: మండలంలోని కందులూరు వైసీపీలో నెలకొన్ని విభేదాలు మంత్రి సురేష్ సమక్షంలో బహిర్గతమయ్యాయి. మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఉప్పలపాటి సత్యనారాయణరాజుపై అదేగ్రామానికి చెందిన సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు బొట్లా సుబ్బారావు వర్గం దాడి చేసింది. టంగుటూరులో నూతనంగా ఏర్పాటు చేసిన వైసీపీ కార్యాలయాన్ని గురువారం ప్రారంభించారు. షెడ్యూల్ ప్రకారం రాత్రి 6.30కు జరగాల్సిన కార్యక్రమం రాత్రి 9.30కు ప్రారంభమైంది. అప్పటికే అక్కడకు వచ్చిన కొందరు ఇళ్లకు వెళ్లిపోయారు.

మంత్రిని నిలదీసిన రాజు

పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవానికి హాజరైన సత్యనారాయణరాజు కార్యక్రమం అనంతరం మంత్రిని కలిశారు. కందులూరులో బుధవారం రాత్రి జరిగిన గ్రామ సచివాలయం ప్రారంభోత్సవానికి మీరెందుకు రాలేదని నిలదీశారు. ఇది తమకు అవమానంగా ఉందని చెప్పారు. పార్టీ మండల ఉపాధ్యక్షుడినైన తనను పార్టీ కార్యాలయ సభా వేదిక మీదకు పిలవకుండా బొట్లా సుబ్బారావును ఎందుకు ఆహ్వానించారని మంత్రిని సత్యనారాయణరాజు ప్రశ్నించారు. ఆ సమయంలో అక్కడే ఉన్న బొట్లా వర్గం రాజుపై ఆగ్రహంతో ఊగిపోయింది. ఆయనపై దాడికి పాల్పడింది. పరిస్థితిని గుర్తించిన మంత్రి సురేష్ వెంటనే అప్రమత్తమై రాజును తన కారులో ఎక్కించుకొని అక్కడి నుంచి తీసుకెళ్లారు. ఒకే పార్టీకి చెందిన వారు ఈవిధంగా ఘర్షణ పడడంపై పార్టీ నాయకులు, అక్కడికి వచ్చిన కార్యకర్తలు అసహనం వ్యక్తంచేశారు. ఇరువర్గాల వారు కందులూరుకే చెందిన వారు కావడంతో దీని పర్యవసానాలు ఎలా ఉంటాయోనని గ్రామస్థులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

నగరంలో ఎంపీ మాగుంట సందడి !

ఆయన కార్యాలయంలో కోలాహలం

భారీ కాన్వాయ్‌తో ఉండవల్లికి తరలిన వైనం





మాగుంట కార్యాలయానికి విచ్చేసిన నాయకులు, భారీ కార్ల ర్యాలీ

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 16 : ఇటీవల వైసీపీకి రాజీనామా చేసిన ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి టీడీపీ చేరిక నేపథ్యంలో శనివారం నగరంలో సందడి వాతావరణం నెలకొంది. ఉదయం నుంచి మాగుంట కార్యాలయం వద్ద కోలాహలం నెలకొంది. స్థానిక రామనగర్‌లోని ఆయన కార్యాలయం వద్దకు ఒంగోలు పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల నుంచి అభిమానులు భారీగా తరలివచ్చారు. శనివారం సాయంత్రం ఉండవల్లిలో టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు సమక్షంలో మాగుంటతోపాటు ఆయన కుమారుడు, యువపారిశ్రామికవేత్త రాఘవరెడ్డి చేరిక నేపథ్యంలో ఒంగోలు నుంచి తన అభిమానులతో కలిసి భారీ ర్యాలీ ఏర్పాటు చేశారు. సుమారు 250 కిపైగా వాహనాల్లో అభిమానులతో కలిసి బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా మాగుంట కార్యాలయం నుంచి కార్ల ర్యాలీ వెళ్లిన రోడ్లన్నీ సందడిగా మారాయి.

మాగుంటతో గొట్టిపాటి, దామచర్ల భేటీ

కాగా ఒంగోలు ఎంపీ మాగుంటతో అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్, ఒంగోలు మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, జనసేన పార్టీ అధ్యక్షుడు షేక్ రియాజ్‌లు భేటీ అయ్యారు. శనివారం టీడీపీలో చేరికతోపాటు బొప్పూడి వద్ద ఎన్‌డీఏ కూటమి ఆధ్వర్యంలో జరిగే సభపై చర్చించారు. వారితో పాటు యువ పారిశ్రామికవేత్త రాఘవరెడ్డి ఉన్నారు.

నేడు గ్రూపు-1 పరీక్ష

జిల్లాలో 9 కేంద్రాలు ● 6,016 మంది అభ్యర్థులు

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 16 : ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) గ్రూపు-1 పరీక్ష ఆదివారం నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. 6,016 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానుండగా అందుకోసం తొమ్మిది కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఒంగోలులో ఆరు కేంద్రాలు, టంగుటూరు మండలంలో రెండు, చీమకుర్తిలో ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గ్రూపు-1 పరీక్ష రెండు సెషన్స్‌లో జరగనుంది. ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు జరుగుతుంది. మొదటి సెషన్‌కు హాజరయ్యే అభ్యర్థులు ఉదయం 9.45లోపు కేంద్రంలోకి వెళ్లాలి. ఆ తర్వాత వచ్చే విద్యార్థులను అనుమతించరు. మధ్యాహ్నం సెషన్ 2 నుంచి 4 గంటల వరకు జరుగుతుంది. మధ్యాహ్నం సెషన్‌కు హాజరయ్యే అభ్యర్థులు 1.45లోపు కేంద్రంలోకి వెళ్లాలి.

పరీక్షలకు పటిష్టమైన భద్రత : ఎస్పీ

ఒంగోలు క్రైం, మార్చి 16: ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకున్నట్లు ఎస్పీ పి.పరమేశ్వరరెడ్డి శనివారం తెలిపారు. జిల్లాలో 9 కేంద్రాలలో ఆదివారం జరుగుతున్న గ్రూప్-1పరీక్షలకు మొత్తం 6,116 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన అభ్యర్థులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. పరీక్ష కేంద్రాల నుంచి 200 మీటర్లు దూరం వరకు 144 సెక్షన్ విధించినట్లు తెలిపారు. దూర ప్రాంతాల వారి కోసం ఎలాంటి అంతరాయం జరగకుండా ఏర్పాట్లు చేశామన్నారు. అలాగూ పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి సంఘటనలు జరిగినా 100, 112 నంబర్లకు ఫోన్ చేయాలని, జిల్లా పోలీస్ వాట్సాప్ నంబరు 9121102266 కు సమాచారం అందించాలని ఎస్పీ సూచించారు.

అవీ..ఇవీ..

ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకోవాలి

ఒంగోలు నగరం, మార్చి 16: జిల్లాలోని చర్మకారులు, తోళ్ళను శుద్ధిచేసే పని వారు, అలాగే వ్యర్థ పదార్థాలను సేకరించే వృత్తిలో ఉన్న కార్మికులు, భూగర్భ పైపు లైన్లు శుభ్రం చేసే వృత్తిలో ఉండే వారి పిల్లలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపకార వేతనాలు మంజూరు చేస్తున్నాయని, వాటి కోసం గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూలు కులముల సంక్షేమం, సాధికారిత అధికారి లక్ష్మానాయక్ శనివారం ఓ ప్రకటనలో కోరారు. ఏప్రిల్ 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను సంబంధిత సచివాలయాల్లో వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్, వార్డు ఎడ్యుకేషన్ డేటా ఎంట్రీ అసిస్టెంట్ ద్వారా ఉపకార వేతనాలకు అర్హులైన విద్యార్థుల తల్లిదండ్రులు నమోదు చేసుకోవాలన్నారు. 1 నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులకు డే స్కాలర్స్‌కు, హాస్టలర్స్‌కు రూ.8 వేలు ఉపకార వేతనం మంజూరు అవుతుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వం గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదువుతున్న వారు ఈ ఉపకార వేతనాలు పొందేందుకు అర్హులని పేర్కొన్నారు.

క్విస్‌లో రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరంలో పాల్గొన్న నిర్వాహకులు

ఒంగోలు(విద్య), మార్చి 16: ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం క్విస్ రోటరీ క్లబ్, క్విస్ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో రిమ్స్ సహకారంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ డాక్టర్ నిడమానూరి సూర్యకళ్యాణ్ చక్రవర్తి, వైస్ ఛైర్మన్ డాక్టర్ శ్రీగాయత్రి దేవిలు మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. విద్యార్థులు వీలు న్నప్పుడల్లా రక్తదానం చేసి రక్తం లేక ప్రాణాలు కోల్పోతున్న వారిని రక్షించాలని కోరారు. మొత్తం 60 యూనిట్ల రక్తాన్ని విద్యార్థుల నుంచి సేకరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.హనుమంతరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రేపటి నుంచి మహిళలకు ఉచిత శిక్షణ

ఒంగోలునగరం, మార్చి 15: మర్డోసి మగ్గం వర్కులో మహిళలకు ఈ నెల 18వ తేదీ నుంచి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు రూడ్‌సెట్ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణకు ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ఉండే మహిళలు అర్హులని, వయస్సు 18 నుంచి 45 సంవత్సరాల లోపు ఉండాలని పేర్కొన్నారు. రేషన్‌కార్డు, ఆధార్ కార్డు కలిగి ఉండలన్నారు. శిక్షణా కాలంలో ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తామన్నారు. ఉచిత శిక్షణ కోసం పేర్లు నమోదు చేసుకునేందుకు 9492583484 నంబరులో సంప్రదించాలని కోరారు.

మహబూబ్‌జాన్‌కు పురస్కారం

ఒంగోలు(కల్చరల్) మార్చి 16: ప్రకాశం జిల్లా ముస్లిం రచయితల సంఘం అధ్యక్షుడు, ప్రముఖ కవి షేక్ మహబూబ్‌జాన్ హైదరాబాద్ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రతిష్ఠాత్మక కీర్తి పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ మేరకు యూనివర్సిటీని నుంచి వర్తమానం వచ్చినట్లు మహబూబ్ జాన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20న హైదరాబాద్ ఎన్టీఆర్ కళాప్రాంగణంలో పురస్కారం, రూ.5116 నగదు పారితోషికాన్ని అందించనున్నారు. కాగా ఆయనకు పురస్కారం లభించటం పట్ల ప్రరసం అధ్యక్షులు పొన్నూరి వేంకట శ్రీనివాసులు, కార్యదర్శి యత్తప కొండారెడ్డి, పాలూరి శివప్రసాద్, సాధీర్, సాలార్, జబ్బార్, పొత్తూరి బదరి తదితరులు అభినందనలు తెలిపారు.

డాక్టర్ రమేష్‌కృష్ణకు..

అదేవిధంగా ప్రముఖ ప్రవచనకర్త టీటీడీ ఆళ్వార్ ప్రబంధ ప్రాజెక్టు కళాకారుడు డాక్టర్ రామచంద్రుని రమేష్‌కృష్ణకు ఆంధ్ర నాట్యంలో ఆయన చేసిన కృషికి తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారం లభించింది. ఈ నెల 21వ తేదీన హైదరాబాద్ లలిత కళాతోరణంలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో ఆయనకు పురస్కారాన్ని అందజేయనున్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభించిన అతిథులు

ఒంగోలు(కల్చరల్) మార్చి 16: వేసవికాలం దృష్టా ఒంగోలు నగరం ట్రంక్ రోడ్‌లో వీఐపీ ఫ్రీజర్ బాక్స్ నిర్వాహకులు కిలారి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రముఖ వైద్యులు అబ్బూరి రవీంద్రబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు వేసవిలో ఎటువంటి ఇబ్బంది లేకుండా చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు, శివం ఫౌండేషన్ అధ్యక్షుడు గొల్లపూడి శ్రీహరి, రెడ్‌క్రాస్ మహిళా నాయకురాలు కోసూరి శ్రీదేవి, వడ్డెంపడి సుజాతరావు, చిక్కాల కిరణ్ కుమార్, దోస్తీ ఫౌండేషన్ అధ్యక్షుడు షేక్ మహబూబ్, డాక్టర్ మొగిలి దేవ, నత్తల శ్రీనివాసరావు, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు త్యాగరాజస్వామి ఆరాధనోత్సవం

ఒంగోలు(కల్చరల్) మార్చి 16: సర్వరాగసుధ సంస్థ రజతోత్సవం సందర్భంగా ఆదివారం త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవం నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు మోదుమూడి సుధాకర్, పోపూరి గౌరీనాథ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు సాయంత్రం 5 గంటల నుంచి స్థానిక కేశవస్వామిపేట శ్రీప్రసన్నచెన్నకేశవస్వామి దేవస్థాన ప్రాంగణంలోని కళ్యాణ మండపంలో త్యాగరాజ స్వామి వారికి పూజా కార్యక్రమం, త్యాగరాజ కీర్తన నృత్య ప్రదర్శన, డాక్టర్ కేఆర్‌వీ.ప్రసాద్ వీణ కచేరి, త్యాగరాజ కీర్తనల గానం ఉంటాయన్నారు. ప్రముఖ శాస్త్రీయ సంగీత విద్వాంసులు మంగళంపల్లి బాలమురళీకృష్ణ శిష్యులు డీవీ.మోహనకృష్ణ గాత్ర కచ్చేరి రాత్రి 7.50లకు ఉంటుందని తెలిపారు. అదేవిధంగా పలువురు స్థానిక సంగీత విద్వాంసులు సైతం శాస్త్రీయ సంగీతాన్ని ఆలపిస్తారని, సంగీతాభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

టెన్త్ పరీక్ష కేంద్రాల పరిశీలన



ఉప్పుగుండూరులో పరిశీలిస్తున్న ఎంఈవోలు

నాగులుప్పలపాడు, మార్చి 16 : మండలంలోని పదో తరగతి పరీక్ష కేంద్రాలను శనివారం సంబంధిత అధికారులు పరిశీలించారు. ఈనెల 18వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు నిర్వహించనున్న నేపథ్యం లో ఉప్పుగుండూరు, అమ్మనబ్రోలు హైస్కూళ్లలోని పరీక్ష కేంద్రాలను ఎంఈవోలు తిరుమలశెట్టి రవి, ఈవీ.రమణయ్య తనిఖీ చేశారు. విద్యార్థులకు ఇబ్బందిలేకుండా విద్యుత్, తాగునీరు ఇతర సౌకర్యాలను కల్పించాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు.

'ప్రైవేటు'లో ఒకటో తరగతి ఉచిత ప్రవేశాలకు దరఖాస్తులు

నాగులుప్పలపాడు, మార్చి 16: పేద విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్యనందించేందుకు ఒకటో తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని ఎంఈవోలు టి.రవి, ఈవీ.రమణయ్య శనివారం ఓ ప్రకటనలో కోరారు. విద్యాహక్కు చట్టం ప్రకారం 2024-25 విద్యాసంవత్సరంలో ఒకటో తరగతి చదివేందుకు ఉచిత ప్రవేశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఉప్పుగుండూరు-3, నాగులుప్పలపాడు-1, అమ్మనబ్రోలు-2, మాచవరం-1, తిమ్మసముద్రం-1లో ప్రైవేటు పాఠశాలు ఉన్నాయన్నారు. వాటిల్లో ఒకటో తరగతిలో ఉచితంగా చదవగోరే విద్యార్థులు ఈనెల 25 లోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో వారందరికీ ప్రభుత్వం ఉచితంగా విద్య అందిస్తుందని చెప్పారు. పూర్తి వివరాలకు గ్రామ సచివాలయాలు, ఎంఈవో కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

వలంటీర్లకు మంత్రి తాయిలాలు

మద్దిపాడు, మార్చి 16: మద్దిపాడు మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మంత్రి మేరుగ నాగార్జున వలంటీర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వలంటీర్లు తమ పరిధిలోని 50 కుటుంబాలతో మంచి సంబంధం కలిగి ఉండాలన్నారు. అనతరం వలంటీర్లకు రూ.5వేల చొప్పున నగదు పంపిణీ చేశారు. అనంతరం నందిపాడు, తెల్లబాడు, దొడ్డవరం గ్రామాల్లోని సీసీ రోడ్లు, రైతు భరోసా కేంద్రాలను మంత్రి ప్రారంభించారు. వైసీపీ ప్రభుత్వం పేదల అభ్యున్నతి కోసం పనిచేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ అరుణ, ఎంపీటీసీలు కోటిరెడ్డి, మెరుగు సుజాత, ఉన్నం ప్రసీద, మెరుగు చి న్న, మండవ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడులో..

నాగులుప్పలపాడు: స్థానిక మండల కార్యాలయంలో శనివారం వలంటీర్లతో మంత్రి మేరుగ నాగార్జున ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీల వారీగా వలంటీర్లకు తాయిలాలను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నలమలపు కృష్ణారెడ్డి, పోలవరపు శ్రీమన్నారాయణ, గంగి ఓబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు సర్వం సిద్ధం

రేపటి నుంచి ప్రారంభం ● కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు(విద్య), మార్చి 16 : జిల్లాలో సోమవారం నుంచి ప్రారంభమవుతున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు కలెక్టర్‌దినేష్‌కుమార్ తెలిపారు. శనివారం సాయంత్రం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో పదవ తరగతి పరీక్షలకు 30,928 మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు తెలిపారు. వీరిలో రెగ్యులర్ 29,449 మంది కాగా ప్రైవేటు విద్యార్థులు 1479 మంది ఉన్నారన్నారు. 170 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని, పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45వరకు జరుగుతాయని తెలిపారు. విద్యార్థులు పరీక్షకు అరగంట ముందుగా కేంద్రాలకు చేరుకోవాలన్నారు. ప్రధాన ద్వారం వద్దనే విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీలు చేసిన తర్వాత లోపలికి అనుమతిస్తారని కలెక్టర్ తెలిపారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తామని తెలిపారు. పరీక్షల్లో అవకతవకలకు పాల్పడితే యాక్టు 25 ప్రకారం కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాపీయింగ్‌ను నిరోధించేందుకు 73 సిట్టింగ్‌స్క్వాడ్‌లను ఏర్పాటు చేశామన్నారు. 23మంది రెవెన్యూ, 25 మంది విద్యాశాఖ సిబ్బందితోపాటు మరో 23 మంది సీ సెంటర్ కస్టోడియన్లతో స్క్వాడ్లు ఏర్పాటు చేశామన్నారు. వీరికి అదనంగా జిల్లాస్థాయిలో 9 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, మరో ఇద్దరు ప్రత్యేక తనిఖీ అధికారులు కేంద్రాల తనిఖీని నిర్వహిస్తారన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించడంతోపాటు ప్రత్యేక పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు గ్రామాల నుంచి సకాలంలో కేంద్రాలకు చేరుకునేందుకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించామన్నారు. అలాగే కేంద్రాలను నో సెల్‌ఫోన్ జోన్లుగా ప్రకటించినట్లు తెలిపారు. కేంద్రాల్లో తాగునీటి సౌకర్యంతోపాటు ఇతర మౌలిక సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. విద్యార్థుల్లో ఎవరికైనా శారీరక వైకల్యంతో పరీక్ష రాయలేకపోతే వారికి ప్రత్యేకంగా స్క్రైబ్‌లను ఏర్పాటు చేయడంతోపాటు ఆ విద్యార్థులకు అదనంగా గంట సమయం కేటాయించినట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణ కోసం 78427772394, 7842777439 నెంబర్లు కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. సమావేశంలో పరీక్షల రాష్ట్ర పరిశీలకులు ప్రసన్నకుమార్, డీఈవో సుభద్ర, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ శివకుమార్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాక్షసపాలన ముగిసింది !

● ఒంగోలులో తెలుగు తమ్ముళ్ల సంబరాలు



సంబరాలు చేసుకుంటున్న శ్రేణులు

రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఒంగోలులో సంబరాలు జరుపుకున్నారు. రాష్ట్రాన్ని పట్టి పీడిస్తున్న ఐదేళ్ళ సైకో రాక్షస పాలన ముగిసిందని, వైసీపీపై ప్రజలు విసుగు చెందారని, రాబోయేది, ప్రజలు గెలిపించేది సంక్షేమ కూటమి టీడీపీ, జనసేన, బీజేపీలనే అంటూ తెలుగు తమ్ముళ్ళు బాణ సంచాకాల్చి సంబరాలు జరుపుకున్నారు. శనివారం స్థానిక అద్దంకి బస్టాండ్ వద్ద ఎన్టీఆర్ విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. - ఒంగోలు (కార్పొరేషన్)

పలు గ్రామాల్లో బలగాల కవాతు



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు, బలగాలు

సంతనూతలపాడు, మార్చి 16: కేంద్రం ఎన్నికల కమిషన్ శనివారం ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడంతో కోడ్ అమల్లోకి వచ్చింది. ఈక్రమంలో కేంద్ర బలగాలు మండలంలోని సంతనూతలపాడు, పిత్కళ్లపాడు, చిలకపాడు, ఎమ్.వేములపాడు గ్రామాల్లో సీఐ అజయ్‌కుమార్, ఎస్సై దేవకుమార్ ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రజలు సహకరించాలని వారు కోరారు.

పేద కళాకారునికి ఆర్థిక సహాయం



నగదును అందజేస్తున్న నిర్వాహకులు

ఒంగోలు(కల్చరల్) మార్చి 16: గుంటూరుకు చెందిన నిరుపేద కళాకారుడు రమణమూర్తి ఎన్టీఆర్ వేషానికి పెట్టింది పేరు. అయితే అతను రోజు గడవక ఎంతో ఇబ్బంది పడుతుండగా ఒంగోలు సూర్యశ్రీ ట్రస్ట్ నిర్వాహకులు స్పందించారు. శనివారం ఒంగోలులోని సూర్యశ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆల్ ఇండియా కళారంగం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ చల్లా నాగేశ్వరమ్మ చేతులమీదుగా రమణమూర్తికి ట్రస్ట్ సెక్రటరీ సర్దార్‌బాషా ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షురాలు షేక్ సహనాజ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి తెరుచుకోనున్న గ్రానైట్ పరిశ్రమలు

మార్టూరు, మార్చి 16: మార్టూరు ప్రాంతంలో మూసివేసిన గ్రానైట్ పరిశ్రమలు ఆదివారం నుంచి తెరుచుకోనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం గ్రానైట్ పరిశ్రమల యజమానుల సమస్యలను పరిష్కరించాలని, సంక్షోభంలో కూరుకు పోతున్న గ్రానైట్ పరిశ్రమను కాపాడాలని కోరుతూ ఈనెల 8 నుంచి ఈ ప్రాంతంలోని సుమారు 200 గ్రానైట్ పరిశ్రమలను యజమానులు మూసివేశారు. ఇదిలాఉండగా గత నాలుగు రోజుల నుంచి కృష్ణా జిల్లా మైనింగ్ విజిలెన్స్ ఏడీ ప్రతాపరెడ్డి, నెల్లూరు ఏడీ బాలాజీ నాయక్ ఆధ్వర్యంలో రెండు బృందాలతో మార్టూరు మండలంలోని జొన్నతాళి సెంటరు సమీపంలోని కామేపల్లి లక్ష్మీ ప్రసాద్‌కు చెందిన రెండు గ్రానైట్ పరిశ్రమలను తనిఖీ చేశారు. అతనికి చెందిన బల్లికురవ, సంతమాగులూరు మండలాలలోని గ్రానైట్ క్వారీలను తనిఖీ చేయడానికి ప్రయత్నాలు చేశారు. ఒకవైపు గ్రానైట్ పరిశ్రమలను మూత వేయడం, మరోవైపు మైనింగ్ విజిలెన్స్ అధికారుల తనిఖీలతో మార్టూరు ప్రాంతంలోని గ్రానైట్ పరిశ్రమల యజమానుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఎట్టకేలకు గ్రానైట్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని అధికార పార్టీ నేతలు ఇచ్చిన హామీలమేరకు మూసివేసిన గ్రానైట్ పరిశ్రమలను తెరవాలని అసోసియేషన్ నిర్ణయించింది.

జింకను కాపాడిన విద్యార్థులు

కనిగిరి, మార్చి 16 : కనిగిరి సమీపంలోని డిగ్రీ కళాశాల వద్ద కుక్కల గుంపు జింకపై దాడిచేసి గాయపరచే సమయంలో విద్యార్థులు దానిని కాపాడి అటవీశాఖ అధికారులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. శుక్రవారం ఎమ్మెల్యే మధుసూదన్‌యాదవ్ ఇంటి సమీపంలో జింక రావడంతో కుక్కలు వెంటపడ్డాయి. దీంతో చెట్లపొదల్లోకి వెళ్లి దాక్కున్న జింకను స్థానికుల సమాచారంతో అటవీ అధికారులు వచ్చి సంరక్షించి కొండల్లో ఒదిలేశారు. తిరిగి శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని మైదానంలోకి వచ్చిన జింకపై కుక్కల గుంపు దాడి చేయబోగా విద్యార్థులు వాటిని తరిమికొట్టి అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు జింకను సంరక్షించి పునుగోడు కొండల అవతల ఉన్న అటవీ ప్రదేశాల్లో ఒదిలేశారు. కనిగిరి ఫారెస్ట్ రేంజర్ రామిరెడ్డి, జింకను కాపాడిన విద్యార్థులను అభినందించారు.

జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు ● ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజాప్రతినిధుల ఫొటోల తొలగింపు ● కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 16: జిల్లాలో సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినందున నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ దినేష్‌కుమార్ హెచ్చరించారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ వచ్చినందున ప్రభుత్వ భవనాలపై ఉన్న అన్ని రకాల వాల్‌రైటింగ్‌లు, పోస్టర్లు, కటౌట్లు, హోర్డింగ్‌లు, జెండాలు వంటివి తొలగించేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. మరోవైపు రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లను తొలగిస్తామని, ప్రభుత్వ నిధులతో జారీ చేసే అన్నిరకాల ప్రకటలను నిలిపివేసినట్లు తెలిపారు. ప్రభుత్వ వైబ్‌సైట్లలో ఉన్న మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీలకు సంబంధించిన ఫొటోలను కూడా తొలగించేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఎన్నికల ప్రకటన వచ్చినందున మంత్రులు అధికారిక వాహనాలను ఎన్నికల ప్రచారంలో వినియోగించకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో చర్యలు చేపట్టామన్నారు. ఎన్నికల సందర్భంగా రాజకీయ పార్టీలు నిర్వహించే సభలు, ర్యాలీలకు రెండు పార్టీలకు ఒకేసారి అనుమతి ఇవ్వకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ భవనాలు, కార్యాలయాల్లో ఉన్న సీఎంతో సహా మంత్రులు ఫొటోలు లేకుండా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ వెల్లడించారు. ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు ఎవరైనా ఏ రాజకీయ



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

పార్టీకైనా అనుకూలంగా వ్యవహరించినా, పార్టీలు నిర్వహించే ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నా చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం అంశాల వారీగా కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో జేసీ గోపాలకృష్ణ పాల్గొన్నారు.

వైద్యశాలల్లో రాజకీయ నేతల ఫొటోలు తొలగించాలి

● ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే చర్యలు

● డీఎంహెచ్‌వో రాజ్యలక్ష్మి హెచ్చరిక



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రాజ్యలక్ష్మి

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 16: సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ వచ్చినందున ప్రభుత్వ వైద్యశాలలు, 108, 104, తల్లీబిడ్డ వాహనాలపై ఉన్న ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి, మంత్రుల ఫొటోలు, ఇతర ప్రజాప్రతినిధుల చిత్రాలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి ఆదేశించారు. ఒంగోలులోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో శనివారం సంబంధిత వైద్యాధికారులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో కోడ్ అమలులో ఉన్నందున ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలను అమలు చేయాలన్నారు. ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ఎట్టి పరిస్థితుల్లోనూ ఎన్నికల ప్రచారంలో పాల్గొనకూడదని స్పష్టం చేశారు. ఎన్నికల్లో సర్వీసు నిబంధనలను ఉల్లంఘించేందుకు ప్రయత్నిస్తే క్రిమినల్ కేసులు నమోదు అవుతాయని హెచ్చరించారు. ఇక నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం కేవలం ఆరోగ్య సురక్షగానే నిర్వహించాలన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఇంకా పంపిణీ చేయాల్సిన ఆరోగ్యశ్రీ కార్డులను వెంటనే వైద్య అధికారికి అందించాలన్నారు. ప్రతి శుక్రవారం కలెక్టర్ వైద్యశాఖకు సంబంధించిన అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహిస్తారని, అందువల్ల లక్ష్యానికి అనుగుణంగా పనిచేయాలని సూచించారు. ప్రధానమంత్రి మాతృ వందన యోజన కింద మొదటి కాన్పు లబ్ధిదారులను నమోదు చేసి వెంటనే వారి వివరాలను బ్యాంకు ఖాతాలకు లింక్ చేయలని ఆదేశించారు. సమావేశంలో ఉప వైద్యాధికారి మాధవీలత, డాక్టర్ వాణిశ్రీ, డాక్టర్ పద్మజ, మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మూడేళ్లలో 20 మంది కార్యదర్శులు!

కాకుటూరివారిపాలెంలో వైసీపీ నేతల దెబ్బకు పదేపదే మార్పు ● టీడీపీ సర్పంచ్ చేసే అభివృద్ధి పనులకు సహకరిస్తున్నారని అక్కసు

టంగుటూరు, మార్చి 16 : మండలంలోని కాకుటూరివారిపాలెంలో వైసీపీ అధికార దుర్వినియోగానికి పాల్పడటం అలవాటుగా మారింది. ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ వచ్చినప్పటి నుంచి అక్కడి వైసీపీ నాయకుల కక్ష సాధింపు చర్యలు పరాకాష్టకు చేరాయి. సర్పంచ్ పదవి తమ చేతిలో లేకున్నా పంచాయతీలో తాము చెప్పినట్లే జరగాలని వారు పట్టుబడుతున్నారు. తాము చేసిందే శాసనం, గీసిందే గీత అన్నట్లు వ్యవహరిస్తున్నారు. పంచాయతీలో టీడీపీకి చెందిన సర్పంచ్ ద్వారా జరుగుతున్న అభివృద్ధి పనులను అడుగడుగునా అడ్డుకుంటున్నారు. ఇప్పటికే పంచాయతీలో వీరి దెబ్బకు 19 మంది కార్యదర్శులు మారిపోయారు. తాజాగా మూడేళ్ల సర్పంచ్ పదవీ కాలానికి 20వ కార్యదర్శిని కూడా మార్చి వేశారు. ఇక్కడ పనిచేసిన వారిలో ఇద్దరు మినహా అంతా ఇన్‌చార్జి కార్యదర్శులే కావడం ప్రత్యేకతగా చెప్పవచ్చు. పంచాయతీకి ఇన్‌చార్జి కార్యదర్శి రావడం, వారు సర్పంచ్ చేసే అభివృద్ధి పనులకు సహకరించడం, వెంటనే గ్రామంలోని వైసీపీ నాయకులు అప్రమత్తమై సర్పంచ్ ఆధ్వర్యంలో చేపట్టిన పనులు నిలిపివేయాలని కార్యదర్శిపై ఒత్తిడి పెంచడం, ఇందుకు కార్యదర్శి సహకరించకపోవడంతో అధికారులపై ఒత్తిడి తెచ్చి మార్పించడం కొనసాగుతోంది. ఈవిధంగా 20 మందిని మార్చిన ఘనత గ్రామంలోని అధికారపార్టీ నాయకులకే దక్కింది.



కాకుటూరివారిపాలెం గ్రామ పంచాయతీ భవనం

టీడీపీ మద్దతురాలు కావడమే నేరమా..

గడచిన పంచాయతీ ఎన్నికల్లో టీడీపీ మద్దతుతో కొమ్మినేని రమణమ్మ సర్పంచ్‌గా ఇక్కడ విజయం సాధించారు. ఆమె టీడీపీ కావడమే నేరంగా అధికారపార్టీ భావిస్తోంది. ఏడు పదుల వయసులో ఉన్న సర్పంచ్ తన కుమారుల సహకారంతో పంచాయతీని అభివృద్ధి చేయాలని తపనపడుతుండటం అధికారపార్టీ నేతలకు మింగుడు పడడం లేదు. గ్రామంలో ఆర్‌అండ్‌బీ (కొండపి) రోడ్డును ఆక్రమించి పొగాకు బ్యారన్ నిర్మిస్తుంటే అడగటానికి వీలు లేదు. అలాగే ఊరిలోని బీసీ కాలనీలో పంచాయతీ స్థలం, ప్రధాన కాలువ ఆక్రమించి బ్యారన్ నిర్మిస్తున్నా పట్టించుకునే వారు లేదు. ఎందుకంటే అక్రమంగా బ్యారన్లు నిర్మిస్తున్న రైతు అధికారపార్టీ నేత కావడం. కార్యదర్శులు లేక గ్రామ అభివృద్ధి పూర్తిగా కుంటుపడుతోంది. సర్పంచ్‌కి అధికారుల నుంచి సహకారమే కరువైంది. అధికారపార్టీ అరాచకాలను చూస్తున్న గ్రామస్థులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

కొండపిలో ఫ్లెక్సీల తొలగింపు

'కోడ్' అమలుతో విగ్రహాలకు ముసుగులు

పార్టీ రంగులకు వైట్‌వాష్

కొండపి, మార్చి16 : ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో అధికారులు కోడ్ అమల్లోకి తెచ్చారు. తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది వీఆర్‌ఏల సాయంతో మండల కార్యాలయాల ప్రాంగణంలోని పార్టీ జెండాలు, ఫ్లెక్సీలు, కార్యాలయం వెలుపల ఉన్న ఫ్లెక్సీలను శనివారం తొలగించారు. దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి, దివంగత కొండపి సర్పంచ్ రావెళ్ల వెంకయ్య విగ్రహాలకు ముసుగులు వేశారు. పార్టీ రంగులు ఉన్న దిమ్మెలకు వైట్‌వాష్ వేయించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్న ముఖ్యమంత్రి జగన్ ఫొటోలు కూడా పలువురు అధికారులు తీయించారు. రెండు రోజుల ముందే కొండపి నియోజకవర్గంలోని పలుగ్రామాల్లో ఓట్లు అభ్యర్థిస్తూ వైసీపీ కొండపి అసెంబ్లీ అభ్యర్థిగా ఆదిమూలపు సురేష్, ఒంగోలు పార్లమెంటు అభ్యర్థిగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డితోపాటు జగన్, బాలినేని శ్రీనివాసరెడ్డిల ఫొటోలతో ఉన్న వాల్‌పోస్టర్లను అంటించారు. పబ్లిక్ ప్రదేశాల్లో అంటించిన వాటిని కూడా సిబ్బంది తొలగిస్తున్నారు.





ఫ్లెక్సీని తొలగిస్తున్న వీఆర్‌ఏలు, వైఎస్సార్ విగ్రహానికి వేసిన ముసుగు

ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి

నివాళులర్పించిన అధికారులు, ప్రజాప్రతినిధులు



నివాళులర్పిస్తున్న దామచర్ల, గొట్టిపాటి, రియాజ్

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 16 : అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను శనివారం ఘనంగా జరిగాయి. ఒంగోలులోని సీవీఎన్ రీడింగ్ రూం వద్ద ఉన్న శ్రీరాములు విగ్రహానికి పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు నివాళులర్పించారు. ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, మేయర్ గంగాడ సుజాత, ఆర్డీవో సుబ్బారెడ్డితో పాటు పలు శాఖల అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ అధికారి జగన్నాథరావు, బీసీ వెల్ఫేర్ అధికారి అంజల, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పంప్రసాద్, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో...

జిల్లా పరిపాలన భవన్(కలెక్టరేట్)లో శ్రీరాములు జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. జిల్లా రెవెన్యూ అధికారి ఆర్.శ్రీలత అమరజీవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయంలో..

అమరజీవి పొట్టి శ్రీరాములు జీవితాన్ని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ బి.హరిబాబు పిలుపునిచ్చారు. స్థానిక ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయంలో శనివారం శ్రీరాములు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ మండే హర్షప్రీతమ్ దేవ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజమోహన్, జి.సోమశేఖర్, డాక్టర్ నిర్మలమణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

టీడీపీ ఆధ్వర్యంలో..

ఒంగోలు(కార్పొరేషన్): పొట్టిశ్రీరాములు జయంతిని పురస్కరించుకుని స్థానిక సీవీఎన్ రీడింగ్ రూము దగ్గర ఉన్న ఆయన విగ్రహానికి తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల జనార్దన్, అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్, జనసేన అధ్యక్షులు షేక్ రియాజ్ పాల్గొని నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆయా పార్టీల శ్రేణులు పాల్గొన్నారు.

ఉప్పుగుండూరులో..

నాగులుప్పలపాడు: పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఉప్పుగుండూరులో ఘనంగా నిర్వహించారు. పార్కు వద్దనున్న శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు కొంజేటి వెంకటసురేష్ బాబు, మోటుమర్రి నాగేశ్వరరావు, అమరా వేణు, దేసు రవి, సుధాకర్, పులకణం రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సంతనూతలపాడులో..

సంతనూతలపాడు: అమరజీవి పొట్టిశ్రీరాములు జయంతిని పురస్కరించుకుని శనివారం సంతనూతలపాడులో ఆర్యవైశ్యమందిరం వద్ద వాసవి, మహిళాక్లబ్ ఆర్యవైశ్యకమిటీ ఆధ్వర్యంలో పొట్టిశ్రీరాములు, గాంధీజీ విగ్రహాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో వాసవిక్లబ్ అధ్యక్షుడు వీవీ.శేషారావు, మందిరం సెక్రటరీ పి.ఆంజనేయులు, అధ్యక్షులు వేమామల్లేశ్వరరావు, వెంకటక్రిష్ణారావు, వెంకటేశ్వర్లు, రాము పాల్గొన్నారు.



ఉప్పుగుండూరులో..



సంతనూతలపాడులో..

నేడు బొప్పూడిలో ప్రజాగళం

హాజరుకానున్న ప్రధాని మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్

జిల్లా నుంచి భారీగా తరలుతున్న టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు

ఒంగోలు, మార్చి 16, (ఆంధ్రజ్యోతి): సాధారణ ఎన్నికలలో వైసీపీని మట్టికరిపించి, టీడీపీ నేతృత్వంలోని కూటమి విజయమే లక్ష్యంగా ఆదివారం చిలకలూరిపేట సమీపంలోని బొప్పూడి వద్ద భారీ బహిరంగసభ జరగనుంది. కూటమిలో భాగస్వామ్యమైన మూడు పార్టీల తరపున ప్రధాని నరేంద్రమోదీ, టీడీపీ అధ్యక్షులు చంద్రబాబునాయుడు, జనసేన అధ్యక్షులు పవన్‌కళ్యాణ్ వంటి అగ్రనేతలు సభలో పాల్గొననున్నారు. రానున్న ఎన్నికలలో రాష్ట్రంలోని ఆ పార్టీల శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్నారు. సభకు ప్రజాగళం అని పేరు పెట్టారు. రాష్ట్ర భవిష్యత్ కోసమే మూడు పార్టీల మధ్య ఎన్నికల పొత్తు పెట్టుకుని ముందుకు పోతున్నారు. భారీగా మూడు పార్టీల శ్రేణులు సమీకరిస్తున్నారు. లక్షల మందితో నిర్వహించే ఈ సభ ఆదివారం మధ్యాహ్నం తర్వాత ప్రారంభం కానుండగా, సాయంత్రం 5 గంటలకు మోదీ ఈ సభలో పాల్గొంటారు. సభ జరిగే ప్రాంగణం ఉమ్మడి ప్రకాశం జిల్లాకు సమీప ప్రాంతం కావడంతో జిల్లా నుంచి మూడు పార్టీల శ్రేణులు భారీగా ఆ సభకు తరలుతున్నారు. ప్రధానంగా టీడీపీ నేతలు జనసమీకరణపై దృష్టిసారించారు. ఇప్పటికే ఆయా అసెంబ్లీ స్థానాల్లో పోటీచేసే అభ్యర్థులను అధిష్ఠానం ప్రకటించిన నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల ప్రచారం జోరందుకుంది. టీడీపీతోపాటు భాగస్వామ్యమైన పక్షాల కేడర్ మంచి ఊపు మీద ఉన్నారు. ఆయా నియోజకవర్గాల నుంచి భారీగానే సభకు కార్యకర్తలు తరలివెళ్లనున్నారు. ఒంగోలు, ఎస్ఎన్‌పాడు, కొండపి, దర్శిల నుంచి అధికంగా వెళ్లే అవకాశం ఉండగా, ముఖ్యనేతలు అందరూ అందుకు సంబంధించిన ఏర్పాట్లపై శుక్రవారమే పూర్తిగా నిమగ్నమయ్యారు.

ప్రజాగళం సభకు పెద్దఎత్తున తరలిరండి

● విజయ్‌కుమార్ పిలుపు

చీమకుర్తి, మార్చి16 : ప్రజాగళం సభకు ప్రజలు పెద్దఎత్తున తరలిరావాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం చీమకుర్తి పట్టణంలోని టీడీపీ కార్యాలయ ఆవరణలో జరిగిన ప్రత్యేక సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. చిలకలూరిపేట సమీపంలోని బొప్పూడి వద్ద టీడీపీ, జనసేన, బీజేపీ ఆధ్వర్యంలో జరగనున్న ఈ సభలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ పాల్గొనే ఈ సభను నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు అడకా స్వాములు, మన్నం ప్రసాద్, గొల్లపూడి సుబ్బారావు, గొట్టిపాటి రాఘవరావు, సూరంపల్లి హనుమంతరావు, అవిశినేని వెంగన్న, కాట్రగడ్డ రమణయ్య, ఉన్నం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

చీమకుర్తిలో వలంటీర్లకు తాయిలాలు?

చీమకుర్తి, మార్చి16 : చీమకుర్తి పట్టణంలో శనివారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో పట్టణం, మండలంలోని వలంటీర్లకు వైసీపీ అభ్యర్థి తరపున ఎన్నికల తాయిలాలు అందించినట్లు తెలుస్తున్నది. ఒక్కొక్కరికి ఐదువేల రూపాయలు చొప్పున కవర్‌లో పెట్టి పంపిణీ చేసినట్లు విశ్వసనీయ సమాచారం. కొంత మంది మీడియా ప్రతినిధులకు సైతం తాయిలాలు అందించినట్లు వార్తలు షికారు చేస్తున్నాయి.

ఏపీఈసెట్‌కి ఉచిత శిక్షణ

ఒంగోలు(కార్పొరేషన్), మార్చి 16 : ఒంగోలు నగరం అంజయ్యరోడ్‌లో గల లాజిక్ అకాడమి ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పూర్తి చేసిన విద్యార్థులకు ఏపీఈసెట్ (ఒసెట్) పోటీ పరీక్షకు ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు డైరెక్టర్ పాలపర్తి విజయ్‌భాస్కర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ నిరుపేద విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణలో భాగంగా స్పోకెన్ ఇంగ్లీష్, కమ్యూనికేషన్ స్కిల్స్ నేర్పిస్తామని, ఈ నెల 21 నుంచి అడ్మిషన్లు ప్రారంభమవుతాయని, ఆసక్తి కలిగిన విద్యార్థులు సెల్ : 7207012758 ద్వారా పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు.

టీడీపీలో చేరికల జోరు

- న్యాయవాది కంది నారాయణరెడ్డి చేరక
- మాగుంటతో పాటు సైకిలెక్కిన ఐటీవరంలోని పలువురు నేతలు



కందుల సమక్షంలో టీడీపీ కండువా కప్పుకున్న న్యాయవాది కంది నారాయణరెడ్డి

మార్కాపురం రూరల్, మార్చి 16: మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సమక్షంలో వైసీపీ కీలక నేతలు టీడీపీలో చేరారు. పట్టణంలోని న్యాయవాది కంది నారాయణరెడ్డి ఇంట్లో ఆయనతో పాటు గోగులదిన్నె మూడో వార్డు సభ్యుడు గృహసారధి తంగిరాల వెంకటరెడ్డి, ముఖ్య నాయకులు కె.జాను, వినయ్‌కుమార్, దారివేముల డింపు, దొడ్డ రమణారెడ్డి, అలంకార్ మస్తాన్‌వలి, నల్లగట్ల శేషు, కోల అశోక్‌లతో పాటు 20 కుటుంబాలు వైసీపీని వీడి కందుల నారాయణరెడ్డి సమక్షంలో శనివారం టీడీపీలో చేరాయి. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ మార్కాపురం ప్రాంతం ప్రత్యేక జిల్లాగా ఏర్పడాలంటే టీడీపీ అధికారంలోకి వస్తేనే సాధ్యమవుతుందనే నమ్మకంతో చేరుతున్నట్లు తెలిపారు. జగన్ పాలనలో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మౌలాలి, జంకె రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పలు కుటుంబాలు చేరిక

పుల్లలచెరువు : మండలంలోని వైసీపీ నుంచి టీడీపీలోకి వలసల పరంపర కొనసాగుతోంది. శనివారం ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి టీడీపీలో చేరిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఆయన వెంట వై పాలెం టీడీపీ అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు, ఒంగోలు ఎంపీ అభ్యర్థి రాఘవరెడ్డిలు ఉన్నారు. వీరితో పాటు పుల్లలచెరువు మండలం ఐటీవరం పంచాయతీ గండిబాయిగూడేంలో పలువురు వైసీపీ కార్యకర్తలు ఆ పార్టీని వీడి టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు రెంటపల్లి సుబ్బారెడ్డి, మానేపల్లి, కవలకుంట్ల సర్పంచులు రమణారెడ్డి, వెంకటరెడ్డి, నాయకులు గోగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, విద్యాకమిటీ చైర్మన్ దూపాటి కొండలు, మేకల అంకరావు, కోమరగిరి ఏడుకొండలు, విజయ కుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాగళం సభను జయప్రదం చేయండి

పొదిలి : నేడు చిలక లూరిపేట బొప్పూడి సమీపంలో జరగనున్న ప్రజాగళం మహాసభను జయప్రదం చేయాలని మార్కాపురం టీడీపీ అభ్యర్థి కందుల నారాయణరెడ్డి కోరారు. రాష్ట్రాభివృద్ధికోసం టీజేపీ, జనసేన బీజేపీలు ఉమ్మడిగా కలిసి ఎన్నికలకు వెళ్లేందుకు సిద్దమైన తరుణంలో మూడు పార్టీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. యువత కోసం, రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలు కృషిచేస్తున్న చంద్రబాబును తిరిగి ముఖ్యమంత్రిగా చేసుకొనేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న పరిస్థితుల్లో టీడీపీ విజయం ఎంత ముఖ్యమో చంద్రబాబు పాలన కూడా అంతే ముఖ్యమన్నారు.



మాగుంట వెంట టీడీపీలో చేరిన కార్యకర్తలు

అవీ..ఇవీ..

తురిమెళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా సోని బాధ్యతలు



గిద్దలూరు, మార్చి 16 : కంభం మండలం తురిమెళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ జి.సోని శనివారం బాధ్యతలు స్వీకరించారు. సోని గుంటూరు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంగ్లీషు అధ్యాపకురాలిగా పని చేస్తూ ఉద్యోగోన్నతిపై తురిమెళ్ల కళాశాలలో ప్రిన్సిపాల్‌గా చేరారు. 2004లో ఆంగ్ల అధ్యాపకురాలిగా నెల్లూరు జిల్లా రావూరులో, ఉప్పుగుండూరు, బాపట్ల, గుంటూరులో పని చేశారు. ఇక్కడ రెండున్నర సంవత్సరాలుగా ప్రిన్సిపాల్ పోస్టు ఖాళీగా ఉండడంతో ఉద్యోగోన్నతిపై ఇక్కడికి వచ్చారు.

మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా షంషీర్ అలీబేగ్



బాధ్యతలు స్వీకరిస్తున్న షంషీర్ ఆలీబేగ్

మార్కాపురం, మార్చి 16: రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్‌గా మార్కాపురానికి చెందిన ఏ1 గ్లోబల్ విద్యా సంస్థల అధినేత, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి, మార్కాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మీర్జా షంషీర్ అలీబేగ్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం ఉదయం తాడేపల్లిలోని మైనార్టీ ఫైనాన్స్ కార్యాలయంలో పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా అలీబేగ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పజెప్పిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, మార్కాపురం, గిద్దలూరు ఎమ్మెల్యేలు కుందురు నాగార్జునరెడ్డి, అన్నా వెంకట రాంబాబులకు కృతజ్ఞతలు తెలిపారు. మైనార్టీల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు అలీబేగ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

నేడు మోడల్ పరీక్ష

గిద్దలూరు, మార్చి 16 : ఉపాధ్యాయ ఉద్యోగ అభ్యర్థులకు ఈ నెల 17న ఉదయం 9.30 గంటలకు సాయిచైతన్య డిగ్రీ కళాశాల ఆవరణలో ఉచిత మోడల్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు రాజేశ్వరి కోచింగ్ సెంటర్ నిర్వాహకులు చీతిరాల ప్రసాద్, రమేష్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. డీఎస్సీకి ప్రిపేర్ అవుతున్న నిరుద్యోగ అభ్యర్థులు వర్తమాన అంశాలపై అవగాహన పెంపొందించేందుకు మోడల్ పరీక్ష ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఎలాంటి ఫీజు లేదని, ఆసక్తి ఉన్న అభ్యర్థులు 9010642093 నెంబరుకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పొదిలి, మార్చి 16 : 2024-25 సంవత్సరానికి కేజీబీవీ 6వతరగతి నుండి 11వ తరగతుల్లో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ అనురాధ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బడిబయట చిన్నారులు, మైనారిటీ, పేద ఎస్సీ, ఎస్టీ, దారిద్రరేఖకు దిగువన ఉన్న బాలికలకు, అనాథలకు ప్రవేశ అర్హత ఉందన్నారు. వీటితోపాటు 7వ తరగతిలో మిగిలిన సీట్ల భర్తీ చేయనున్నట్లు చెప్పారు. మార్చి 12 నుండి ఏప్రిల్ 11వతేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలిపారు. కేజీబీవీ అధికార వైబ్‌సైట్లలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

నేడు ప్రాంగణ ఎంపికలు

కంభం, మార్చి 16 : కంభం వాసవి డిగ్రీ కళాశాలలో ఈ నెల 17న ఆదివారం జీఆర్ఎఫ్ సొల్యూషన్స్ సంస్థ ఆధ్వర్యంలో క్యాంపస్ సెలక్షన్లు నిర్వహించడం జరుగునని వాసవి విద్యాసంస్థల చైర్మన్ గోళ్ళ రత్నం, ప్రిన్సిపాల్ రాములు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 17వ తేది ఉదయం 8.30 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు సెలక్షన్లు జరుగుతాయన్నారు. పాల్గొనే విద్యార్థులు బీఎస్సీ కెమిస్ట్రీ, ఆర్గానిక్ కెమిస్ట్రీ, బిఫార్మా, ఎంఫార్మా, ఐటిఐ, డిప్లమో నందు అర్హత కలిగి 2023-24 సంవత్సరం నందు చదువుతున్న, పూర్తయిన వారు అర్హులని తెలిపారు. కంభం, బేస్తవారపేట, గిద్దలూరు, కొమరోలు, రాచర్ల, అర్ధవీడు మండలాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యార్థులకు పరీక్ష అట్టల పంపిణీ

గిద్దలూరు టౌన్, మార్చి 16 : మండలంలోని ఉయ్యాలవాడ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం చిన్ని ఎడ్యుకేషనల్ & రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష అట్టలను పంపిణీ చేశారు. బత్తుల సుబ్రహ్మణ్యం విద్యార్థులకు పరీక్ష సామాగ్రి సమకూర్చగా వాటిని సొసైటీ అధ్యక్షులు మాగుటూరి శ్రీకాంత్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవి పంపిణీ చేశారు.

ప్రజాగళం సభను విజయవంతం చేయాలి

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 16: చిలకలూరిపేట నియోజకవర్గం బొప్పూడి ప్రజాగళం విజయంతం చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకులు డా. ఏలూరి రామచంద్రారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్‌డీఏ కూటమితోనే దేశ, రాష్ట్ర అభివృద్ధి ఉందన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

గిద్దలూరు, మార్చి 16 : పట్టణంలోని రిటైర్డ్ హోం ఆవరణలో కూలింగ్ మినరల్ వాటర్ చలివేంద్రాన్ని రిటైర్డ్ ఉద్యోగుల, ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షులు జి.రవీంద్రనాథ్‌రెడ్డి ప్రారంభించారు. రెవిన్యూ, ట్రెజరీ కార్యాలయ ాలయానికి వచ్చే ప్రజలకు, రిటైర్డ్ ఉద్యోగుల సౌకర్యార్థం చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

మృతదేహాన్ని పూడ్చే విషయమై వివాదం

- జాతీయ రహదారిపై బంధువుల రాస్తారోకో



ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రసాద్ బంధువులు

కొనకనమిట్ల, మార్చి 16 : మండలంలోని చినారికట్ల గ్రామంలో మృతదేహాన్ని పూడ్చే విషయంపై శనివారం గ్రామస్థులకు మృతుని బందువులకు మధ్య వివాదం చోటుచేసుకొంది. దీంతో మృతుడి కుటుంబ సభ్యులు, బందువులు 565 జాతీయ రహదారిపై భైఠాయించి రాస్తారోకో చేశారు. వివరాల్లోకి వెళితే చినారికట్ల గ్రామానికి చెందిన మాచబత్తుని ప్రసాద్ (52) తాళ్లూరు మండలం గంగవరంలో జేఎల్‌ఎంగా పనిచేస్తున్నాడు. పొదిలి మండలం ఈగలపాడు గ్రామంలో నివాసం ఉంటున్నాడు. ఈనేపథ్యంలో శనివారం ఉదయం ఈగలపాడు గ్రామంలో హఠాత్తుగా ప్రసాద్ గుండెపోటుతో మృతి చెందాడు. మృతదేహాన్ని మృతుని స్వగ్రామం కొనకనమిట్ల మండలంలోని చినారికట్ల గ్రామానికి తీసుకొచ్చారు. ప్రసాద్‌కు పూర్వికుల నుంచి వచ్చిన దొడ్డి ఉంది. అక్కడ మృతదేహానికి అంత్యక్రియలు చేసేందుకు బందువులు సిద్ధం చేశారు. అయితే అదే గ్రామానికి చెందిన తోట అక్కిశెట్టి ఈ దొడ్డి స్థలం తనదని గతంలో తాను కొనుగోలు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ఆ స్థలం కోర్టు కేసులో నడుస్తోందని అభ్యంతరం తెలిపారు. దీంతో వివాదం పెరిగి మృతుడి బందువులు రోడ్డుపై భైటాయించి రాస్తారోకో చేశారు. సమాచారం తెలుసుకున్న కొనకనమిట్ల ఎస్‌ఐ మాధవరావు సిబ్బందితో గ్రామానికి చేరుకొన్నారు. మృతుడి బందువులకు, కుటుంబ సభ్యులకు నచ్చచెప్పి రాస్తారోకో విరమింపజేశారు. అనంతరం రెవెన్యూ అధికారులు గ్రామానికి చేరుకొని ఇరువర్గాలకు నచ్చజెప్పి వివాదం ఉన్న స్థలం కాకుండా విశ్వబ్రహణ స్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. దీంతో గొడవ సద్దు మనిగింది.

వ్యక్తిపై కత్తితో దాడి

కంభం (అర్ధవీడు), మార్చి 16 : ఇంటి బయట నిద్రిస్తున్న వ్యక్తిని అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తి కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరచిన ఘటన అర్ధవీడు మండలం బొమ్మిలింగం గ్రామంలో శనివారం తెల్లవారుజామున చోటుచేసుకొంది. అర్ధవీడు ఎస్సై పావని కథనం ప్రకారం.. బొమ్మిలింగం గ్రామానికి చెందిన రాజేంద్రప్రసాద్, చిన్నరమణయ్యల మధ్య గతంలో వివాదం ఉంది. ఈనేపథ్యంలో ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకున్నారు. శుక్రవారం రాత్రి ఇంటి బయట నిద్రిస్తున్న రాజేంద్రప్రసాద్‌పై శనివారం తెల్లవారుజామున రమణయ్య కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరచి పరారయ్యాడు. గాయపడిన రాజేంద్రప్రసాద్ కుటుంబ సభ్యులు కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నర్సరావుపేటకు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి

- గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఘటన

త్రిపురాంతకం, మార్చి 16: గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధురాలు (65) మృతిచెందిన ఘటన మండలంలోని శ్రీనివాసనగర్ సమీపంలో ఎన్‌హెచ్ 544డీ పై శుక్రవారం రాత్రి చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీనివాస నగర్ వెల్లంపల్లి గ్రామాల మధ్యన కలసల వాగు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధురాలు మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకొని వివరాలు నమోదు చేసుకున్నారు. వృద్ధురాలి వివరాల కోసం విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రాజీమార్గం రాజమార్గం



మాట్లాడుతున్న న్యాయాధికారి శుభవాణి

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 16: రాజీమార్గం రాజమార్గం వంటిదని న్యాయ సేవాధికార సంస్థ మండల అధ్యక్షురాలు, ఆరవ అదనపు జిల్లా న్యాయాధికారి ఎం.శుభవాణి అన్నారు. స్థానిక కోర్టు ప్రాంగణంలో శనివారం లోక్ అదాలత్ పురస్కరించుకుని న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేశారు. లోక్‌అదాలత్‌లో 100 కేసులు పరిష్కరించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జ్ దేవేందర్ రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు సింగం శ్రీనివాస్‌చౌదరి, న్యాయవాదులు పాల్గొన్నారు.

120 కేసులు పరిష్కారం

గిద్దలూరు టౌన్ : స్థానిక కోర్టు ఆవరణలో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 120 కేసులు పరిష్కరించారు. అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి.మేరీసారాదానమ్మ, లోక్‌అదాలత్ బెంచ్ సభ్యులు జి.ఆనంద్‌కుమార్, ఎం.పిచ్చయ్య పాల్గొనగా 120 కేసుల్లో 20 సివిల్ కేసులు, 70 క్రిమినల్ కేసులు, 7 చెక్‌బౌన్స్ కేసులు, మనోవర్తి, గృహహింస కేసులు 13, బిఎస్ఎన్ఎల్ కేసులు 10 ఉన్నాయి. 120 కేసులకు కలిపి రూ.71,10,874 నగదు బాధితులకు పరిహారం అందింది.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 16: మార్కాపురం పట్టణంలోని జవహర్ నగర్‌లో వెలసియున్న ఆమలక లక్ష్మీ నారాయణస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు భక్తజన రంజకంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం రుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణుని కళ్యాణం కనులపండువుగా నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు డా. డీవీ కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి పాలెం చెంచయ్యల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.



రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణుడు



కల్యాణ వేడుకల్లో పాల్గొన్న భక్తులు

ఆశలు గల్లంతు

- ఆ ముగ్గురు ఎమ్మెల్యేలకు మొండిచేయి
- దర్శి, ఎస్ఎన్‌పాడు, కందుకూరులో ఎవరిదారి వారిదే
- చీరాలలో అనుచరులతో ఆమంచి మంతనాలు
- మార్పులులేని వైసీపీ అభ్యర్థుల తుదిజాబితా

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

అధికార వైసీపీలో చివర్లోనయినా అవకాశం లభిస్తుందని ఎదురుచూసిన ప్రముఖుల ఆశలు గల్లంతయ్యాయి. ప్రధానంగా ముగ్గురు ఎమ్మెల్యేలు, ఒక మాజీ ఎమ్మెల్యే ఈ విషయంలో భంగపాటుకు గురయ్యారు. పార్టీకి దూరం కాకుండా కొత్త ఇన్‌చార్జులతో కలవకుండా అనుచరులను వేచి ఉండండని చెప్పుకుంటూ, తుది జాబితా కోసం ఎదురుచూసిన ఆ నేతలకు చివర్లోను చుక్కెదురైంది. వచ్చే ఎన్నికల్లో పోటీచేసే వైసీపీ అభ్యర్థుల జాబితాను జగన్ శనివారం ప్రకటించారు. గత కొంతకాలంగా ఆ నియోజకవర్గాలకు పార్టీ ఇన్‌చార్జులుగా ప్రకటించిన వారికే అవకాశం కల్పించారు. గత ఎన్నికల్లో జిల్లాలో వైసీపీ నుంచి గెలుపొందిన ఎమ్మెల్యేల్లో బాలినేనికి మాత్రమే అదే నియోజకవర్గాన్ని కేటాయించి, మిగిలిన వారినందరినీ మార్చేశారు. ఒంగోలు ఎంపీ మాగుంట స్థానంలో చెవిరెడ్డి భాస్కరరెడ్డికి అవకాశం ఇచ్చి, బాపట్ల ఎంపీ నందిగం సురేష్‌కు తిరిగి అదేస్థానంలో అవకాశం ఇచ్చారు. గత ఎన్నికల్లో గెలుపొందిన వారిలో దర్శి, ఎస్ఎన్ పాడు, కందుకూరు ఎమ్మెల్యేలు వేణుగోపాల్, సుధాకర్‌బాబు, మహీధర్‌రెడ్డికి మాత్రం ఎక్కడ అవకాశం ఇవ్వలేదు. నిన్న మొన్నటివరకు జగన్ ప్రత్యేక ప్రాధాన్యమిచ్చిన చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్‌ను పక్కనపెట్టారు. ఆ పార్టీ ప్రకటించిన అభ్యర్థుల జాబితా ప్రకారం వై.పాలెం ఎమ్మెల్యే సురేష్‌ను కొండపి ఎమ్మెల్యే అభ్యర్థిగా ఖరారు చేశారు. మార్కాపురం ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి గిద్దలూరు, గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు మార్కాపురానికి అభ్యర్థులయ్యారు. కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్‌ను కందుకూరు బరిలో నిలిపారు. బాపట్ల జిల్లా వేమూరు ఎమ్మెల్యే మేరుగ నాగార్జునను ఎస్ఎన్‌పాడు అభ్యర్థిగా ప్రకటించారు. మాజీ ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డిని దర్శి అభ్యర్థిగా ఖరారు చేశారు. కొత్తగా కనిగిరి, వైపాలెం, అద్దంకి, పర్చూరు ఇన్‌చార్జి బాధ్యతలు చేపట్టిన నారాయణ యాదవ్, చంద్రశేఖర్, హనిమిరెడ్డి, బాలాజీలను అవే స్థానాల నుంచి అభ్యర్థులుగా ప్రకటించారు. చీరాల నుంచి అనుకున్నట్లే ఎమ్మెల్యే బలరాం కుమారుడు కరణం వెంకటేష్‌కు అవకాశం కల్పించారు.

కాగా సర్వేల ఆధారంగా ఎప్పటికప్పుడు అభ్యర్థుల విషయంలో చేర్పులు మార్పులు ఉంటాయని జగన్ చెప్పిన మాటలు నమ్మిన నాయకులు భంగపాటుకు గురయ్యారు. తుది జాబితాలో కూడా అవకాశం రాని ఎమ్మెల్యేలు వారి అనుచరులు అధిష్ఠానంపై గుర్రుగా ఉన్నారు. దర్శిలో ఎమ్మెల్యే వేణుగోపాల్ వైసీపీ కార్యక్రమాలకు కూడా దూరం కాగా ఒకరు మినహా ఆయన వర్గంలోని ముఖ్యులంతా వైసీపీ ప్రచారానికి దూరంగా ఉన్నారు. ఇంకా ఎమ్మెల్యే అవకాశం లేదని తేల్చుకున్నవారు వివిధ మార్గాల్లో పయనించేందుకు సిద్ధమయ్యారు. ఎస్ఎన్ పాడులో కూడా చివర్లోనయినా సుధాకర్‌బాబుకు అవకాశం వస్తుందని ఎదురుచూచిన ఆయన అనుచరులు శనివారం సాయంత్రం నుంచి ఎవరి దారిలో వారు పయనించడం ప్రారంభించారు. ఇంతకాలం దూరంగా ఉన్న వారిలో కొందరు నాగార్జునకు టచ్‌లోకి వెళ్లగా అత్యధికులు టీడీపీ కూటమి అభ్యర్థి విజయ్‌కుమార్‌కు టచ్‌లోకి వెళ్లినట్లు తెలుస్తోంది. వారిలో కొందరు ప్రత్యక్షంగా టీడీపీలో చేరేందుకు సిద్ధం కాగా మరికొందరు పరోక్షంగా సహకరిస్తామని చెప్పారు. కందుకూరు ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి చివరి వరకు వేచి చూద్దామని చెప్పిన మాట మేరకు ఆగి ఉన్న ఆయన అనుచరులు శనివారం సాయంత్రం నుంచి ఎవరిదారి వారు చూచుకోవటం ప్రారంభించారు. ఉలవపాడు మండలంలోని రెండు కీలక గ్రామాల వైసీపీ నాయకులు టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావుతో మంతనాలు జరిపారు. వర్గాల ప్రభావం అధికంగా ఉండే ఆ నియోజకవర్గంలోని మానుగుంట వర్గీయుల్లో ఎక్కువ మంది టీడీపీ వైపు దృష్టిసారించగా కొందరు వైసీపీవైపు మరికొందరు తటస్థంగా ఉండాలని నిర్ణయించుకున్నారు. పూర్వం నుంచి మహీధర్ రెడ్డిని అంటిపెట్టుకున్నవారు మాత్రం ఆయన నిర్ణయం కోసం వేచిచూస్తున్నారు.

చీరాలలో ఆమంచి మంతనాలు

సీఎం జగన్‌పై అత్యంత విశ్వాసంతో ఉన్న చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు. తాను వద్దని చెప్పిన కరణం వెంకటేష్‌కు టికెట్ ఇవ్వడం ఆయన జీర్ణించుకోలేకపోతున్నట్లు తెలిసింది. తనకు పర్చూరు అక్కర్లేదు. ఇస్తే చీరాల ఇవ్వండి. కాకుంటే చీరాల నుంచి ఒక బీసీకి అవకాశం ఇవ్వండి. కాదు కూడదని వెంకటేష్‌కు ఇస్తే సహకరించమని సీఎంకు తేల్చిచెప్పారు. అయితే స్థానిక పరిస్థితులకు అనుగుణంగా బలరాం కుమారుడి వైపే సీఎం మొగ్గుచూపారు. దీంతో ఆమంచి భవిష్యత్ కార్యాచరణపై సమాలోచనలు ప్రారంభించారు. వెంకటేష్‌ను ఓడించటమే లక్ష్యమైనందున తాను స్వతంత్ర అభ్యర్థిగా రంగంలోకి దిగటమా, పోటీలో లేకుండా వెంకటేష్‌కు వ్యతిరేకంగా పనిచేయటమా అనే విషయమై తర్జనభర్జన పడుతున్నట్లు తెలిసింది. అయితే మాజీ మంత్రి పాలేటి రామారావు టీడీపీలో చేరటం, బీసీ వర్గానికి చెందిన కొండయ్యను రంగంలో దింపే ఆలోచనలో ఆ పార్టీ ఉండటంతో ఆమంచి ఎలా ముందుకు పోతారనేది చర్చనీయాంశమైంది.

ఎన్నికల నియమావళి అమలు



విగ్రహాలకు ముసుగులు వేస్తున్న మున్సిపల్ సిబ్బంది

గిద్దలూరు టౌన్, మార్చి 16 : రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎలక్షన్ కమిషన్ నేటి నుంచి ఎన్నికల నియమావళిని అమలులోకి తెచ్చింది. శనివారం మధ్యాహ్నం నుంచి ఎన్నికల కోడ్ వచ్చిన నేపథ్యంలో పట్టణంలో ఉండే వివిధ రాజకీయ పార్టీల నాయకుల విగ్రహాలకు మున్సిపల్ నాయకులు ముసుగులు వేశారు. పట్టణంలో ఉన్న ఆయా పార్టీల ఫ్లెక్సీలను, పార్టీ జెండాలను కూడా తొలగించారు.

కోడ్ కూసింది

పొదిలి : దేశంలో సార్వత్రిక ఎన్నికల సందర్భంగా శనివారం కేంద్ర ఎన్నికల సంఘం దేశ వ్యాప్తంగా ఎన్నికల నియమావళిని అమలులోకి తెచ్చింది. దీంతో పట్టణంలో సాయంత్రం 5 గంటల నుంచి ముఖ్య నాయకుల విగ్రహాలకు ముసుగులు వేశారు. పట్టణంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించాలని ఆదేశించారు. 24 గంటలలో తొలగించక పోతే నగర పంచయాయితీ సిబ్బంది తొలగిస్తారని కమిషనర్ చంద్రశేఖర్ తెలిపారు.

వైభవంగా చెన్నకేశవస్వామి శాంతికల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 16: మార్కాపురంలో వెలసిన శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో స్వామికి శాంతి కల్యాణం శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు చెన్నకేశవ స్వామి మూల విరాట్‌కు సుప్రభాత సేవ, అభిషేకాలు, అలంకరణ, అర్చనలు నిర్వహించారు. అనంతరం ఆలయ మధ్యరంగ మండపంలో శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ స్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కళ్యాణ ఘట్టాలు నిర్వహించారు. రాయలసీమ జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామికి మొక్కులు తీర్చుకున్నారు. ఈవో గోలమారి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యం లో కార్యక్రమాలు పర్యవేక్షించారు.

రేపటి నుంచి మహిళలకు ఉచిత శిక్షణ

ఒంగోలునగరం, మార్చి 15: మర్లోని మగ్గం వర్కులో మహిళలకు ఈ నెల 18వ తేదీ నుంచి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు రూడ్‌సెట్ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణకు ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ఉండే మహిళలు అర్హులని, వయస్సు 18 నుంచి 45 సంవత్సరాల లోపు ఉండాలని పేర్కొన్నారు. రేషన్‌కార్డు, ఆధార్ కార్డు కలిగి ఉండలన్నారు. శిక్షణా కాలంలో ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తామన్నారు. ఉచిత శిక్షణ కోసం పేర్లు నమోదు చేసుకునేందుకు 9492583484 నంబరును సంప్రదించాలన్నారు.

నూతన భవనాల ప్రారంభం

గిద్దలూరు, మార్చి 16 : మండలంలోని పొదలకొండపల్లిలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని, రైతు భరోసా కేంద్రాన్ని హెల్త్‌సెంటర్‌ను ఎంపీపీ కడప లక్ష్మీ ప్రారంభించారు. ఎంపీడీవో హేమలతదేవి, మాజీ ఎంపీపీ కడప వంశీధర్‌రెడ్డి, వ్యవసాయాధికారి భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అమరజీవికి ఘన నివాళి





గిద్దలూరులో పొట్టి శ్రీరాములు విగ్రహానికి, చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఆర్యవైశ్యులు

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 16: ఆంధ్రరాష్ట్ర ఏర్పాటు కోసం తన ప్రాణాలు తృణప్రాయంగా త్యజించిన ధన్యజీవి పొట్టి శ్రీరాములు అని వాసవీ విద్యానికేతన్ డైరెక్టర్, ప్రిన్సిపాల్ కందెపు రంగయ్య అన్నారు. స్థానిక పాఠశాలలో పొట్టి శ్రీరాములు జయంతి పురస్కరించుకుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సాయిబాలాజీ పాఠశాలలో డైరెక్టర్ ప్రకాశ్‌రావు, ప్రిన్సిపాల్ సయ్యద్ మస్తాన్‌వలిలు అమరజీవి చిత్రపటానికి నివాళులు అర్పించారు. అవోపా ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతి నిర్వహించారు. వాసవీ క్లబ్‌ల ఆధ్వర్యంలో శ్రీరాములు విగ్రహానికి నివాళులు అర్పించారు.

గిద్దలూరు టౌన్ : స్థానిక టీడీపీ కార్యాలయంలో శనివారం ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం ప్రాణాలు అర్పించిన పొట్టిశ్రీరాములు జయంతిని నిర్వహించారు. పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నాడు తెలుగు ప్రజల భవిష్యత్తు కోసం ప్రాణాలు త్యజించిన అమరజీవి పొట్టిశ్రీరాములు అని జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్‌యాదవ్ అన్నారు. ఆయన ఆశయ సాధన కోసం, ఆంధ్రరాష్ట్ర భవిష్యత్తు కోసం టీడీపీ కృషి చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు సయ్యద్ షాన్వావలి, టీడీపీ మండల అధ్యక్షుడు మార్తాల సుబ్బారెడ్డి, రాష్ట్ర బీసీ కార్యదర్శి బైలడుగు బాలయ్యయాదవ్, మాజీ సర్పంచులు చెన్నుబోయిన రామకృష్ణయాదవ్, వి.ప్రసాద్, చేరెడ్డి జయరామిరెడ్డి, ఆవుల రాజగోపాల్, రాచర్ల మండల టీడీపీ అధ్యక్షుడు కటికె యోగానంద్, టీడీపీ నాయకులు గోపిరెడ్డి జీవనేశ్వర్‌రెడ్డి, కంచర్ల కిరణ్, మహమ్మద్‌జానీ, మౌలాలి, విష్ణుకుమార్ పాల్గొన్నారు.

గిద్దలూరు : అమరజీవి పొట్టిశ్రీరాములు జయంతి సందర్భంగా పట్టణంలోని ఆయన విగ్రహానికి పలు సంస్థల ప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఆంధ్రరాష్ట్ర సాధన కోసం ప్రాణాలను పణంగా పెట్టిన పొట్టిశ్రీరాములు జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో అమ్మవారిశాల గౌరవాధ్యక్షులు శివపురం ఆంజనేయులు, వాడకట్టు రంగసత్యం, కార్యదర్శి తుమ్మలపెంట సత్య నారాయణ, కమిటీ ప్రతినిధులు, వాసవిక్లబ్ ప్రతినిధులు సూరె చెంచయ్య, బాదం వెంకటేశ్వర్లు, ఆర్యవైశ్య సూర్య వంశావలి అధ్యక్షులు నాగేశ్వరరావు, ఆవోపా అధ్యక్షులు రాములు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. గ్రంథాలయంలో పొట్టిశ్రీరాములు జయంతి వేడుకలను గ్రంథపాలకులు ప్రసన్నలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. బీజేపీ నాయకులు అమరజీవి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

పొదిలి : ఆంధ్రరాష్ట్ర అవతరణకోసం ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాముల విగ్రహానికి శనివారం మార్కాపురం మాజీ శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ అమరజీవి త్యాగాన్ని రాష్ట్ర ప్రజలు ఎన్నటికి మరువలేరని ఆయన అన్నారు. ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం మొక్కవోని దీక్షతో ఆమరణ నిరాహారదీక్ష చేసి ప్రాణత్యాగానికి పూనుకున్న వ్యక్తి పొట్టి శ్రీరాములని కొనియాడారు. కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనిల్, టీడీపీ నాయకులు, ఆర్యవైశ్యులు శ్రీదేవి, దివ్వెల మురళీ, మేడా చిన్నసుబ్బారావు, మురళీ తదితర ఆర్యవైశ్యులు ఉన్నారు.





మార్కాపురంలో నివాళి అర్పిస్తున్న ప్రిన్సిపల్‌రంగయ్య, పొదిలిలో పొట్టి శ్రీరాములకు పూలమాల వేస్తున్న నారాయణరెడ్డి


ట్యాంకర్ నీటిని తొట్టిలో నింపుతున్న రైతులు

కూలీల కొరత.. నీటి ఎద్దడి

» ట్యాంకర్ల ద్వారా మిరప చేలకు నీరు
» రైతులకు అదనపు భారం

ముండ్లమూరు, మార్చి 16 : మండలంలోని పలు గ్రామాల్లో మిర్చి సాగు చేసిన రైతులకు ఒక వైపు కూలీల కొరత ఏర్పడడంతో తోటలోనే కాయలు ఎండి పోతున్నాయి. మరో వైపు నీటి ఎద్దడి కారణంగా తోటలు వాడుముఖం పడుతున్నాయి. దీంతో మిర్చి సాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటను దక్కించుకునేందుకు రైతులు ఇళ్ల దగ్గర నుంచి ట్యాంకర్ల ద్వారా నీటిని తీసుకెళ్లి మిర్చి తోటల్లో ఉన్న నీటి కుంటలను నింపుకుంటున్నారు. తద్వారా తోటలను తడుపుకుంటున్నారు. మిర్చి పంటలకు వరుస తెగుళ్లు రావడంతో దిగుబడి గణనీయంగా పడి పోయింది. వచ్చిన దిగుబడి సైతం కోసేందుకు కూలీల డిమాండ్ కూడా ఏర్పడింది. చేలోనే కాయలు ఎండి పోయే పరిస్థితి వచ్చింది. వారం రోజులుగా నీటి ఎద్దడి ఏర్పడింది. మండలంలోని తమ్మలూరు, నాయుడుపాలెం, ఉమా మహేశ్వర అగ్రహారం, పూరిమెట్ల, మారెళ్ల, సుంకరవారిపాలెం, నూజెండ్లపల్లి, భట్లపల్లి, శంకరాపురంలలో ఎక్కువగా మిర్చిని సాగు చేశారు. తమ్మలూరులో మిర్చి తోటలకు పూర్తిగా నీటి ఎద్దడి ఏర్పడింది. దీంతో ఒక్కసారిగా వ్యవసా య బోరులో నీరు నిలిచి పోవడంతో రైతులు చేసేదిలేక ఇళ్ల దగ్గర నుంచి ట్యాంకర్ల ద్వారా నీటిని తీసుకెళ్లి కుంటలకు పెట్టి ఆ తరువాత తోటలకు నీరు పెడుతున్నారు. మండలంలో ఖరీఫ్, రబీ కలుపుకొని 5,400 ఎకరాల్లో మిర్చిని సాగు చేశారు. ఈ పరిస్థితుల్లో ఒక్కసారిగా ఒక వైపు కూలీల కొరత, మరో వైపు నీటి ఎద్దడి మిర్చి రైతులను నష్టాల్లో ముంచింది.


తమ్మలూరులో మిరప చేలో పండిన కాయలు

వైసీపీకి భారీ షాక్

» రెండు నెలలుగా ఆ పార్టీని వీడుతున్న శ్రేణులు
» తాజాగా టీడీపీలో చేరిన వైసీపీ మండల నాయకుడు బ్రహ్మరెడ్డి
» డాక్టర్ ఉగ్రపై నమ్మకంతో సైకిలెక్కుతున్న ఊళ్లకుఊళ్లు

పీసీపల్లి, మార్చి 16 : మండలంలో వైసీపీకి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు షాక్‌ల మీద షాక్ లిస్తున్నారు. రెండు నెలలుగా వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఊర్లకు ఊర్లే వైసీపీని వీడి టీడీపీలో చేరుతున్నారు. దీంతో తెలుగుదేశం పార్టీ బలం మరింత పుంజుకుంటుండగా వైసీపీ బలహీనపడుతోందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. జనవరిలో భట్టుపల్లి గ్రామానికి చెందిన వైసీపీ సీనియర్ నాయకులు చెన్నుబోయిన మాలకొండయ్యయాదవ్, డబ్బుగొట్టు వెంకట్రావుయాదవ్, ఊసా మాల్యాద్రియాదవ్‌లు గ్రామంలోని తన అనుచరులందరితో కలిసి వైసీపీని వీడి కనిగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఆ తరువాత మరికొద్ది రోజులకే ముద్దపాడు ఉప సర్పంచ్ బండారు విష్ణు గ్రామంలో ఉన్న తన అనుచరులతో టీడీపీలో చేరారు. ఆ తరువాత పెదయిర్లపాడు గ్రామ సర్పంచ్, సీనియర్ వైసీపీ నాయకురాలు పోలం లక్ష్మీదేవి, 4 గురు వార్డుమెంబర్‌లు, వైసీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. 10 రోజుల క్రితం పెదయిర్లపాడు సచివాలయ కన్వీనర్ ఓంకారం రెడ్డి, వార్డుమెంబరు గుర్రం మాల్యాద్రి తమ అనుచరులతో కనిగిరి వెళ్లి ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరారు. శుక్రవారం రాత్రి వైసీపీ మండల సీనియర్ నాయకుడు సింగల్‌విండో మాజీ ప్రెసిడెంట్ మూలె బ్రహ్మరెడ్డి ముద్దపాడు వాకంవారిపల్లి గ్రామాలకు చెందిన ఆమె అనుచరులతో కలిసి వైసీపీని వీడి ఉగ్రనరసింహారెడ్డి సమక్షంలో టీడీపీలో రేరారు. వీరికి టీడీపీ కండువాలు వేసిన ఉగ్ర నరసింహారెడ్డి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. రెండు నెలల కాలంలో మండలంలో వైసీపీని వీడి టీడీపీలో చేరికలు జోరందుకున్నాయి. దీంతో టీడీపీ శ్రేణుల్లో జోరు పెరుగుతండగా వైసీపీ డీలా పడుతోందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.


టీడీపీలో చేరిన బ్రహ్మరెడ్డి, అతని అనుచరులతో డాక్టర్ ఉగ్ర

వైసీపీని సాగనంపితేనే రాష్ట్రాభివృద్ధి

టీడీపీ అభ్యర్థి డాక్టర్ ఉగ్ర

వచ్చే ఎన్నికల్లో వైసీపీని ఓడిస్తేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే కనిగిరి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. పీసీపల్లి మండలానికి చెందిన వైసీపీ సీనియర్ నాయకుడు, సింగిల్‌విండో మాజీ ప్రెసిడెంట్ మూలె బ్రహ్మరెడ్డి తన అనుచరులతో కలిసి శుక్రవారం రాత్రి వైసీపీని వీడి కనిగిరి అమరావతి గ్రౌండ్స్‌లో ఉగ్ర సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఉగ్ర వారికి పార్టీ కండువా లు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన వారినుద్దేశించి మాట్లాడుతూ లెక్కలకు మించి అప్పులు తెచ్చిన జగన్‌రెడ్డి అభివృద్ధి పను లు చేపట్టకుండా రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారన్నారు.సొంత ఖజానాను నింపుకుని ప్రజలనెత్తిన రుణభారాన్ని మోపారన్నారు. విద్యుత్, బస్సు చార్జీలు, పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర ధరలను విపరీతంగా పెంచి అన్ని వర్గాల ప్రజలను ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టారని విమర్శించారు.తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు నాటి ముఖ్యమంత్రి పేదల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలుచేస్తే వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత జగన్‌రెడ్డి ఆ పథకాలను రద్దుచేసి అర్హులకు అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కనిగిరి నియోజకవర్గం అభివృద్ధి, నిమ్జ్, నడికుడి రైల్వే లైను, ఇంటింటికీ తాగునీరు, ట్రిపుల్ ఐటీ, వెలిగొండ ప్రాజెక్టు సాధన అవసరమన్నారు. వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా చంద్రబాబును గెలిపించుకోవడంతో పాటు కనిగిరి అభివృద్ధి కోసం తనను ఆశీర్వదించాలని ఉగ్ర విజ్ఞప్తి చేశారు. వైసీపీని వీడి టీడీపీలో చేరిన వారిలో మూలె బ్రహ్మరెడ్డి, బత్తుల రామచంద్ర, బత్తుల వెంకటనారాయణ, బండారు శివ, మాలకొండయ్య, ఎస్.మాలకొండయ్య, రామాంజనేయులు, కొండలరావు, పిలుపు, భాగ్యరాజ్, కోటయ్య, చింటు తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ ఒంగోలు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు గద్దం బాలసుబ్బయ్య, గ్రామ కమిటీ అధ్యక్షుడు నెలకుర్తి మాల్యాద్రి, ముద్దా రోశయ్య, ముద్దా ఇస్రాయెల్, బండారు శ్రీను, విష్ణు, గోవిందు, రత్తయ్య, శివ, అంకయ్య, రమణయ్య, తిరుపతయ్య, కేశవులు, బ్రహ్మయ్య, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.


బాణసంచా కాల్చుతున్న శ్రేణులు

కోడ్ రావడంతో బాణసంచాకాల్చిన టీడీపీ శ్రేణులు

కనిగిరి, మార్చి 16: జగన్‌రెడ్డి రాక్షసపాలన నుంచి ప్రజలకు విముక్తి లభించిందని టీడీపీ పట్టణాధ్యక్షుడు తమ్మినేని శ్రీనివాసులరెడ్డి అన్నారు. అమరావతి గ్రౌండ్స్‌లో ఎన్నికల కోడ్ ప్రకటించిన సందర్భంగా శనివారం బాణసంచా కాల్చి సంబరాలు చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైసీపీ ఫ్యాన్ రెక్కలు ముక్కలవటం ఖాయమన్నారు. మరో 45 రోజుల్లో ఆంధ్ర ప్రజలు జగన్‌ను ఇంటికి సాగనంపేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాచమల్ల శ్రీనివాసులురెడ్డి, సానికొమ్ము తిరుపతిరెడ్డి, ఫిరోజ్, తమ్మినేని వెంకటరెడ్డి, అహ్మద్, నజీముద్దీన్, చిలకపాటి లక్ష్మయ్య, తిరుపాలు, గిఫ్టఆర్టికల్స్ కొండలు, తెలుగు మహిళలు తులసి, మాజీ కౌన్సిలర్లు షేక్ వాజిదాబేగం, బొగ్గరపు శ్రీలత పాల్గొన్నారు.

ప్రజాగళం సభను విజయవంతం చేయండి


సమావేశంలో పాల్గొన్న నేతలు

దొనకొండ, మార్చి 16 : టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నేతృత్వంలో ఆదివారం చిలకలూరిపేటలో నిర్వహించే ప్రజాగళం బహిరంగ సభను విజయవంతం చేయాలని టీడీపీ మండల నాయకులు వీరపనేని వెంకన్నచౌదరి పిలుపునిచ్చారు. పార్టీ కార్యాలయంలో జన సమీకరణపై టీడీపీ మండల నాయకులు, కార్యకర్తలతో శనివారం సమావేశం నిర్వహించారు. దర్శి టీడీపీ ఇన్‌చార్జి గోరంట్ల రవికుమార్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు వెంకన్నచౌదరి పర్యవేక్షణలో మండలంలోని పలు గ్రామాల నుంచి దాదాపు 70 వాహనాలలో సభకు తరలివెళ్లేందుకు సిద్ధమైనట్లు తెలిపారు. శ్రేణులు, అభిమానులు, ప్రజలు సకాలంలో సభ వద్దకు హాజరు కావాలని వెంకన్నచౌదరి కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు మాజీ సభ్యుడు పులిమి రమణాయాదవ్, నాయకులు కామేపల్లి చెంచయ్య, తోటా కోటేశ్వరరావు, దుగ్గెంపూడి కోటేశ్వరరావు, ఫణిదపు వీరాంజనేయులు, సింగమనేని హనుమంతు, పురుషోత్తం సత్యానందం, పులిమి శివ పాల్గొన్నారు.

తాళ్లూరు : ప్రజాగళం సభకు తరలిరావాలని టీడీపీ మండల అధ్యక్షుడు బొమ్మిరెడ్డి ఓబుల్‌రెడ్డి శనివారం ప్రకటనలో కోరారు. టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

వెలిగండ్ల : టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి తొలి సభను విజయవంతం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి కోరారు. శనివారం వెలిగండ్ల టీడీపీ కార్యలయంలో కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించారు కార్యక్రమంలో నియోజకవర్గ రైతు అధ్యక్షుడు కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు చిలకల వెంకటేశ్వరరెడ్డి, కొండు భాస్కర్‌రెడ్డి, చిలకల క్రిష్టారెడ్డి, తెలుగు యువత అధ్యక్షుడు కర్నాటి భాస్కర్ రెడ్డి, రైతు అధ్యక్షుడు మీనిగ కాశయ్య, ఎస్సీసెల్ అధికార ప్రతినిధి సలోమన్ రాజు, బీసీ సెల్ అధ్యక్షుడు మౌలాలీ, సాన జయపాల్ రెడ్డి, కారంపూడి వెంటేశ్వర్లు, సాన నారయణ రెడ్డి, కేసరి రమణా రెడ్డి, మాలకొండా రెడ్డి, కొండు శ్రీను, పుల్లారెడ్డి తిరుపతి రెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమి శ్రేణులు ఒక్కటై పనిచేయాలి


జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

వెలిగండ్ల, మార్చి 16 : ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి శ్రేణులు ఒక్కటై పనిచేయాలని జనసేన పార్టీ సమన్వయ కర్త వరికూటి నాగరాజు విజ్ఞప్తి చేశారు. శనివారం మండలంలోని జిళ్లెలపాడు పంచాయతీలో జనసేన పార్టీ జెండాను ఆవిష్కరించారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఉగ్ర గెలుపునకు సమన్వయంతో పనిచేయాలన్నారు. వైసీపీని ఓడిస్తేనే ప్రజాస్వామ్యం బతుకుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడుజల్వా(ప్రవీన్), రమేష్, సునీల్, రాజు, ఏడుకొండలు, రమేష్, వలీ, మురళి, టీడీపీ మండల అధ్యక్షుడు ము త్తిరెడ్డి, రైతు అధ్యక్షుడు కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు చిలకల వెంకటేశ్వర రెడ్డి, కొండు భాస్కర్‌రెడ్డి, తెలుగు యువత అధ్యక్షుడు కర్నాటి భాస్కర్ రెడ్డి, మండల రైతు అధ్యక్షుడు మీనిగ కాశయ్య, ఎస్సీసెల్ అధికార ప్రతినిధి సలోమన్ రాజు, సాన జయపాల్ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి


శంకుస్థాపన చేస్తున్న వెంకాయమ్మ

దర్శి మార్చి 16 : దర్శి నియోజకవర్గంలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తామని జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి తెలిపారు. అమృత పథకం ద్వారా విడుదలైన రూ.121 కోట్లతో దర్శి పట్టణ ప్రజలకు ఇంటింటికి కొళాయిల పథకం నిర్మాణం పనులను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో అన్ని మండలాల్లో ఇంటింటికి కొళాయి పథకం పనులు జరుగుతున్నాయని చెప్పారు. తాగునీటి సమస్య పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తామన్నారు. అనంతరం దర్శి తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో సులాబ్ కాంప్లెక్స్‌ను వారు ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ వి వెంకటరెడ్డి, మాజీ ఎంపీపీ ఇత్తడి దేవదానం, నగర పంచాయతీ కమిషనర్ వై.మహేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు. దర్శి నియోజకవర్గ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని దర్శి అసెంబ్లీ వైసీపీ అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి చెప్పారు. పార్టీ కార్యాలయంలో శనివారం జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

గడ్డి జింకను కాపాడిన విద్యార్థులు

అటవీశాఖాధికారులకు అప్పగింత


జింకను కాపాడిన విద్యార్థులు

కనిగిరి, మార్చి 16 : కనిగిరి పట్టణ సమీపంలోని డిగ్రీ కళాశాల వద్ద శనివారం కుక్కల గుంపు గడ్డి జింకపై దాడిచేసి గాయపరచే సమయంలో విద్యార్థులు జింకను కాపాడి అటవీశాఖ అధికారులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. అరణ్యంలో ఉండాల్సిన వన్యప్రాణులు దాహార్తి కోసం జనారణ్యంలోకి వస్తున్నాయి. కనిగిరిలో శుక్రవారం ఎమ్మెల్యే మధుసూదన్‌యాదవ్ ఇంటి సమీపంలో గడ్డిజింక రావడంతో కుక్కలు వెంటపడ్డాయి. దీంతో చెట్లపొదల్లోకి వెళ్లి దాక్కున్న జింకను స్థానికుల ఇచ్చిన సమాచారంతో అటవీ అధికారలు వచ్చి జింకను సంరక్షించి కొండల్లో ఒదిలేశారు. తిరిగి శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని మైదానంలోకి తప్పిపోయి వచ్చిన గడ్డిజింకపై కుక్కల గుంపు వెంబడించి గాయపర్చబోగా ఉదయాన్నే వాకింగ్‌కు వచ్చిన విద్యార్థులు కుక్కల గుంపును తరిమికొట్టి జింకను రక్షించి అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు జింకను సంరక్షించి పునుగోడు కొండల అవతల ఉన్న అటవీ ప్రదేశాల్లో ఒదిలేశారు. కనిగిరి ఫారెస్ట్ రేంజర్ రామిరెడ్డి మాట్లాడుతూ వన్యప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. వాటిని దాడి చేసినా, చంపినా శిక్షకు గురవుతారని హెచ్చరించారు. జింకను కాపాడిన విద్యార్థులను ఆయన అభినందించారు.

కోడ్ కూసింది.. ముసుగు పడింది..!

దర్శి, మార్చి 16 : ఎన్నికల కమీషన్ షెడ్యూల్ ప్రకటించటంతో అధికారులు కోడ్ అమలుకు శ్రీకారం చుట్టారు. అందులో బాగంగా దర్శి గడియార స్తంభం సెంటర్‌లో ఉన్న ఎన్టీఆర్, వైఎస్సార్ నానారపుశెట్టి శ్రీరాములు విగ్రహాలకు ముసుగులు వేశారు. బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లను తొలగిస్తున్నారు. రాజకీయ పార్టీలు గతంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించుకోవాలని అధికారులు సూచించారు. స్పందించకపోతే గడువులోపు తామే తొలగిస్తామన్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రావటంతో అన్ని శాఖల అధికారులు అప్రమత్తం అయ్యారు. ఎన్నికల నిబంధనల మేరకు పనిచేయాలని దర్శి నియోజకవర్గ ఈఆర్‌వో ఎంవీఎస్ లోకేశ్వరరావు అధికారులను ఆదేశించారు.


దర్శిలో విగ్రహాలకు వేసిన ముసుగులు

తాళ్లూరు : ఎన్నికల నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేయాలన్న ఆదేశాలతో అధికారులు గ్రామాల్లోని రాజకీయ నేతల విగ్రహాలకు ముసుగులు వేస్తూ, పార్టీ జెండాలను తొలగిస్తున్నారు.

విగ్రహాలకు ముసుగులు.. ఫ్లెక్సీల తొలగింపు

కనిగిరి, మార్చి 16: ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో అధికార యంత్రాంగం నిబంధనలను అమలు చేసింది. శనివారం వైఎస్సార్ విగ్రహాలకు ముసుగులు వేశారు. వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలను తొలగించారు. అభివృద్ధి పథకాల శిలాఫలకాలకు ముసుగు వేశారు. కోడ్ అమలులోకి వచ్చిన 24 గంటల సమయం ఉన్నా అధికారులు అత్యంత వేగంగా ఫ్లెక్సీలు తొలగించారు.

కోడ్‌ను కచ్చితంగా అమలు చేయాలి

» ఎన్నికల రిటర్నింగ్ అధికారి లోకేశ్వరరావు

ముండ్లమూరు, మార్చి 16 : సార్వత్రిక ఎన్నికలకు ఎన్నికల కమిషన్ కోడ్ విడుదల చేయడంతో నియమావళిని కచ్చితంగా పాటించాలని దర్శి నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి ఎంవీఎస్ లోకేశ్వరరావు సూచించారు. రెవెన్యూ కార్యాలయంలో ఎన్నికల విధుల్లో సంబంధం ఉన్న అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున మండలంలో ఎక్కడైనా ప్రభుత్వ కార్యాలయాల్లో గాని, గ్రామాల్లో ఉన్న వివిధ పార్టీలకు చెందిన నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయాలన్నారు. ఫ్లెక్సీలు, కటౌట్‌లు ఉంటే వెంటనే తొలగించాలన్నారు. ప్రభుత్వ స్థలాల్లో రాజకీయ నాయకులు సభలు, సమావేశాలు జరపటానికి అనుమతి లేదన్నారు. మండలంలోని శంకరాపురం వద్ద చెక్ పోస్టును ఏర్పాటు చేయటం జరుగుతుందన్నారు.కార్యక్రమంలో తహసీల్దార్ జే మధుబాబు, ఎంపీడీవో బీ శంకరరావు, ఎన్నికల అధికారులు మహహమ్మద్ ఫరూర్, డిప్యూటీ తహసీల్దార్ స్రవంతి, సీనియర్ అసిస్టెంట్ శేషగిరిరావు పాల్గొన్నారు.

తాళ్లూరు : గ్రామాల్లో ఎన్నికల నియమావళి అధికారులు కట్టుదిట్టంగా అమలు చేయాలని తహసీల్దార్ ఎస్కే మహమ్మద్ హుస్సేన్ తెలిపారు. ఎంపీడీవో సమావేశంహాలులో గ్రామపంచాయతీ కార్యదర్శులతో ఎన్నికల నియమావళి అమలుపై సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశానుసారం 24 గంటల్లో ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ ఆస్తుల్లో, బహిరంగ ప్రదేశాల్లో ఉన్న రాజకీయ పార్టీల ఫ్లెక్సీలను తొలగించి, విగ్రహాలకు ముసుగులు తొడగాలని సూచించారు. ఎన్నికలు ముగిసేవరకు ఉద్యోగులు, వలంటీర్లు రాజకీయ కార్యక్రమాలకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం కార్యాలయంలో ఉన్న సీఎం జగన్ చిత్రపటాన్ని తీయించివేశారు.

ఓటర్లకు ఈవీఎంలపై అవగాహన

ముండ్లమూరు : త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఓటర్లకు శనివారం మండలంలోని శంకరాపురం, పోలవరం గ్రామాల్లో అవగాహన కల్పించారు. ఈవీఎంలను ఏ విధంగా వినియోగించుకోవాలనే దానిపై డెమో చూపించారు. కార్యక్రమంలో వీఆర్‌వోలు బద్రి అయ్యపరెడ్డి, పీఆర్ ఏఈ వెంకటేశ్వర్లు, కార్యదర్శి మౌలాలి ఉన్నారు.

హోం ఓటింగ్‌పై అవగాహన

పీసీపల్లి : ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు 85 సంవత్సరాల వయస్సు పైబడిన వయోవృద్ధులు, దివ్యాంగులకు హోమ్ ఓటింగ్‌పై అవగాహన కల్పిస్తున్నామని ఏఈఆర్వో పద్మావతి అన్నారు. 197 పోలింగ్ కేంద్రం పరిధిలోని వడ్డెపాలెం గ్రామాన్ని సందర్శించిన ఆమె హోమ్ ఓటింగ్‌కు అర్హులను కలుసుకున్నారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

పామూరు, మార్చి 16 : ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి అసువులు బాసిన మహనీయుడు అమరజీవి పొట్టి శ్రీరాములని హెచ్‌ఎం షేక్ మహబూబ్‌బాషా అన్నారు. మండలంలోని నర్రమారెళ్ల పాఠశాలలో పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రములో ఉపాధ్యాయులు రమేష్, ప్రసాద్, కోటేశ్వరరావు, నీరజ, సుజాత, నాగేశ్వ నివాళులర్పించారు. అలాగే సరోజినీనాయుడుకు నివాళులర్పించారు.

ముండ్లమూరు : ముండ్లమూరు బస్టాండ్ సెంటర్‌లో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పులికొండ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో దేవతి శ్రీనివాసరావు, ఒలేటి రమేష్, పులికొండ శ్రీనివాసరావు, నరహరి నారాయణ, పులికొండ వెంకటరావు, డగ్లస్, వెంకటేశ్వర్లు ఉన్నారు.

ఏఎస్ఐగా వెంకటేశ్వరరెడ్డి

ముండ్లమూరు, మార్చి 16 : పోలీసు స్టేషన్‌లో అసిస్ట్ సబ్ ఇన్స్పెక్టర్‌గా ఎస్.వెంకటేశ్వరరెడ్డి నియమితులయ్యారు. ఈయన శనివారం బాధ్యతలు స్వీకరించారు. చీమకుర్తి పోలీసు స్టేషన్‌లో పని చేస్తూ బదిలీ పై ముండ్లమూరుకు బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఏఎస్ఐగా పని చేసిన బీ పవన్ కుమార్ కొమరోలు మండలానికి వెళ్లారు.

నమస్కరించడమే నేరమా..?

కనిగిరి, మార్చి 16: మాజీ ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధి, ప్రతిపక్ష నాయకునికి నమస్కరించడం హోంగార్డు చేసిన నేరమా అని సీపీఎం నేత పీసీ కేశవరావు ప్రశ్నించారు. సుందరయ్య భవనంలో సీపీఎం ప్రాంతీయ కమిటీ సమావేశం శనివారం జరిగింది. ప్రజాప్రతినిధికి నమస్కారం చేశారనే నెపంతో హోంగార్డును బదిలీ చేయడం సరికాదన్నారు. ఆర్డీవో కార్యాలయానికి వచ్చిన కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలసి మాట్లేందుకు వచ్చిన టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఉగ్రకు అక్కడ విధులు నిర్వర్తిస్తున్న హోంగార్డు మర్యాదపూర్వకంగా నమస్కారం చేయడాన్ని అధికార వైసీపీ నేతలు జీర్ణించుకోలేక పోవడం సిగ్గుచేటన్నారు. హోంగార్డు బదిలీ అధికార దుర్వినియోగమేనన్నారు.


మాగుంటకు పుష్పగుచ్ఛమిచ్చి అభినందిస్తున్న పువ్వాడి

మాగుంటకు శుభాకాంక్షలు

పామూరు, మార్చి 16 : ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, తనయుడు రాఘవరెడ్డి వైసీపీని వీడి టీడీపీలో చేరడాన్ని స్వాగతిస్తున్నట్లు టీడీపీ మండల కమిటి అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు తెలిపారు. ఒంగోలులోని మాగుంట నివాసానికి శనివారం పామూరు నుంచి పలువురు నాయకులు వెళ్లి పుష్పగుచ్ఛం అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ ఎంపీ అభ్యర్థిగా రాఘవరెడ్డి అభ్యర్థిత్వానికి మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దశరథరాములు, ఎంపీటీసీ సభ్యుడు బొల్లా నరసింహారావు, టీడీపీ రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల కమిటీ కార్యదర్శి అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, టీడీపీ ఒంగోలు పార్లమెంట్ అధికార ప్రతినిధి ప్రసాద్‌రెడ్డి, టీడీపీ పట్టణ గౌరవ అధ్యక్షుడు షేక్ ఖాజారహంతుల్లా, నుచ్చుపొద ఉప సర్పంచ్ గోళ్ల వెంకటేశ్వర్లు, తెలుగు రైతు అధ్యక్షుడు రమణయ్య, శ్రీనువాసులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన మాగుంట అనుచరులు

తాళ్లూరు : వైసీపీని వీడి మంగళగిరి టీడీపీ కార్యాలయంలో టీడీపీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు సమక్షంలో చేరిన ఎంపీ మాగుంట ఆధ్వర్యంలో మండలంలోని వైసీపీ శ్రేణులు శనివారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. తూర్పుగంగవరం, సోమవరప్పాడు, విఠలాపురం గ్రామాలకు చెందిన గుంటి గంగాభవాని దేవస్థానం కమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, ఉపసర్పంచ్ యత్తపు కాశిరెడ్డి, బీమా కార్తీక్, లింగారావు, బద్దుల శ్రీనివాసరావు, మేడగం సుబ్బారెడ్డి వైసీపీని వీడారు.

మాగుంటకు అభినందనలు

దొనకొండ, మార్చి 16 : ఒంగోలు పార్లమెంట్ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఆయన తనయుడు మాగుంట రాఘవరెడ్డిని మండల తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు శృంగారపు నాగసుబ్బారెడ్డి శనివారం ఒంగోలులోని వారి నివాసంలో కలిశారు. మాగుంట శ్రీనివాసులు రెడ్డి, రాఘవరెడ్డి మాజీ సీఎం చంద్రబాబు సమక్షంలో శనివారం టీడీపీలో చేరిన సందర్భంగా వారికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. దొనకొండ ప్రాంత ప్రజలు రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగకపోవడంతో ప్రజలు తీవ్ర రవాణా ఇబ్బందులు పడుతున్నారని సమస్యను పరిష్కరించాలని నాగసుబ్బారెడ్డి మాగుంట దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలుపు కోసం బాధ్యతగా పనిచేయాలని మాగుంట సూచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు నిమ్మకాయల సుబ్బారెడ్డి, ఎస్సీ సెల్ పోతిపోగు చెన్నయ్య పాల్గొన్నారు.


రాఘవరెడ్డికి అభినందనలు తెలుపుతున్న నాగసుబ్బారెడ్డి



ప్రజాగళం



ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో చారిత్రాత్మక సంచలన సభ
ప్రజాగళం
ఒకే వేదిక పై ప్రధాని మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్
నవ్యాంధ్ర భవిష్యత్‌కై జరిగే పోరు సభలో మనమూ భాగస్వాములవుదాం...
నేడు సాయంత్రం 4గంటలకు పల్నాడు జిల్లా,
చిలకలూరిపేట మండలం, బొప్పూడి ప్రసన్నాంజనేయస్వామి గుడి దగ్గర
తెలుగుదేశం-జనసేన-బిజేపీ ఉమ్మడి భారీ బహిరంగ సభ
సైకో పోవాలి... సైకిల్ రావాలంటే
కదన రంగంలో కాలు కదుపుదాం లక్షలాదిగా తరలివచ్చి చిలకలూరిపేటలో
జరిగే భారీ బహిరంగ సభను విజయవంతం చేద్దాం.
మీ డా॥ వుండవల్లి శ్రీదేవి
శాసనసభ్యురాలు, తాడికొండ, గుంటూరు జిల్లా







షెడ్యూల్.. వచ్చేసింది

- ఏప్రిల్ 18న ఎన్నికల నోటిఫికేషన్
- మే 13న పోలింగ్.. జూన్ 4న ఓట్ల లెక్కింపు
- ఈ సారి పోలింగ్ జరిగిన 22 రోజుల్లోనే ఫలితాలు

గుంటూరు, మార్చి 16 (ఆంధ్ర జ్యోతి): గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లావాసులు ఎదురు చూస్తున్న సార్వ త్రిక ఎన్నికల షెడ్యూల్ శనివారం విడుదలైంది. దేశ వ్యాప్తంగా ఏడు దశల్లో ఎన్నికలు జరగనుండగా ఆంధ్రప్రదేశ్‌లో నాల్గో దశలో ఎన్నికలు నిర్వహించ నున్నట్లు ఈసీ ప్రకటించింది. దీంతో ఎన్నికల ప్రచారానికి రాజకీయ పార్టీల కు తగినంత సమయం అందుబా టులోకి వచ్చినట్లైంది. షెడ్యూల్ శనివా రమే విడుదలైనప్పటికీ గుంటూరు, ప ల్నాడు, బాపట్ల జిల్లాల్లో ఎన్నికల నోటిఫికేషన్ ఏప్రిల్ 18న విడుదల కానుంది. అదే రోజు నుంచి నామి నేషన్లను


బాపట్లలో ఫ్లెక్సీల తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

స్వీకరిస్తారు. ఏప్రిల్ 25 వరకు నామినేషన్ల దాఖలు కు గడువు ఇచ్చారు. 26న నామినేషన్ల పరిశీలన, 29న నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుంది. అదే రోజు ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు, వారికి కేటా యించిన గుర్తులను ప్రకటిస్తారు. మే 13న సోమ వారం పోలింగ్ జరుగుతుం ది. ఓట్ల లెక్కింపు జూన్ 4న నిర్వహి స్తారు. గత 2019 సార్వత్రిక ఎన్నికలతో పోల్చి చూస్తే అప్పట్లో మొదటి విడత లోనే ఇక్కడ ఎన్నికలు జరిగాయి. దాంతో పోలింగ్ జరిగిన తర్వాత ఓట్ల లెక్కింపు జరగడానికి 40 రోజులకు పైగా సమ యం పట్టింది. ఈ దఫా రాష్ట్రంలో పోలింగ్ మొదటి విడతలో వద్దని కొన్ని పార్టీలు హైకోర్టుని ఆశ్రయిం చాయి. వారి విజ్ఞప్తిని పరిశీలించాలని హైకోర్టు కేంద్ర ఎన్నికల సంఘానికి సూచిం చింది. కాగా ఈ దఫా నాల్గో విడతలో ఎన్నికలు జరగనుండటం, అలానే ఓట్ల లెక్కింపుని గతంతో పోల్చితే 11 రోజులు వెనక్కు జరిపింది. పండగలు, ఎండల తీవ్రత, పిల్లల పరీక్షలు వంటి వాటిని పరిగణనలోకి తీసుకుని ఈసీ ఈ నిర్ణ యాన్ని తీసుకున్నట్లు ప్రకటించింది. ఈసారి పోలింగ్ జరిగిన 22 రోజుల్లోనే ఫలితాలు వెలువడతాయి. గతంలో వలే తొలి విడతలోనే సార్వత్రిక ఎన్నిక లు జరగాలని వైసీపీ వర్గాలు ఎన్నో ఆశలు పెట్టుకుని ఎదురు చూశాయి. దాని వల్ల ఎన్నికల ఖర్చు తగ్గడంతో పాటు సెంటిమెంట్ వర్కు అవుతుంద ని భావించాయి. ప్రతి పక్షాలు మాత్రం చివరి విడతల్లో ఎన్ని కలు జరిగితే తమకు మేలని భావిం చాయి. అయితే ఎన్నికల సంఘం మధ్యే మార్గంగా నాల్గో విడత లో నిర్వహించడానికి నిర్ణయం తీసుకున్నది.

రెండున్నర నెలలకు పైగా కోడ్ అమలు

ఎన్నికల కోడ్ ఈ దఫా రెండున్నర నెలలకు పైగా అమలులో ఉండనుంది. ఈసీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటనతో శనివారం మధ్యాహ్నం నుంచే కోడ్ అమలులోకి వచ్చేసింది. ఇది మొదలు జూన్ 4 ఓట్ల లెక్కింపు ముగిసే వరకు అమలులో ఉంటుంది. దీనిని పరిగణ నలోకి తీసుకుంటే దాదాపు 75 రోజుల పాటు కొత్తగా ఎలాంటి అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాప నలు చేయడానికి వీల్లేదు. కోడ్ అమలు లోకి వచ్చిన దృష్ట్యా ప్రభుత్వ ఆస్తుల పై, ఆవరణల్లో ఏ పార్టీకి సంబంధించిన పోస్టర్లు, జెండాలు, రంగులు న్నా వాటిని తొలగించాల్సిందే. ప్రభుత్వ కార్యాలయా లు, సమావేశ మందిరాల్లో ఉన్న ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి ఫొటోలు తొలగించాలి. రాజకీయ పార్టీల నేతల విగ్రహాలకు ముసుగులు తొడగాలి.

ఆర్థిక సాయం విడుదలపై అభ్యంతరం

చేయూత, ఈబీసీ పథకాలకు సం బంధించి లబ్ధిదారులకు విడుదల చే యాల్సిన ఆర్థికసాయాన్ని ప్రభుత్వం జాప్యం చేస్తూ వస్తోన్నది. వాస్తవానికి వీటికి గత ఏడాదే ఆర్థికసాయం విడు దల చేయాలి.



రేపల్లెలో ఫ్లెక్సీలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

అలాంటిది ఎన్నికల కోసం వాయిదా వేస్తూ ఈ నెలలో లాం ఛనంగా విడుదల చేశారు. చేయూత కింద ఒక్కో లబ్ధిదారుడికి రూ.18,750, ఈబీసీ నేస్తం కింద రూ.15 వేలు విడు దల చేయాలి. అయితే సీఎం లాంఛ నంగా ప్రారంభించి రెండు వారాలు గడుస్తున్నా ఇప్పటివరకు చేయూతకు సంబంధించి కొందరి ఖాతాలకే నగదు జమైంది. ఇప్పుడు ఎన్నికల కోడ్ అమ లులోకి వచ్చిన నేపథ్యంలో వాటిని నిలి పేయాలని ప్రతిపక్షాలు కోరుతున్నాయి.

ఛలో బొప్పూడి

- సభకు సర్వం సిద్ధం
- నేడే ప్రజాగళం బహిరంగ సభ
- తరలివస్తున్న అతిరథమహారథులు
- ఉరిమే ఉత్సాహంతో కూటమి శ్రేణులు
- చారిత్రాత్మక సభకు అసాధారణ ఏర్పాట్లు

చిలకలూరిపేట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): టీడీపీ-జనసేన-బీజేపీ పొత్తు అనంతరం.. ఎన్నికల షెడ్యూల్ విడుదల తర్వాత.. ప్రధాని నరేంద్రమోదీ, టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు ఒకే వేదికపై తొలిసారి ఎన్నికల శంఖారావం పూరించనున్నారు. ఇందుకు చిలకలూరిపేట మండలం బొప్పూడి వేదికగా మారింది. ఆదివారం బొప్పూడి వద్ద ఉమ్మడిగా జరిగే భారీ బహిరంగ సభకు సర్వం సిద్ధం చేశారు. రాష్ట్ర చరిత్రలో నిలిచి పోయేలా కూటమి నేతృత్వంలో నిర్వహిస్తున్న ఈ భారీ బహిరంగ సభకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యా యి. జాతీయ రహదారి అనుకుని ఉన్న 300 ఎక రాల సువిశాల మైదానంలో అసాధారణరీతిలో ఏర్పాట్లు చేశారు. ప్రజాగళం పేరుతో నిర్వహించే ఈ భారీ బహిరంగ సభలో జనం వారి గొంతుకను వినిపించేందుకు సిద్ధమయ్యారు. కూటమి అధినేత లు ముగ్గురూ సభకు హాజరు కానుండటంతో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణుల్లో జోష్ నెలకొంది. అంచనాలకు మించి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు హాజరవుతారని నేతలు భావిస్తున్నారు. సుమారు 10 లక్షల మందికి పైగా ప్రజలు హాజరవుతారని కూటమి నేతలు అంచనా వేస్తున్నారు. సభ ఘన విజయానికి కూటమి నేతలు కసరత్తు పూర్తి చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ సీనియర్ నాయకులు పది మంది చొప్పున వేదికపైకి అనుమతి ఇ స్తున్నట్లు నేతలు తెలిపారు. సభా ప్రాంగణం లో త్రిమూర్తుల (మోదీ, చంద్రబాబు, పవన్) ప్రసంగాలను వీక్షించేందుకు 20 భారీ ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. మోదీ, చంద్రబాబు, పవ న్‌కల్యాణ్ పాల్గొనే ఉమ్మడి సభ కావడంతో ప్రజలు స్వచ్ఛందంగా తరలి వచ్చే అవకాశం ఉందని నేత లు ఆశిస్తున్నారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల, ఉమ్మడి కృష్ణ, నెల్లూరు, ప్రకాశం జిల్లాల నుంచి లక్షల సంఖ్యలో ప్రజలు తరలివచ్చేందుకు అవసర మైన ఏర్పాట్లు చేశారు. ఆర్టీసీ బస్సులతో పాటు విద్యా సంస్థల బస్సులను జనాన్ని తరలించేందుకు ఎక్కడికక్కడ నేతలు సిద్ధం చేసుకున్నారు. ఇక కార్లు, జీపులు, ఆటోలను సమకూర్చారు. జనసమీక రణకు పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాలపై నేత లు ప్రత్యేక దృష్టి సారించారు. ఆయా జిల్లాల నుం చి వేలాది ద్విచక్ర వాహనాలపై కూడా అభిమాను లు, కార్యకర్తలు, ప్రజలు సభకు తరలిరానున్నారు. చిలకలూరిపేట, ఒంగోలు మార్గంలో జాతీయ రహ దారి వెంట మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ లతో కూడిన ఫ్లెక్సీలను భారీగా ఏర్పాటు చేశారు. సభ పూర్తయ్యేసరికి చీకటి పడే అవకాశం ఉండటంతో సభా ప్రాంగణం, పార్కింగ్ స్థలాల వద్ద పెద్దపెద్ద ఫ్లడ్‌లైట్లను ఏర్పాటు చేశారు.

ప్రాంగణాన్ని జల్లెడ పట్టిన బాంబ్ స్క్వాడ్

ప్రధాని నరేంద్రమోదీ సభకు హాజరు కానుండ టంతో ఎస్పీజీ బృందం ప్రత్యేక నిఘా ఉంచింది. వేదిక, ఆ పరిసరాలను శనివారం సాయంత్రం నుం చి స్వాధీనం చేసుకుంది. ప్రాంగణం మొత్తం బాంబ్ స్క్వాడ్, జాగిలాలతో విస్తృత తనిఖీలు నిర్వ హించారు.

ప్రత్యేక ఆసక్తి..

ఎన్నికల షెడ్యూలు విడుదలైన నేపథ్యంలో తొలిసారి జరుగుతున్న సభ కావడం.. అతిరథమహారథులు తరలిరానుండటంపై రాష్ట్ర ప్రజా నీకం ప్రత్యేక ఆసక్తి కనబరుస్తోంది. మూడు పార్టీల పొత్తు తర్వాత నిర్వహిస్తున్న తొలి సభ కావడంతో జాతీయ మీడియా కూడా ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే ఢిల్లీ నుంచి జాతీయ మీడియా ప్రతినిధులు గుంటూరుకు చేరుకున్నారు. రాష్ట్ర భవిష్యత్‌కు దశ-దిశ నిర్దేశించనున్న సభగా ఏపీ ప్రజలు భావిస్తున్నారు. జగన్ పాలనలో విధ్వంసానికి గురైన రాష్ట్ర పునర్నిర్మాణానికి మోదీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్ రూట్ మ్యాప్ ప్రకటించే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. సభ మధ్యాహ్నం మూడు గంటలకు ప్రారంభం కానుంది. వేర్వేరు హెలికాప్టర్లలో మోదీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్ సభా ప్రాంగణానికి చేరుకునేలా ఏర్పాట్లు జరిగాయి.

శనివారం ఉదయం నుంచే హెలిప్యాడ్లను ఎస్పీజీ అధికారు లు ఆధీనంలోకి తీసుకున్నారు. అటువైపు ఎవరూ రాకుండా ఆంక్షలు విధించారు. వీవీఐపీలు, వీఐపీ లు సంచరించే హెలిప్యాడ్, సభా ప్రాంగణం, రహ దారి వెంబడి బందోబస్తు విధులు కేటాయించిన సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ అవాంఛనీయ సం ఘటనలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఐజీ పాలరాజు ఆదేశించారు. సభ ముగిసి నేతలు తిరుగు పయనమయ్యే వరకు అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించాలని సూచించారు. ఐజీ, ఎస్పీ రవిశంకర్‌రెడ్డి మరో ఆరుగురు ఎస్పీలు, 11 మంది ఏఎస్పీలు, 27 మంది డీఎస్పీలు, 82 మంది సీఐలు, 256 మంది ఎస్ఐలు సహా 3900 మంది పోలీసులతో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

మహిళల కోసం ప్రత్యేకంగా గ్యాలరీలు

సభా ప్రాంగణాన్ని బ్లాక్ లు గా విభజించారు. మహి ళల కోసం ప్రత్యేకంగా గ్యాలరీలను కేటాయించారు. సభ ఏర్పాట్లను మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లా రావు, ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఆనం రాంనారా యణరెడ్డి, ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి, రామరాజుల తో పాటు బీదా రవిచంద్ర, దామచర్ల సత్య తదితర నేతలు శనివారం పరిశీలించారు. అధినేత లతో పాటు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నా యు డు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షు రాలు దగ్గుబాటి పురందేశ్వరి, జన సేన పీఏసీ ఛైర్మన్ నా దెండ్ల మనోహర్, టీడీపీ జాతీ య కార్యదర్శి నారా లోకేశ్, సినీనటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణలతో పాటు కూటమి ముఖ్య నేతలు సభకు హాజరు కానున్నట్లు సమాచారం. ప్రధాని సభకు వస్తున్న నేపథ్యంలో భద్రతా చర్యల్లో భా గంగా జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం 9 గంటల నుంచి ట్రాఫిక్‌ను మళ్లించేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.


ఎస్పీలకు సూచనలిస్తున్న ఐజీ పాలరాజు


సభా ప్రాంగణంలో వేసిన కుర్చీలు


ఏర్పాట్లను పరిశీలిస్తున్న పుల్లారావు,ఆలపాటి తదితరులు


బందోబస్తు ఏర్పాట్లలో పోలీసులు


ట్రయల్‌రన్‌లో భాగంగా సభా ప్రాంగణంలో దిగుతున్న హెలికాప్టర్లు


ఏర్పాట్లను పరిశీలిస్తున్న మనోహర్ తదితరులు



స్వాగత ద్వారాల ఏర్పాటు

ప్రధాని మోదీ పర్యటన ఇలా..

బొప్పూడిలో ఆదివారం జరిగే ఎన్‌డీఏ ప్రజాగళం బహిరంగ సభకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ హాజరుకా నున్నారు. మోదీ పర్యటన షెడ్యూల్ ఖరారైనట్లు అధికా రులు ప్రకటించారు. ఢిల్లీ విమానాశ్రయం నుంచి మోదీ ఆది వారం సాయంత్రం 4.10 గంటలకు ప్రత్యేక విమా నంలో గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారు. 4.20కి గన్న వరం నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో బొప్పూ డికి బయలు దేరుతారు. 4.50కి బొప్పూడిలో ఏర్పాటు చేసిన హెలి ప్యాడ్‌లో ల్యాండ్ అవుతారు. 5.10కి ప్రజాగళం బహి రంగ సభ వేదిక పైకి చేరుకుంటారు. ఈ సందర్భంగా ప్రధానిని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి సత్కరిస్తారు. సాయంత్రం 5.20 నుంచి 5.25 మధ్య పవన్ కల్యాణ్, 5.25 నుంచి 5.30 వరకు పు రందేశ్వరి, 5.30 నుంచి 5.45 వరకు చంద్రబాబు ప్రసం గిస్తారు. 5.45 గంటలకు మోదీ ప్రసంగం ప్రారంభ మౌతుంది. ఆయన ప్రసంగాన్ని పురం దేశ్వరి తెలుగులో అనువాదం చేస్తారు. 6.50 గంటల కల్లా మోదీ పర్యటన ముగించుకుని బొప్పూడిలో ఏర్పా టు చేసిన హెలిప్యాడ్ నుంచి బయలుదేరి రాత్రి 7.20కి గన్నవరం చేరుకుం టారు. రాత్రి 7.30 గంటలకు గన్న వరం నుంచి హైదరా బాద్ బేగంపేట విమానశ్రయానికి వెళతారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సాయంత్రం) 6.24(ఆదివారం)
సహారీ (ఉదయం) 4.58 (సోమవారం)

అభ్యర్థులపై స్పష్టత



- ఉత్కంఠకు వైసీపీ అధిష్ఠానం తెర
- సురేశ్, రఘుపతిలకు మరోసారి అవకాశం
- అభ్యర్థులపై వ్యతిరేకతను లక్ష్యపెట్టని పార్టీ పెద్దలు

బాపట్ల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని అసెంబ్లీ, లోక్‌సభ స్థానాల్లో అధికారపార్టీ నుంచి బరిలో ఉండే అభ్యర్థులపై స్పష్టత వచ్చేసింది. బాపట్ల లోక్‌సభ అభ్యర్థి సహా జిల్లాలోని ఆరు నియోజకవర్గాల విషయంలో బరిలో నిలిచే అభ్యర్థులను శనివారం వైసీపీ ప్రకటించింది. అభ్యర్థుల ఎవరన్న అంశంపై వైసీపీ శ్రేణుల్లో నెలకొన్న ఉత్కంఠకు అధిష్ఠానం తెరదింపింది. ఎమ్మెల్యే కోన, ఎంపీ నందిగం సురేష్‌లకు మరోమారు అవకాశమిచ్చింది. తీవ్ర ఉత్కంఠ రేపిన చీరాల అసెంబ్లీ స్థానం విషయంలో సిట్టింగ్ ఎమ్మెల్యే కరణం బలరాం తనయుడు వెంకటేష్‌కే అభ్యర్థిత్వా న్ని ఖరారు చేసింది. బాపట్ల ఎంపీగా సిట్టింగ్ నందిగం సురేష్‌కు వైసీపీ మరో మారు అవకాశం ఇచ్చింది. ఇక బాపట్ల అసెంబ్లీ స్థానం నుంచి ఎమ్మెల్యే కోన మరోమారు తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. వరుసగా రెండుసార్లు విజయం సాధిం చిన కోన హ్యాట్రిక్ మీద కన్నేశారు. చీరాల నుంచి ఎమ్మెల్యే బలరాం కుమారుడు కరణం వెంకటేష్ తొలి సారి బరిలో నిలవనున్నారు. రేపల్లె నుంచి ఈవూరు గణేష్ మొదటి ప్రయత్నంగా తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. వేమూ రు నుంచి వరికూటి అశోక్‌బాబు, అద్దంకి స్థానంలో పాణెం హనిమిరెడ్డి, పర్చూరులో ఎడం బాలాజీ పోటీలో ఉండను న్నారు. దీంతో అధికారపార్టీ తరఫున పోటీలో ఉండే వారి విషయంలో పూర్తి స్థాయి స్పష్టత వచ్చినట్లైంది

అసమ్మతిలో.. నిరాశ నిస్పృహ

బాపట్ల అసెంబ్లీ స్థానంపై అధికారపార్టీ సామాజిక వర్గం నేతలు భారీగా ఆశలు పెట్టుకున్నారు. అయితే సీఎం జగన్ తిరిగి కోన రఘుపతి పేరునే ఖరారు చేయ డంతో సదరు నేతలు నిరాశ, నిస్పృహల్లోకి వెళ్లారు. కోన ఓటమే ధ్యేయంగా తాము పనిచేస్తామని గతంలో ప్రకటించినా అధిష్ఠానం లెక్కచేయలేదని అర్థమవుతోంది. ఇక రేపల్లెలో సీటు కోసం చివరి నిమిషం వరకు ఎంపీ మోపిదేవి ప్రయత్నాలు చేసిన సంగతి తెలిసిందే. కానీ అధిష్ఠానం ఈవూరు గణేష్ వైపే మొగ్గు చూపడంతో అక్కడ వైసీపీ కార్యకర్తల్లో నైరాశ్యం నెలకొంది. పర్చూరు విషయంలో తాజాగా నియమించిన ఎడం బాలాజీ గెలుపు మీద పార్టీ శ్రేణులు ఎప్పుడో నీళ్లు వదిలేసు కున్నారని సమాచారం. అద్దంకిలో పాణెం హనిమిరెడ్డి ఇప్పటికీ అక్కడ కుదురుకోలేని పరిస్థితి. చీరాలలో ఇంటిపోరు వైసీపీని వెంటాడుతూనే ఉంది. ఇలా దాదాపు ప్రతిచోట వైసీపీ అభ్యర్థుల విషయంలో అటు కేడర్‌లోనూ ఇటు సీటు ఆశించి భంగపడ్డ ఆశావహులలోనే అసంతృప్తి ఉంది.

రేపటి నుంచి పది పరీక్షలు

- 108 కేంద్రాలు.. 18,910 మంది విద్యార్థులు


కె.నారాయణరావు

బాపట్ల టౌన్, మార్చి 16: పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేం దుకు విద్యాశాఖాధికారులు అన్నిచర్యలు చేపట్టారు. సోమవారం ప్రారంభమయ్యే పరీక్షలు ఈ నెల 30 వరకు జరుగుతాయి. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. పరీక్షల్లో అక్రమాలు అరికట్టేందుకు ప్రతి ప్రశ్నాపత్రంపై క్యూఆర్‌కో డ్‌ను ముద్రించారు. ఎక్కడైనా అవాంఛనీయ ఘటనలు జరిగితే ఆయా పరీక్షా కేంద్రాన్ని గుర్తించి సంబంధిత అధికారిపై శాఖాపరమైన చర్యలు తీ సుకోవడానికి ఈ నూతన విధానంలో అవకాశం ఉంటుందని జిల్లా విద్యాశాఖాధికారి కె. నారాయణరావు తెలిపారు. పరీక్ష ప్రారంభ సమయం తర్వాత విద్యార్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించమన్నారు. జిల్లావ్యాప్తంగా పరీక్షలకు హాజరయ్యే 18,910 మంది విద్యార్థుల కోసం 108 కేంద్రాలను సిద్ధం చేశామన్నారు. కేంద్రాలను నో సెల్‌ఫోన్ జోన్‌గా ప్రకటించామన్నారు. కేంద్రాల వద్ద విద్యార్థులకు మౌలిక వసతుల తోపాటు ఎండతీవ్రత దృష్ట్యా మెడికల్ కిట్‌లు, తాగునీరు ఏర్పాటు చేస్తున్నట్లు డీఈవో తెలిపారు.

హాల్‌టిక్కెట్ ఇవ్వకపోతే ఆందోళన

ఫీజులు చెల్లించలేదని కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలలో 10 పరీక్షలకు హాజర య్యే విద్యార్థులకు హాల్‌టిక్కెట్ ఇవ్వకపోతే ఆ విద్యాసంస్థల ఎదుట ప్రత్యక్ష ఆందోళన చేస్తామని ఎస్ఎఫ్ఐ జిల్లానాయకుడు ఆర్య తెలిపారు. హాల్‌టిక్కెట్లు ఇవ్వని పాఠశాలలపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అమరజీవిని ఆదర్శంగా తీసుకోవాలి

- నివాళులర్పించిన కలెక్టర్ పి.రంజిత్‌బాషా


పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూల మాలలు వేస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల, మార్చి 16: అమరజీవి పొట్టి శ్రీరాము లను ఆదర్శంగా తీసుకుని యువత ముందుకుసాగాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలి పారు. పొట్టి శ్రీరాముల జయంతి కార్యక్రమం శని వారం జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ అమరజీవి చిత్రపటా నికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ తెలుగుజాతి కొరకు ప్రాణాలర్పించిన మహనీయు డు పొట్టి శ్రీరాములు అన్నారు. స్వాతంత్ర్యం అనంతరం తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం కావాలంటూ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారన్నారు. జాతీ అభ్యివద్ధిని కాంక్షిస్తూ భాషాప్రయుక్త రాష్ట్రాలు ఉండాలని అవిశ్రాంత ఉద్యమం చేశారన్నారు. తెలుగు ప్రజల మనోభావాలను కాపాడటానికే ఆయన నడిపిన ఉద్యమాలు చరిత్రలో నిలిచాయన్నారు. అలాంటి గొప్పనాయకుల జయంతి కార్యక్రమాన్ని రాష్ట్రప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం శుభపరిణామమ న్నారు. కార్యక్రమంలో డీఆర్వో సి.హెచ్.సత్తిబాబు, జిల్లా బీసీ సంక్షేమశాఖాధికారి వైన రసారెడ్డి, సహాయ బీసీ సంక్షేమశాఖాధికారి రాజేష్, సంక్షేమాధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు డివి.ఎస్.నాగరాజు, పర్యవేక్షకులు జిలానీ బాషా తదితరులు పాల్గొన్నారు.

గ్రూపు-1 పరీక్షలకు పటిష్ట బందోబస్తు

- 23 కేంద్రాలు.. 15040 మంది అభ్యర్థులు
- గుంటూరు బస్టాండ్, రైల్వేస్టేషన్, హిందూ కళాశాల వద్ద హెల్ప్ డెస్క్‌లు

గుంటూరు, మార్చి 16: గ్రూపు - 1 ప్రిలిమినరీ పరీక్షలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తుషార్‌డూడీ తెలిపారు. 23 కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్షలకు 15 వేల 40 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద పకడ్బందీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రశ్నపత్రాలను సెంటర్లకు చేరవేసేందుకు ఆయా రూట్లలో సాయుధ ఎస్కార్ట్ సిబ్బందిని నియమించారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు కేంద్రాల్లోకి ఉదయం 9:45 గంటల వరకు మాత్రమే అనుమతి ఉంటుంది. రెండో పరీక్షకు మధ్యాహ్నం 1.45 వరకు అనుమతిస్తారు. కేంద్రంలోకి ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించరు. మాల్ ప్రాక్టీస్ జరగకుండా ప్రతి ఒక్క అభ్యర్థిని క్షుణ్ణంగా తనిఖీ చేసేందుకు ఆయా పరీక్ష కేంద్రాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే అభ్యర్థుల సౌకర్యార్థం పరీక్షా కేంద్రాల వివరాల కొరకు గుంటూరు రైల్వేస్టేషన్ తూర్పు, పశ్చిమ ద్వారాల వద్ద, ఆర్టీసీ బస్టాండ్, హిందూ కళాశాల కూడలి వద్ద పోలీస్ హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. కేంద్రాలకు చేరుకునే రూట్, కళాశాల వివరాల సమాచారాన్ని హెల్ప్‌డెస్క్ వద్ద తెలుసుకోవచ్చన్నారు. డయల్-100, 8688831568, 8688831392 నెంబర్లకు ఫోన్ చేసి కేంద్రాలకు చేరుకునే సమాచారాన్ని అభ్యర్థులు తెలుసుకోవచ్చన్నారు.

పది పరీక్షలకు అంతా సిద్ధం

చినగంజాం, మార్చి 16: పదో తరగతి పరీక్షలు ఈనెల 18 నుంచి జరగనున్నాయని ఎంఈవో-1 బి.అజయ్‌బాబు తెలిపారు. వీటికోసం చినగంజాం, కడవకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మండల పరిధిలో 417 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. చినగంజాం, కడవకుదురులో పరీక్షా కేంద్రాల్లోని వసతులను పరిశీలించినట్లు ఎంఈవో తెలిపారు.

ఇంకొలు: ఇంకొల్లు మండలంలో ఆరు పరీక్షా కేంద్రాలలో పదో తరగతి పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాటు పూర్తిచేసినట్లు మండల విద్యాశాఖాధికారులు రాఘవరావు, శ్రీనివాసరావు తెలిపారు. శనివారం మండలంలోని పరీక్షా కేంద్రాలలో వసతి ఏర్పాట్లను వారు పరిశీలించారు. మండలంలో 855 మంది పదో తరగతి పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు.

మార్టూరు: పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు మండల విద్యాధికారి సీహెచ్ వస్రాంనాయక్ తెలిపారు. సోమవారం నుంచి జరగనున్న ఈ పరీక్షలను మండలంలో ఐదు పరీక్షా కేంద్రాలలో విద్యార్థులు రాయనున్నారు. మార్టూరు, వలపర్ల, ద్రోణాదుల జడ్పీ హైస్కూల్లో, మార్టూరులోని రాయల్, శ్రీచైతన్య స్కూల్లో విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఈ కేంద్రాలలో 1045 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఎంఈవో తెలిపారు. అలాగే, యద్దనపూడి మండలంలో రెండు కేంద్రాలలో విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఎంఈవో గోపి తెలిపారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత

అద్దంకిటౌన్, మార్చి 16: మండలంలోని చక్రాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయేషా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో పదో తరగతి పరీక్షలు రాయబోయే విద్యార్థులకు అవసరమైన సామగ్రిని సొసైటీ డైరెక్టర్ అయేషా బేగం, కోశాధికారి అంజలి అందజేశారు. అలాగే, కలవకూరు గ్రామానికి చెందిన తేళ్ల హనుమంతరావు పదో తరగతి విద్యార్థులకు సాయం చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం కేవీ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు దాతలను సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

తహసీల్దార్‌గా కృష్ణకాంత్ బాధ్యతల స్వీకరణ

వేటపాలెం(చీరాల), మార్చి 16: వేటపాలెం తహసీల్దార్‌గా కృష్ణకాంత్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. బాపట్ల కలెక్టరేట్‌లో ఏవోగా పనిచేస్తూ బదిలీపై వేటపాలెం వచ్చారు. ఈసందర్భంగా కార్యాలయ అధికారులు, సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు. నూతన తహసీల్దార్ కృష్ణకాంత్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అందరూ సహకరించాలని కోరారు.

విలువైన సమయం వృథా చేసుకోవద్దు!

చీరాలటౌన్, మార్చి 16: ఉద్దేశపూర్వకంగా కక్ష సాధింపులతో విలువైన సమయాన్ని వృథా చేసుకోవద్దని సీనియర్ సివిల్ న్యాయాధికారి, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ సుధ పేర్కొన్నారు. ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు శనివారం కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈక్రమంలో 90 క్రిమినల్, తదితర కేసులను పరిష్కరించినట్లు న్యాయాధికారి తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

నేటి నుంచి తెరుచుకోనున్న గ్రానైట్ పరిశ్రమలు

మార్టూరు, మార్చి 16: మార్టూరు ప్రాంతంలో మూసివేసిన గ్రానైట్ పరిశ్రమలు ఆదివారం నుంచి తెరుచుకోనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం గ్రానైట్ పరిశ్రమల యజమానుల సమస్యలను పరిష్కరించాలని, సంక్షోభంలో కూరుకు పోతున్న గ్రానైట్ పరిశ్రమను కాపాడాలని కోరుతూ ఈనెల 8 నుంచి ఈ ప్రాంతంలోని సుమారు 200 గ్రానైట్ పరిశ్రమలను యజమానులు మూసివేశారు. ఇదిలాఉండగా గత నాలుగు రోజుల నుంచి కృష్ణా జిల్లా మైనింగ్ విజిలెన్స్ ఏడీ ప్రతాపరెడ్డి, నెల్లూరు ఏడీ బాలాజీ నాయక్ ఆధ్వర్యంలో రెండు బృందాలతో మార్టూరు మండలంలోని జొన్నతాళి సెంటరు సమీపంలోని కామేపల్లి లక్ష్మీప్రసాద్‌కు చెందిన రెండు గ్రానైట్ పరిశ్రమలను తనిఖీ చేశారు. అతనికి చెందిన బల్లికురవ, సంతమాగులూరు మండలాలలోని గ్రానైట్ క్వారీలను తనిఖీ చేయడానికి ప్రయత్నాలు చేశారు. ఒకవైపు గ్రానైట్ పరిశ్రమలను మూత వేయడం, మరోవైపు మైనింగ్ విజిలెన్స్ అధికారుల తనిఖీలతో మార్టూరు ప్రాంతంలోని గ్రానైట్ పరిశ్రమల యజమానుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఎట్టకేలకు గ్రానైట్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని అధికార పార్టీ నేతలు ఇచ్చిన హామీలమేరకు మూసివేసిన గ్రానైట్ పరిశ్రమలను తెరవాలని అసోసియేషన్ నిర్ణయించింది.

వలపర్లలో కన్యకాపరమేశ్వరి విగ్రహ ప్రతిష్ఠ

మార్టూరు, మార్చి 16: మండలంలోని వలపర్ల గ్రామంలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. గ్రామంలోని ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో దాతల సహకారంతో అమ్మవారి దేవాలయాన్ని నిర్మాణం చేశారు. విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం అనంతరం భక్తులకు భారీగా అన్న సంతర్పణ చేశారు.

రెండు బైక్‌లు ఢీ.. ఒకరికి గాయాలు

మార్టూరు, మార్చి 16: జాతీయ రహదారిపై యలవర్తి కోల్డ్ స్టోరేజీ ఎదురుగా రెండు ద్విచక్రవాహనాలు ఢీ కొనగా షేక్ బాషా అనే వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన శనివారం మధ్యాహ్నం జరిగింది. మండలంలోని నాగరాజు పల్లికి చెందిన భాషా వ్యక్తిగత పని నిమిత్తం ద్విచక్రవాహనంపై చిలకలూరిపేట వెళ్లి వస్తున్నాడు. ఈక్రమంలో మరో ద్విచక్రవాహనదారుడు బాషా బైక్‌ను ఢీకొట్టడంతో కాలికి తీవ్రగాయమైంది. హైవే అంబులెన్స్‌లో ఒంగోలులోని రిమ్స్‌కు తరలించారు. మార్టూరుకు చెందిన మరో బైకిస్టుకి స్వల్ప గాయాలయ్యాయి.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

పర్చూరు, మార్చి 16: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వైసీపీ నియోజకవర్గ అభ్యర్థి యడం బాలాజీ అన్నారు. శనివారం స్థానిక ఎస్‌కేపీఆర్ డిగ్రీ కళాశాలలో జరిగిన నాల్గవ విడత చేయూత చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లా అంజమ్మ, ఎంపీపీ మేకా ఆనందకుమారి, వైస్ ఎంపీపీ కోటా ప్రసన్న, నాయకులు కొల్లా వెంకట్రావు, గాజుల రమేష్ పాలెపోగు రాంబాబు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా శేషుకుమారి

పర్చూరు, మార్చి 16: భవనం అంజిరెడ్డి తులాబంధుల అర్జునయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఎస్.శేషుకుమారి శనివారం బాధ్యతలు స్వీకరించారు. బాపట్ల జిల్లా చేబ్రోలు ప్రభుత్వ కళాశాలలో జువాలజీ లెక్చరర్‌గా పనిచేస్తూ పదోన్నతిపై పర్చూరు ప్రిన్సిపాల్‌గా బదిలీ అయ్యారు. ఇప్పటివరకు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా చింపారెడ్డి బాధ్యతలు నిర్వహించారు.

ప్రజాస్వామ్య స్ఫూర్తిని పెంపొందించుకోవాలి

చినగంజాం, మార్చి 16: ప్రతిఒక్కరూ స్వేచ్ఛగా ఎన్నికల్లో పాల్గొనాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక, ఊరురా జనవిజ్ఞానం రాష్ట్ర నాయకుడు కోట వెంకటేశ్వరరెడ్డి అన్నారు. ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని ప్రజాస్వామ్య స్ఫూర్తిని పెంపొందించుకోవాలని అన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం రాత్రి స్థానిక శివాలయం సెంటర్‌లో ప్రజాస్వామ్యం ఎన్నికల ఓటరు చైతన్య విధాన పత్రాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు పల్లపోలు నాగమనోహర్‌లోహియా, పృథ్వీ రామారావు, నున్నా హరిబాబు, ఎస్.రమణారెడ్డి పాల్గొన్నారు.

రొంపేరులో ఆగని మట్టి తవ్వకాలు

- అక్రమార్కుల్లో ఆధిపత్యపోరు
- కొనసాగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించిన డ్రైనేజీ అధికారులు


ట్రాక్టర్లను ఆపి హెచ్చరిస్తున్న ఈఈ మురళీకృష్ణ, డీఈ సుబ్బారావు

వేటపాలెం(చీరాల), మార్చి 16: నాలుగు ఎక్స్‌కవేటర్లు, పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో రెండు మూడు రోజుల నుంచి అధికారపార్టీకి చెందిన అక్రమార్కులు ఇష్టారాజ్యంగా రొంపేరులో మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. వేటపాలెం మండలం దేశాయిపేట సమీపంలో రొంపేరు భూముల్లో తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. అక్రమార్కుల్లో ఆధిపత్య పోరుతో పోటీపడి అక్రమ తవ్వకాలు సాగించారు. దంతం హనుమంతరావు అనే వ్యక్తికి 300 క్యూబిక్ మీటర్లు మట్టి నిబంధనల మేరకు తవ్వుకునేందుకు డ్రైనేజీ అధికారులు సీనరేజి చెల్లించేవిధంగా అనుమతి ఇచ్చారు. అయితే, రొంపేరులో పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో వందల ట్రిప్పులు మట్టిని తరలించారు. ఈ విషయం శుక్రవారం వెలుగులోకి వచ్చింది. డ్రైనేజీ అధికారులు వేటపాలెం పోలీసులకు ఫిర్యాదు చేయటంతో పోలీసుల రంగప్రవేశంతో తాత్కాలికంగా తవ్వకాలు, తరలింపు నిలిపివేసి తరువాత కొనసాగించారు. శనివారం సూర్యోదయం నుంచి యథావిధిగా ఎక్స్‌వేటర్‌తో ట్రాక్టర్లకు మట్టిని నింపి తరలించారు. ఈక్రమంలో డ్రైనేజీ ఈఈ మురళీకృష్ణ, డీఈ సుబ్బారావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆసమయంలో మార్గమధ్యంలో పదుల సంఖ్యలో ట్రాక్టర్లు మట్టిని నింపుకుని రావటం వారి కళ్లబడింది. దీంతో వాటిని నిలిపివేసి ట్రాక్టర్ డ్రైవర్లను హెచ్చరించారు. 300 క్యూబిక్ మీటర్లను అనుమతి పొందిన దంతం హనుమంతరావుకు ఫోన్‌చేసి పిలిపించారు. ఈఈ మురళీకృష్ణ మాట్లాడుతూ అనుమతి పొందిన 300 క్యూబిక్ మీటర్లుకన్నా ఇప్పటికే భారీగా మట్టిని తవ్వకాలు జరిగినట్లు తమ పరిశీలనలో వెల్లడయిందన్నారు. ఇచ్చిన అనుమతిని కూడా రద్దు చేస్తున్నట్లు హనుమంతరావుకు చెప్పారు. ఇకపై ఎవరు మట్టిని తవ్వినా, తరలించినా వాహనాలను సీజ్ చేయించటం, వారిపై కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.

ఆధిపత్యపోరు.. రొంపేరులో మట్టి తవ్వకాలకు సంబంధించి అధికారపార్టీకి చెందిన అక్రమార్కుల మధ్య ఆధిపత్యపోరు సాగుతోంది. అందులో ఒకరు(ఒక వర్గం) 300క్యూబిక్ మీటర్లకు అనుమతి పొందగా, మరొకరు(మరో వర్గం) అక్రమాలను కట్టడి చేయాల్సిన శాఖల్లో ఒక శాఖకు చెందిన స్థానిక అధి కారి అండతో అనధికారికంగా తవ్వకాలు సాగించారు. ఈ క్రమంలో వారి మధ్య నెలకొన్న ఆధిపత్య పోరుతో ఒకరిని మించి మరొకరు అక్రమ తవ్వ కాలకు పాల్పడటం తమకు శాపంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అమరజీవి త్యాగాలు మరువలేనివి!


పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

అద్దంకిటౌన్, మార్చి 16: ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం సాధించడానికి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగాలు మరువలేవని రోటరీ క్లబ్ సభ్యులు కొనియాడారు. శనివారం పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో పాత బస్టాండ్ సెంటర్‌లోని శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసరావు, కోశాధికారి కొల్లా భువనేశ్వరి, మురళి, జ్యోతి చంద్రమౌళి, షేక్ మహమ్మద్ రఫీ, తమ్మన శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, బాబుజి తదితరులు పాల్గొన్నారు.

చీరాల: పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా స్థానిక ముక్కోణపు పార్కు సెంటర్లోని ఆయన విగ్రహానికి పలుపార్టీల నేతలు, పలు సంఘాలు, సంస్థల ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాసవి క్లబ్, వనిత క్లబ్‌ల ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండులో వేసవి కాలం పూర్తయ్యే వరకు తాగునీటి చలివేంద్రంను ఏర్పాటు చేశారు. డిపో మేనేజర్ శ్యామల చలివేంద్రను ప్రారంభించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు ఊటుకూరి బాలవెంకట సత్యన్నారాయణ, నంజూరి అనూరాధ, వల్లంపట్ల వెంకటేశ్వరరావు, తూతిక మల్లికార్జునరావు, పోలిశెట్టి శ్యామ్‌సుందరావు, తదితరులు పాల్గొన్నారు. అలాగే, వేటపాలెం ప్రధాన కూడలిలోని అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్సై సురేష్, పట్టభద్రుల సంఘం అధ్యక్షుడు ప్రత్తి వెంకటసుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

చినగంజాం: స్థానిక కన్యకా పరమేశ్వరి అమ్మవారి మందిర ఆవరణలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి మండల ఆర్యవైశ్య సంఘం, వాసవి వనితా క్లబ్ ఆధ్వర్యంలో నాయకులు, సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు కోట శివరామకృష్ణ, అమరా శ్రీనివాసరావు, జీవీ లక్ష్మీనారాయణ, పద్మనాభుని పవన్‌కుమార్, కోట సుచిత్ర, భయ్యా జ్యోతి, పొట్టి శైలజ తదితరలు పాల్గొన్నారు.

మార్టూరు: అమరజీవి పొట్టి శ్రీరాముల జయంతి వేడుకలను శనివారం యద్దనపూడి మండలం యనమదల గ్రామంలోని పాఠశాలలో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం వంద మంది విద్యార్థుకు పరీక్ష అట్టలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పి.హనుమంతరావు, దారా బాలసుబ్బారావు, కె.వెంకటరాంబాబు, పి.బసవయ్య, ప్రధానోపాధ్యాయుడు భవాని తదితరులు పాల్గొన్నారు. అలాగే, మార్టూరు మండల కేంద్రంలో మండల ఆర్య వైశ్య భవనం వద్ద ఆర్యవైశ్య నాయకులు పొట్టి శ్రీ రాములు విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మోదడుగు మురళి, పొత్తూరి శివ, వీరాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ఇంకొల్లు: మండలంలోని ఇడుపులపాడు విద్యాపరిషత్ ఉన్నత పాఠశాలలో పొట్టి శ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు పేరిరెడ్డి అమరజీవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

పర్చూరు: పర్చూరులో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఎంపీపీయూపీ పాఠశాలలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. అనంతరం 150 మంది విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ అధ్యక్షుడు పోలిశెట్టి గురుప్రసాద్, కార్యదర్శి కొత్తూరి వెంకటేశ్వరరావు, మామిడిపాక కిరణ్ కుమార్, పాఠశాల సిబ్బంది పోలిశెట్టి హనుమంతరావు, బొజ్జ సురేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, పర్చూరు శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థాన ప్రాంగణంలో ఉన్న శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య సంఘ నాయకులు మామిడిపాక హరిప్రసాద్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఎంతో కష్టపడి పనిచేశా.. బలిపశువును చేశారు!

- పరోక్షంగా వైవీని విమర్శించిన బాచిన కృష్ణచైతన్య
- చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిక


చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరుతున్న కృష్ణచైతన్య


అనుచరులతో మాట్లాడుతున్న బాచిన కృష్ణచైతన్య

అద్దంకి, మార్చి 16: వ్యక్తిగతంగా టార్గెట్ చేసి వైసీపీలో అద్దంకిలో సీటు లేకుండా చేయటం బాధ కలిగించిందని వైసీపీ మాజీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాచిన కృష్ణచైతన్య అన్నారు. తండ్రి, కొడుకులు బాచిన చెంచుగరటయ్య, కృష్ణచైతన్యలు తన అనుచరులతో కలిసి ఉండవల్లిలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు సమక్షంలో పార్టీలో చేరేందుకు శనివారం అద్దంకి నుంచి ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. ముందుగా తనతో కలిసి టీడీపీలో చేరేందుకు సంసిద్ధులైన నియోజకవర్గంలోని పలుగ్రామాల నేతలతో సమావేశమయ్యారు. అనంత రం కృష్ణచైతన్య విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి బంధువుగా చెప్పుకోవటం మినహా ఎలాంటి అర్హత లేదని, అద్దంకి నియోజకవర్గానికి ఎలాంటి అభివృద్ధి నిధులు మంజూరు చేయించలేదని పరోక్షంగా రాజ్యసభసభ్యుడు వైవీ సుబ్బారెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. తన తండ్రి పేరుతో ఉన్న యర్రం చినపోలిరెడ్డి ఎత్తిపోతల పథకం పూర్తి చేసేందుకు రూ.110 కోట్లు మంజూరు చేయించలేక పోయారన్నారు. నాలుగున్నరేళ్లు వైసీపీ కోసం తాను ఎంతో కష్టపడినా గుర్తించకుండా సొంత ఇమేజ్ కోసం వేరే వ్యక్తికి అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నియమింపచేయటం లో మాత్రం ఆయన కృతకృత్యులయ్యారన్నారు.

అనుచరులతో ర్యాలీగా వెళ్లిన తండ్రి, కొడుకులు

మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచుగరటయ్య, కృష్ణచైతన్యలు అద్దంకి నుంచి ర్యాలీగా వెళ్లి ఉండవల్లిలో చంద్రబాబు సమక్షంలో టీ డీపీలో చేరారు. బల్లికురవ, పంగులూరు, సంతమాగులూరు, కొరిశపాడు మండల వైసీపీ అధ్యక్షులు చింతల పేరయ్య, యర్రం శ్రీనివాసరెడ్డి, చింతా రామారావు, రావి శ్రీధర్, పంగులూరు జడ్పీటీసీ రాయిని ప్రమీల సుబ్బారావు, కొరిశపాడు ఎంపీపీ సాధినేని మస్తాన్‌రావు, పీడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ సందిరెడ్డి రమేష్, అద్దంకి మున్సిపల్ 19వ వార్డు కౌన్సిలర్ యేజెండ్ల నాగరాజు, మాజీ ఎంపీపీ గోరంట్ల పద్మావతి శివాజీ, కామేపల్లి హనుమంతరావు, చింతా శ్రీధర్, గుండపనేని సుబ్బారావు, ఎం.సుబ్బారావు, సర్పంచ్‌లు ధూళిపాళ్ల వెంకటరావు, జక్రయ్య, బుల్లిరామయ్య, అమరనేని రమేష్, గుంజి జీవరత్నం, దివే రామాంజనేయులు జాగర్లమూడి సుబ్బారావుతో పాటు పలువురు నేతలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు.

ఎన్నికల కోడ్ ముంగిట సచివాలయ భవనం ప్రారంభం


సచివాలయాన్ని ప్రారంభిస్తున్న హనిమిరెడ్డి సోదరుడు శ్రీనివాసరెడ్డి

అద్దంకి, మార్చి 16: ఎన్నికల కోడ్ కొన్ని గంటలలో వెలువడుతుందన్న ఉద్దేశంతో అద్దంకి మండలంలోని వైసీపీ నేతలు హడావుడిగా కొటికలపూడిలో గ్రామ సచివాలయం భవవాన్ని శనివారం ఉదయం ప్రారంభించారు. కనీసం ప్రజా ప్రతినిధులైనా సచివాలయం భవనంను ప్రారంభించారా అంటే అదీ లేదు. ఎంపీపీ హోదాలో అవిశన జ్యోతి ప్రారంభించే అవకాశం ఉన్నప్పటికీ పక్కనపెట్టి వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాణెం హనిమిరెడ్డి సోదరుడు శ్రీనివాసరెడ్డి ప్రారంభించటం చర్చనీయాంశంగా మారింది. గ్రామ సర్పంచ్‌గా టీడీపీ మద్దతుదారుడుగా ఉన్న పూనాటి విక్రమ్ ప్రారంభోత్సవానికి హాజరుకాలేదు. వైసీపీ నేతల ఆధ్వర్యంలో శ్రీనివాసరెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించటం పట్ల తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఇప్పటివరకు ఎలాంటి పదవి లేకపోయినా వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఉన్న పాణెం హనిమిరెడ్డి ప్రారంభోత్సవాలు చేయగా, శనివారం కొటికలపూడిలో ఆయన సోదరుడు శ్రీనివాసరెడ్డి ప్రారంభించటం మరింత విమర్శలకు తావిస్తుంది. నిబంధనలకు విరుద్ధంగా ప్రారంభోత్సవాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవటం పట్ల పలువురు విమర్శిస్తున్నారు.

టీడీపీ బలోపేతమే లక్ష్యం

- ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

పర్చూరు, మార్చి 16: టీడీపీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. పెద్దగంజాం మండలం పెద్దపల్లిపాలెం నుంచి తెలుగుదేశం పార్టీలోకి భారీగా చేరారు. శనివారం మార్టూరు మండలం ఇసుకదర్శిలోని క్యాంపు కార్యాలయంలో ఏలూరి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ కూట మి విజయం తథ్యమన్నారు. భారీ మెజారిటీతో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని చెప్పారు. సంక్షేమ పాలన అందిస్తామన్నారు. వైసీపీ పాలనలో వ్యవస్థలన్నీ ధ్వంసమయ్యాయన్నారు. మత్స్యకారుల సంక్షేమానికి తెలుగుదేశం పార్టీ విశేష కృషిచేస్తుందని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికి వలలు, బోట్లు, పడవలు, ఐస్ బాక్సులు సబ్సిడీపై అందిస్తామన్నారు.

పార్టీలో చేరిన వారిలో కొల్లాటి సుబ్బారావు, కొల్లాటి బ్రహ్మయ్య, కనక శ్రీను, గోపి, బాలరాజు, సత్యనారాయణ, నాగరాజు, కృష్ణ, నాయుడు ఏడుకొండలు, వెంకటేష్, వాటిపల్లి ఆంజనేయులు, వీరాస్వామి, పోలయ్య, వెంకటసుబ్బారావు, మీరా సాహెబ్ నాయుడు, నాయుడు సుబ్బారావు, వాటిపల్లి శ్రీను, దండుప్రోలు వెంకటేశ్వర్లు, పీత సునీత, వల్లభనేని అదేమ్మ, దుర్గ, లక్ష్మీ, సాంబమ్మ, తదితరులు ఉన్నారు.

కార్యక్రమంలో ఎంపీటీసీ పీత భార్గవి, మాజీ ఎంపీటీసీలు కొక్కిలిగడ్డ రాములు, షేర్ వెంకటేశ్వర్లు, నాయకులు దండుప్రోలు బాలరాజు, వాటుపల్లి ఏడుకొండలు, తిరుపాలు, సంకే శ్రీను, గోపాలం, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి పెరుగుతున్న వలసలు


చినగంజాంలో ర్యాలీకి జెండా ఊపుతున్న టీడీపీ నేతలు

చినగంజాం, మార్చి 16: మండల పరిధిలోని పలుగ్రామాల నుంచి తెలుగుదేశం పార్టీలోకి రోజురోజుకు వలసలు పెరుగుతున్నాయని తెలుగురైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆసోది సుబ్బారెడ్డి, మండల అధ్యక్షుడు పొద వీరయ్య అన్నారు. మండలంలోని పల్లెపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని పెద్దపల్లెపాలెంకు చెందిన 70 కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీలో చేరుతున్నట్లు వీరయ్య తెలిపారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సమక్షంలో టీడీపీలో చేరేందుకు వీరు పలువాహనాల్లో ర్యాలీగా చినగంజాం నుంచి ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయానికి బయలుదేరారు. స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద శనివారం టీడీపీ నాయకులు ర్యాలీకి జెండా ఊపారు.

కార్యక్రమంలో చినగంజాం సర్పంచ్ రాయని ఆత్మారావు, జనసేన మండల అధ్యక్షుడు సందు శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు బత్తుల శ్రీనివాసరావు, అబ్దుల్‌కలాంఅజాద్, నక్కల వీరరాఘవులు, సందు శ్రీనివాసరావు, టి.జయరావు, నరహరి శ్రీనివాసరావు, కె.భాస్కరరెడ్డి, వాటుపల్లి ఏడుకొండలు, రాజు ఉదయ భాస్కరరెడ్డి, గంటా వెంకటనారాయణ, శేరు వెంకటేశ్వర్లు, నాంచార్యులు, కె.రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనకు ప్రాధాన్యం


ఏలూరి సమక్షంలో పార్టీలో చేరిన కిశోర్ కాలనీవాసులు

మార్టూరు, మార్చి 16: ఉపాధి కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తామని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. వచ్చే ఎన్నికల్లో కూటమిదే అధికారమని చెప్పారు. శనివారం మార్టూరు గ్రామ పంచాయతీలోని కిశోర్ కాలనీవాసులు ఏలూరి క్యాంపు కార్యాలయంలో తెలుగు దేశం పార్టీలో చేరారు. వారందరికి ఏలూరి పార్టీ కండువాలను మెడలో వేసి స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో ఎస్టీలకు రాజకీయపరంగా సముచిత స్థానం ఇచ్చినట్లు చెప్పారు. రానున్నది తెలుగుదేశం ప్రభుత్వమేనని, ఎస్టీల కుటుంబాల అభివృద్ధికి, నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పనకు ప్రత్యేక సంక్షేమ పథకాలను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునే విధంగా కష్టపడి పని చేయాలన్నారు. ఇతర ప్రాంతాలకు ఉపాధి కోసం వలస వెళ్లినవారిని గుర్తించి ఎన్నికల సమయానికి వచ్చి ఓటు వేసేవిధంగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో కన్నెగంటి శ్రీనివాసరావు, దురిశాల రామకృష్ణ, మల్లా వెంకటేశ్వర్లు, భోగ్య శ్రీను, భోగ్య రాజు, మల్లా పెదశ్రీను, ఏడుకొండలు, సుబ్బారాయుడు, తదితరులు పాల్గొన్నారు.


ఎన్నికల నియమావళిని కట్టుదిట్టంగా అమలుచేయాలి

బల్లికురవ, మార్చి 16: ఎన్నికల షెడ్యూల్ విడుదలయిందని, తక్షణమే అన్ని గ్రామాలలో ఎన్నికల నియమావళిని కట్టుదిట్టంగా అమలుపరచాలని ఎంపీడీవో హనుమారెడ్డి కోరారు. శనివారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాలలో రాజకీయ పార్టీల ఫ్లెక్సీలను తొలగించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలపై ఉన్న రాజకీయ పార్టీల పోస్టర్లను తీసివేయించాలని చెప్పారు. అలాగే, గ్రామాలలో ఉన్న విగ్రహాలకు ముసుగు వేయించాలన్నారు. అధికారులు కూడా బాధ్యతాయుతంగా పనిచేయాలని చెప్పారు. రాజకీయ పార్టీల సమావేశాల్లో పాల్గొంటే చర్యలు తప్పవన్నారు. అనంతరం గ్రామానికి ముగ్గురితో టీంలను ఏర్పాటు చేశారు. వీరు నిరంతరం గ్రామాలలో పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు.

టీడీపీలో చేరిన మాజీ మంత్రి పాలేటి


టీడీపీలో చేరిన డాక్టర్ పాలేటి రామారావు

చీరాల, మార్చి 16: మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావు శనివారం టీడీపీ అధినేత చంద్రబాబు సమక్షంలో పార్టీలో చేరారు. దీంతో ఆయన సొంత గూటికి చేరినట్లయింది. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బాచిన చెంచుగరటయ్య, డాక్టర్ పాలేటిలు ఇటీవల కలిశారు. రాజకీయంగా వారి మధ్య కొంత చర్చ జరిగింది. ఆక్రమంలో గరటయ్య, ఆయన తనయుడు కృష్ణచైతన్య టీడీపీలో చేరే విషయం కూడా చర్చకు వచ్చింది. అందులోభాగంగా గరటయ్య, చంద్రబాబుతో మాట్లాడి తనను కూడా పార్టీలో చేరేందుకు ముందస్తుగా మాట్లాడారని, ఆక్రమంలో గరటయ్యతో కలసి టీడీపీ చేరినట్లు డాక్టర్ పాలేటి తెలిపారు.



అమరజీవి త్యాగం అజరామరం



పొట్టిశ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు (సాంస్కృతికం/క్రైం) : తెలుగు వారి ఆత్మగౌరవం కోసం ఆమరణ నిరాహారదీక్ష తీసి ప్రాణత్యాగం చేసిన పొట్టిశ్రీరాములు త్యాగం అజరామరమని కలెక్టర్ ఎం.హరినారాయణన్ కొనియాడారు. శనివారం పొట్టిశ్రీరాములు 124వ జయంతి సందర్భంగా జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాలు, ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు అమరజీవి విగ్రహాలకు, చిత్రపటాలకు పుష్ప మాలలు వేసి నివాళులు అర్పించారు. నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ వద్దనున్న పొట్టిశ్రీరాములు విగ్రహానికి కలెక్టర్ పుష్పమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆయన చేసిన త్యాగం నేటి యువతకు స్ఫూర్తి కావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి వెంకటయ్య, ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

● జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపుఎస్పీ సీహెచ్ సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా ఆధార్ అప్‌డేట్

● జూన్ 14 వరకు అవకాశం



నెల్లూరు (హరనాథపురం), మార్చి 16 : ప్రతి విషయానికి ఆధార్ కార్డు అనేది తప్పనిసరి అయ్యింది. ఎప్పుడో పదేళ్లనాడు తీసుకున్న ఆధార్ కార్డు చెల్ల కుండా పోయే అవకాశం త్వరలో ఏర్పడే అవకాశం ఉంది. ఇలాంటి కార్డుల అప్‌డేట్ కోసం ఉచితంగా ఆధార్ అప్‌డేట్ చేసుకొనే అవకాశాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ నెల 14వ తేదీతో ఉచితంగా ఆధార్ అప్‌డేట్ చేసుకునే అవకాశం ముగిసింది. అయితే, ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం ఈ ఉచిత అప్‌డేట్ అవకాశాన్ని మరోమారు పొడిగించింది. జూన్ 14వ తేదీ వరకు అప్‌డేట్ చేసుకోవచ్చు. 2014కు ముందు ఆధార్ కార్డును పొందిన వారు తప్పని సరిగా అడ్రసును, గుర్తింపును నవీకరించుకోవాల్సి ఉంది. ఈ నవీకరణ కోసం ఓటరు కార్డు, పాస్‌బుక్, పాన్‌కార్డు, పాస్‌పోర్టు, రేషన్‌కార్డు తదితరాలను వినియోగించవచ్చు. ఈ అప్‌డేట్ ప్రక్రియను యూఐడీఏఐ పోర్టల్‌లో మాత్రమే చేసుకోవాలి.

మార్చిలోనే మండుటెండలు !



నెల్లూరు (వైద్యం), మార్చి 16 : మార్చిలోనే భానుడు భగభగ మండిపోతు న్నాడు. వారం రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు 36 డిగ్రీలు నమోదవుతుండటంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. రాబోవు రోజుల్లో ఎండ మరింత ఉండబోతుందని వాతావరణ శాఖ హెచ్చరికలతో అన్ని వర్గాల్లో గుబులు మొదలైంది. ఉదయం 11 గంటలపైన వృద్ధులు, చిన్నారులు, మహిళలు బయట తిరగలేని పరిస్థితి నెలకొంది. వేసవి తీవ్రత వల్ల చమట రూపంలో రెండున్నర నుంచి మూడు లీటర్ల వరకు నీటిని కోల్పోయే పరిస్థితి వస్తుంది. మహిళల్లో రోగ నిరోధక శక్తి కూడా తక్కువగా ఉండడంతో చర్మవ్యాధులతోపాటు తలనొప్పి, ఆకలి మందగించడం, మూత్రసంబంధిత వ్యాధులు, మతిభ్రమణం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. ఈ పరిస్థితుల్లో ప్రతిఒక్కరూ జాగ్రత్త వహించాలని వైద్యనిపుణులు హెచ్చరిస్తు న్నారు. వడగాలులు, డీహైడ్రేషన్, వడదెబ్బ, నీటి కాలుష్యం వల్ల వచ్చే డయేరియా, వైరల్ జ్వరాలు ఇతర వ్యాధులు మనిషి మనుగడకు సవాలుగా మారనున్నాయి. అయితే కాస్త ముందుచూపుతో వ్యవహరిస్తే ఈ సమస్య నుంచి తప్పించుకోవచ్చని వైద్యనిపుణులు తెలియజేస్తున్నారు.

తేదీ	గరిష్ఠం	కనిష్ఠం
16	35.0	25.4
15	36.0	26.9
14	36.5	25.0
13	36.3	25.0
12	33.7	25.02
11	34.5	26.0
10	35.8	26.02

నేడు ఏపీపీఎస్‌సీ గ్రూపు-1 పరీక్ష

నెల్లూరు (హరనాథపురం) : ఏపీపీఎస్‌సీ గ్రూపు-1 పరీక్ష ఆదివారం జిల్లావ్యాప్తంగా జరగనుంది. 13 కేంద్రాల్లో జరిగే పరీక్షకు 6,954 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. ఉదయం, మధ్యాహ్నం జరిగే పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు హాల్ టికెట్టుతోపాటు ఏదైనా గుర్తింపు కార్డు తప్పని సరిగా తెచ్చుకోవాల్సి ఉంటుంది. సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను కేంద్రాల్లోకి అనుమతించరు. ఈ పరీక్షలకు సంబంధించి అభ్యర్థుల సందేహ నివృత్తి కోసం కలెక్టరేట్‌లో 0861-2331261 నంబరుతో కాల్ సెంటర్ ఏర్పాటు చేశారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (ఆదివారం) : 6.25
సహరి (సోమవారం) : 4.53



మాట్లాడుతున్న ఇంటర్‌బోర్డు పరిశీలకుడు బహుగుణ

రేపటి నుంచి ఇంటర్ మూల్యాంకనం

● నెల్లూరులోని కేఏసీ కళాశాలలో నిర్వహణ

నెల్లూరు (విద్య), మార్చి 16 : ఇంటర్మీడియట్ జవాబుపత్రాల మూల్యాంకనానికి ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని, సోమవారం నుంచి నాలుగు విడతలుగా స్పాట్‌ను పూర్తి చేస్తామని ఇంటర్‌బోర్డు పరిశీలకులు డాక్టర్ ఎస్. బహుగుణ తెలిపారు. నగరంలోని కేఏసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్‌బోర్డు అధికారులు, కళాశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపాళ్లతో శనివారం ఆయన సమావేశమై మాట్లాడారు. స్పాట్ కేంద్రాల్లోనే స్కానింగ్ ఏర్పాటు చేసి మూల్యాంకనాన్ని త్వరితగతిన పూర్తి చేసేలా ఇంటర్‌బోర్డు కార్యదర్శి సౌరబ్‌గౌర్ శ్రీకారం చుట్టారన్నారు. దీనికి సంబంధిత కళాశాలల యాజమాన్యాలు, సిబ్బంది సహకరించి స్పాట్‌ను విజయవంతం చేయాలని తెలిపారు. ఆర్‌ఐఓ ఎ.శ్రీనివాసులు మాట్లాడుతూ కేఏసీ కళాశాలలో ప్రారంభం కానున్న మూల్యాంకనానికి ఇంటర్‌బోర్డు నియమించిన లెక్చరర్లను తప్పనిసరిగా యాజమాన్యాలు రిలీవ్ చేయాలన్నారు. లెక్చరర్స్‌ను పంపని ప్రిన్సిపాళ్లకు రోజుకు రూ.వెయ్యి అపరాధ రుసుము చెల్లించాలని, అవసరమైతే కళాశాల అనుమతులు కూడా రద్దు చేసేందుకు సిఫారసు చేస్తామన్నారు. అలాగే నిబంధనలకు విరుద్ధంగా వేసవిలో తరగతులు నిర్వహించినా, హాస్టళ్లు నడిపినా, అడ్మిషన్లు చేపట్టినా సంబంధిత కళాశాలలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో డీవీఈఓ మధుబాబు, ప్రిన్సిపాల్స్, సిబ్బంది పాల్గొన్నారు.

● ఓటర్ హెల్ప్‌లైన్ ఏర్పాటు

సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో జిల్లాలోని ఓటర్లకు సహాయం కోసం ప్రత్యేక కాల్ సెంటర్‌ను నెల్లూరులోని కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికలకు సంబంధించి ఎటువంటి సహాయానికైనా లేదా ఫిర్యాదులకైనా ఓటర్ హెల్ప్‌లైన్ నంబర్ 1950తోపాటు కాల్ సెంటర్ నంబర్లు 0861-2349402, 0861-2349403, 0861-2349404 నంబర్లను సంప్రదించవచ్చునని ఆయన వెల్లడించారు.

● 'స్పందన' రద్దు



ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ప్రతి సోమవారం జరిగే స్పందన కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ ముగిసే వరకు ఈ కార్యక్రమం జరగదని, ఈ విషయాన్ని ప్రజలంతా గుర్తించి, ఎవరూ స్పందనలో అర్జీలు ఇచ్చేందుకు రావద్దని సూచించారు.

● ఊపిరి పీల్చుకున్న కావలి

కావలి : ఎన్నికల షెడ్యూల్ వెలువడటంతో కావలిలో అధికారులంతా ఊపిరిపీల్చుకున్నారు. అధికార పార్టీ నేతల ఒత్తిళ్లు తట్టుకోలేక వారి మట కాదంటే తమ కుర్చీలు కదులుతాయోనన్న భయంతో నిన్నటిదాకా తలూపారు. ఇంత జరుగు తున్నా జిల్లా ఉన్నతాధికారులు సైతం చూస్తూ ఉండిపోయారు. అయితే ఎట్టకేలకు ఎన్నికల షెడ్యూల్ వెలువడి కోడ్ అమలులోకి రావడంతో అధికారులు ఆనందంలో మునిగిపోయారు. ఇంతవరకు బాగానే ఉన్నా ఇకనైనా అధికారులు న్యాయంగా, ధర్మంగా వ్యవహరిస్తారా!? లేదా ఇంకా అధికారపార్టీ పాత వాసనతో వారికి అనుకూలంగా కొంత కాలం వ్యవహరిస్తారా!? అనే అనుమానాలను కూడా కొందరు వ్యక్తం చేస్తున్నారు.

ఏప్రిల్ 18న నోటిఫికేషన్ విడుదల | 25వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ | 26వ తేదీన నామినేషన్ల పరిశీలన | 29వ తేదీ వరకు ఉపసంహరణ | మే 13న ఓట్ల లెక్కింపు



58వ రోజు ఓట్ల పండుగ

● మోగిన నగారా
● షెడ్యూలు విడుదల చేసిన ఎన్నికల సంఘం
● మే 13న పోలింగ్... జూన్ 4న కౌంటింగ్
● తడిసి మోపెడవనున్న అభ్యర్థుల ఖర్చు

ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యింది. నేటి నుంచి సరిగ్గా 58వ రోజు ఓట్ల పండుగకు ముహూర్తం ఖరారయ్యింది. మే 13వ తేదీన కొత్త రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎన్నుకునే క్రమంలో జిల్లావాసులు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఎన్నికల బరిలోని అభ్యర్థుల తలరాతలు రాయనున్నారు. ఈ ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీలు ఉమ్మడిగా పోటీ చేస్తుండగా కాంగ్రెస్ పార్టీ వామపక్షాల పొత్తుతో ముందుకు వెళుతోంది. వైసీపీ మాత్రం ఒంటరిగా బరిలోకి దిగుతోంది. ఏదిఏమైనా సుదీర్ఘకాలంపాటు ఎన్నికల ప్రక్రియ జరగనుండటంతో బరిలో నిలిచిన అభ్యర్థులకు వ్యయం తడిసి మోపెడు కానుంది.

నెల్లూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : 2019 ఎన్నికల తరహాలోనే రాష్ట్ర ఎన్నికలు తొలివిడతలోనే జరుగుతాయన్న అంచనాతో ఈసారి ప్రధాన రాజకీయ పార్టీలు ముందుగానే తమ అభ్యర్థులను ప్రకటించాయి. తెలుగుదేశం-జనసేన-బీజేపీల ఉమ్మడి అభ్యర్థులను ప్రకటించారు. ఒక్క సర్వేపల్లి మినహా మిగిలిన అన్ని నియోజకవర్గాలతోపాటు నెల్లూరు ఎంపీ అభ్యర్థి పేరును టీడీపీ ప్రకటించింది. నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, కందుకూరు నుంచి ఇంటూరి నాగేశ్వరరావు, ఉదయగిరికి కాకర్ల సురేష్, ఆత్మకూరుకు ఆనం రామనారాయణరెడ్డి, కోవూరుకు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కావలికి దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, నెల్లూరు సిటీకి పొంగూరు నారాయణ, రూరల్‌కు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి బరిలో నిలిచారు. నెల్లూరు జిల్లా పరిధిలో ఉంటూ తిరుపతి పార్లమెంట్ సెగ్మెంట్‌లోని సర్వేపల్లి నియోజకవర్గ అభ్యర్థి పేరును మాత్రం ఇంకా ప్రకటించాల్సి ఉంది.

● వైసీపీ అభ్యర్థుల ఖరారు

శనివారం సాయంత్రానికి వైసీపీ కూడా నెల్లూరు జిల్లా పరిధిలోని 8 అసెంబ్లీ, ఎంపీ అభ్యర్థుల పేర్లను ప్రకటించింది. పార్లమెంట్ అభ్యర్థిగా విజయసాయిరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థులుగా కందుకూరుకు బుర్రా మధుసూదన్ యాదవ్, ఉదయగిరికి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, ఆత్మకూరుకు మేకపాటి విక్రమ్‌రెడ్డి, కావలికి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, కోవూరుకు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, నెల్లూరు సిటీకి మహ్మద్ ఖలీల్, నెల్లూరు రూరల్‌కు ఆదాల ప్రభాకరరెడ్డి, సర్వేపల్లికి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్లను ప్రకటించింది. కాగా, వామపక్షాల పొత్తుతో బరిలోకి దిగుతున్న కాంగ్రెస్ పార్టీ ఇంకా అభ్యర్థుల జాబితాను ప్రకటించలేదు.

● సుదీర్ఘ ప్రచార కాలం

2019 ఎన్నికల్లో మార్చి 10వ తేదీన షెడ్యూల్ విడుదలయ్యింది. ఏప్రిల్ 11న పోలింగ్ జరిగింది. మొత్తం నెల రోజుల వ్యవధిలోనే ప్రచారాలు, పోలింగ్ ఘట్టాలు అన్నీ ముగిసిపోయాయి. అయితే, ఈసారి అందుకు భిన్నమైన పరిస్థితి నెలకొంది. గత ఎన్నికల తరహాలోనే ఏప్రిల్‌లోనే పోలింగ్ ఉంటుందనే అంచనాతో ప్రధాన పార్టీలు నెల రోజులకు ముందు నుంచే ప్రచారాన్ని మొదలుపెట్టాయి. అయితే ఈదఫా నాల్గవ విడతలో ఎన్నికలు జరగనుండటంతో ప్రచారానికి, పోలింగ్‌కు ఇంకా 58 రోజుల కాలం ఉంది.

● రెట్టింపు కానున్న వ్యయం

పోలింగ్‌కు 58 రోజుల వరకు సమయం ఉండటం అభ్యర్థులకు ఒకవైపు మేలు చేసినా ఎన్నికల ఖర్చు కోణంలో చూస్తే మాత్రం ఇబ్బందికర పరిస్థితిగా మారనుంది. ఇప్పుడు రాజకీయాలు, అందునా ఎన్నికలు ఎంత ఖరీదైనవో ప్రజలకు ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఎన్నికల కమిషన్ ఎన్ని ఆంక్షలు విధించినా, ఎంత నిఘా పెట్టినా పెట్టాల్సిన ఖర్చు పెట్టకతప్పని పరిస్థితి. 58 రోజుల సుదీర్ఘ కాలం ప్రచార టెంపోను నిర్వహించడం అంటే మాటలు కాదు. కరపత్రాలు పంచడం నుంచి పంచాయతీల వరకు ప్రతి దానికి ఖర్చు భారీగానే అవుతుంది. సుమారు రెండు నెలల పాటు పార్టీ కార్యాలయాల నిర్వహణ, కార్యకర్తల విందు, మందు, ప్రచార వాహనాల అద్దెలు, బహిరంగ సభల ఖర్చులు ఇలా ఎంత లేదన్నా రోజువారి లక్షల్లో ఖర్చు అవుతుంది. వ్యయభారం చూసి ఇప్పటికే మొదలుపెట్టిన ప్రచారాన్ని వాయిదా వేసుకోవడానికి వీలులేదు. ఒక్కరోజు కూడా వెనక్కు తగ్గడానికి వీలులేదు. ఇక పోలింగ్‌కు రెండు మూడు రోజులకు ముందు చేయాల్సిన ప్రలోభాలు ఎలాగూ తప్పవు. ఇవన్నీ కలుపుకుంటే అభ్యర్థుల ఎన్నికల వ్యయభారం తడిసిమోపెడవటం ఖాయం. ప్రచారానికి సమయం పెరిగిందనే సంబరం ఒకవైపు ఉన్నా, ఎన్నికల బడ్జెట్ పెరగుతుందనే ఆందోళన అభ్యర్థుల్లో కనిపిస్తోంది.

'కోడ్' కూసింది!

నెల్లూరు (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ఎన్నికల సంఘం సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్‌ను శనివారం ప్రకటించిన నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఎన్నిల కోడ్ అమల్లోకి వచ్చింది. కోడ్ అమలులో భాగంగా ఏమేమి చేయకూడదోనన్న మార్గదర్శకాలను ఎన్నికల సంఘం జారీ చేసింది. అందులో ప్రధాన అంశాలను పరిశీలిస్తే..

● ప్రభుత్వ ఆస్తులపై ఉన్న రాజకీయ నాయకుల పోస్టర్లు, ఫ్లెక్సీలు, కటౌట్లు, హోర్డింగ్‌లు, గోడలపై రాతలు, పార్టీ జెండాలను 24 గంటల్లోపు తొలగించాల్సి ఉంటుంది. ప్రభుత్వ నిధులు వెచ్చించి రాజకీయ నాయకుల ఫోటోలతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లను తొలగించాల్సి ఉంది. ● బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, రైల్వే బ్రిడ్జిలు, రోడ్లు, విద్యుత్ స్తంభాలు, ఆర్టీసీ బస్సులు, బహిరంగ ప్రదేశాల్లో ఉన్న రాజకీయ నాయకుల పోస్టర్లు, ఫ్లెక్సీలు, పార్టీల జెండాలు, ఇతరత్రాలను 48 గంటల్లోగా తొలగించాలి. ● రాజకీయ ప్రచారాల్లో పాల్గొనే మంత్రులు, ఎమ్మెల్యేలు వారి అధికారిక వాహనాలను ఉపయోగించకూడదు. వారు ప్రభుత్వ అతిథి గృహాల్లో ఉండటానికి వీల్లేదు. పైలట్ కార్లు ఉనికి తెలిపేలా హారన్లు మోగించకూడదు. ప్రభుత్వ అధికారి వెబ్‌సైట్లలో ఉన్న మంత్రులు, ఇతర రాజకీయ నాయకుల ఫోటోలను తొలగించాలి. ● ప్రభుత్వ ఉద్యోగులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలి. ఏ రాజకీయ పార్టీకి గానీ లేక అభ్యర్థికి గానీ అనుకూలంగా వ్యవహరించడం లేక సందేశాలు పంపడం చేయకూడదు. రాజకీయ పార్టీలు నిర్వహించే సమావేశాల్లో ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొనకూడదు. ఒక రాజకీయ పార్టీకి అనుకూలంగా ప్రజలను ప్రభావితం చేసేందుకు ప్రయత్నిస్తే చట్ట ప్రకారం ఉద్యోగులపై చర్యలు తీసుకుంటారు. ● ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి సహా ఇతర రాజకీయ నాయకుల ఫోటోలు తొలగించాలి. ● మంత్రులు, రాజకీయ నాయకులు ఎవరూ అధికారులు, ఉద్యోగులతో వ్యక్తిగతంగా వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహించకూడదు. ● వివిధ పథకాల లబ్ధిదారులకు పంపిణీ చేసే కార్డుల్లోనూ, అధికారికంగా ఇచ్చే సర్టిఫికెట్లు, బిల్లుల్లోనూ, శిలాఫలకాల్లోనూ ముఖ్యమంత్రి, మంత్రులు, ఇతర రాజకీయ నాయకుల ఫోటోలు, సందేశాలు ప్రచురించ కూడదు. ● ఎంపీ, ఎమ్మెల్యే ల్యాడ్స్ నిధులతో ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంక్‌లు, అంబులెన్స్‌లు, ఇతర వాహనాలపై ఉన్న ఎంపీ, ఎమ్మెల్యే, ఇతర రాజకీయ నాయకుల ఫోటోలు కనిపించకుండా ముసుగు వేయాలి. ● అభివృద్ధి, నిర్మాణ ప్రాజెక్టులతో సంబంధమున్న ప్రభుత్వ శాఖలు వాటి పరిధిలో ఇప్పటికే మొదలైన, మొదలుపెట్టాల్సిన పనుల వివరాలను 72 గంటల్లోపు ఎన్నికల సంఘానికి అందజేయాలి.

ప్రశాంత ఎన్నికలకు అందరూ సహకరించాలి!

● వచ్చే నెల 18న ఎన్నికల నోటిఫికేషన్
● అదే నెల 25 వరకు నామినేషన్ల స్వీకరణ
● సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన కలెక్టర్

నెల్లూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం హరినారాయణన్ కోరారు. రాజకీయ నాయకులు, ప్రజలు నిబంధనలు పాటించాలని విజ్ఞప్తి చేశారు. రాజకీయ పార్టీలతో కూడా సమావేశాలు నిర్వహించి ఎన్నికల నిబంధనలు తెలియజేస్తామని స్పష్టం చేశారు. సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్‌ను శనివారం నెల్లూరులోని కలెక్టరేట్‌లో కలెక్టర్ వెల్లడించారు. ఏప్రిల్ 18వ తేదీన జిల్లాలో నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాలకు ఆయా రిటర్నింగ్ అధికారులు నోటిఫికేషన్ విడుదల చేస్తారని చెప్పారు. శనివారం నుంచే ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైందని, జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినట్లు ఆయన ప్రకటించారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం రానున్న 72 గంటల్లో ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్న రాజకీయ నాయకుల ఫొటోలు, వారికి సంబంధించిన ఇతర అంశాలను తొలగిస్తామని తెలిపారు. వీధుల్లో ఉన్న హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు తొలగించడంతోపాటు ప్రైవేటు భవనాలపై ఉన్న రాజకీయ పోస్టర్లు, ఫ్లెక్సీలను కూడా తొలగిస్తామని పేర్కొన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎన్నికల కోడ్)ను జిల్లాలో పటిష్టంగా అమలు చేసేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. అందుకుగానూ 53 ఎంసీసీ బృందాలు, 78 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, 81 స్టాటిక్ సర్వేలెన్స్ బృందాలు, 21 వీడియో సర్వేలెన్స్ బృందాలను నియమించామని, ఆ బృందాలు మూడు షిఫ్టులలో పని చేస్తాయని తెలిపారు. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు ఈ బృందాల వాహనాలను జీపీఎస్‌తో అనుసంధానం చేస్తున్నట్లు పేర్కొన్నారు.



● అభ్యర్థుల ఖర్చుపై నిఘా

అభ్యర్థుల ఖర్చుపై పూర్తిస్థాయిలో దృష్టి పెడతామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని ప్రింటింగ్ ప్రెస్‌లు రాజకీయపరమైన ప్రింటింగ్‌లపై వాటిని ముద్రించిన వారి పేర్లను కూడా ముద్రించాలని ఆదేశించినట్లు చెప్పారు. రాజకీయ పార్టీలు పత్రికలు, టీవీలు, సోషల్ మీడియాల్లో ఇచ్చే ప్రకటనలకు సంబంధించి ప్రీసెన్సార్ సర్టిఫికెట్ తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఓటర్లు తమ ఓటును ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ ద్వారా పరిశీలించుకోవచ్చని సూచించారు. ఎన్నికలకు సంబంధించి ఎటువంటి ఫిర్యాదునైనా పౌరులు సీ-విజిల్ యాప్ ద్వారా నమోదు చేయవచ్చని తెలియజేశారు. పోటీ చేసే అభ్యర్థుల పూర్తి వివరాలను ప్రజలు నో యువర్ క్యాండిడేట్ (కేవైసీ) యాప్ ద్వారా తెలుసుకోవచ్చని చెప్పారు. శనివారం వరకు వచ్చిన ఫారం-7 దరఖాస్తులను పరిష్కరించామని, ఇకపై ఆ దరఖాస్తులను స్వీకరించబోమని తెలిపారు. ఫారం-6 దరఖాస్తులను మాత్రం నామినేషన్ల సమయం వరకు తీసుకుంటామని జిల్లా ఎన్నికల అధికారి వెల్లడించారు.

● ఏర్పాట్లు పూర్తి

జిల్లాలో సజావుగా ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ తెలిపారు. మొత్తం 2463 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశామని, వెయ్యి కన్నా ఎక్కువ ఓట్లున్న పది చోట్ల(నెల్లూరు రూరల్‌లో) ఆక్సిలరీ పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ఎన్నికల కమిషన్‌కు ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించారు. జిల్లాలో మొత్తం 20,39,215 మంది ఓటర్లు ఉన్నారని, అందులో పురుషులు 9,97,908 మంది, మహిళలు 10,41,096 మంది, ఇతరులు 211 మంది ఉన్నారని తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం పోటీ చేసే అభ్యర్థులు తమ బయోడేటాను అఫిడవిట్ రూపంలో ప్రచురించాల్సి ఉంటుందని చెప్పారు. ప్రచారాల్లో రాజకీయ నాయకులు సరైన భాష ఉపయోగించాలని, లేనిపక్షంలో ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంటుందని సూచించారు.

పది పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

● విద్యాశాఖ జేడీ రామలింగం



మాట్లాడుతున్న రామలింగం

నెల్లూరు (విద్య), మార్చి 16 : జిల్లాలో పది పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించేందుకు అధికారులంతా సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని విద్యా శాఖ జాయింట్ డైరెక్టర్ మువ్వా రామలింగం తెలిపారు. పరీక్షల నిర్వహణపై శనివారం నగరంలోని జడ్పీ సమావేశ మందిరంలో విద్యాశాఖ అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ నెల 18 నుంచి 30వ తేదీ వరకు జరిగే పది పరీక్షలకు సంబంధించి విధులకు హాజరయ్యే సిబ్బంది వారికి అందచేసిన బుక్‌లెట్‌ను అనుసరించాలన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్ల అనుమతి లేదని అన్నారు. ఎన్నికల వాతావరణం నెలకొన్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఇబ్బందులకు గురవుతారన్నారు. జిల్లావ్యాప్తంగా 176 కేంద్రాల్లో రెగ్యులర్ 28,080 మంది, ప్రైవేట్ 4,666 మంది మొత్తం 34,708 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. అలాగే 630 ప్రభుత్వ పాఠశాలల నుంచి 14,059 మంది బాలురు, 14,021 మంది బాలికలు పరీక్షలకు సన్నద్ధమయ్యారన్నారు. వీరితో పాటు 440 ప్రైవేట్ పాఠశాలల నుంచి 2,700 మంది బాలురు, 1,966 మంది బాలికలు హాజరవుతు న్నారన్నారు. పరీక్షలు సజావుగా జరిగేందుకు 10 ఫ్లయింగ్ స్క్వాడ్స్ ఏర్పాటు చేశారని, వీరంతా కోఆర్డినేషన్ కమిటీ సభ్యుల సమన్వ యంతో పరీక్షలను నిర్వహిస్తారన్నారు. విద్యార్థులు ఎలాంటి ఆందోళన చెందకుండా ప్రశాంత వాతావర ణంలో పరీక్షలు రాసేలా వారిని సంసిద్ధం చేయాలన్నారు. పోలీస్ శాఖ ద్వారా కేంద్రాల వద్ద గట్టి బందోబస్తును ఏర్పాటు చేయడంతోపాటు 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. అలాగే జెరాక్స్ కేంద్రాలను మూసివేయడంతో పాటు కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. కేంద్రాల్లో విద్యుత్ సరఫరా నిరంతరం ఉండేలా, తాగునీరు, వైద్య సదుపాయలు సిద్ధం చేయాలన్నారు. అదేవిధంగా ఆర్టీసీ బస్సులను విద్యార్థులను గంట ముందు గానే కేంద్రాల వద్దకు చేరుకునేలా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో డీఈఓ రామారావు, డిప్యూటీ ఈఓ లక్ష్మీ ప్రసన్నకుమారి, ఎస్ఎస్ఏ ఏపీసీ ఉషారాణి, చీఫ్ సూపరింటెండెంట్లు, ఎంఈఓలు, హెచ్‌ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

అసంపూర్తిగా జలజీవన్ మిషన్ పనులు

ఉదయగిరి రూరల్, మార్చి 16: జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా గండిపాళెం బీసీ కాలనీలో చేపట్టిన ఇంటింటికి కుళాయి పనులు అసంపూర్తిగా ఉన్నాయి. ఈ సమస్యతో కాలనీ వాసులు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత కొన్నినెలల క్రితం రూ.12లక్షలతో పనులు చేసేందుకు గుత్తేదారు అంగీకరించాడు. పాత పైపులను ధ్వంసం చేసి గుంతలు తీసి నూతన పైపు లైన్‌లు ఏర్పాటు చేశారే తప్ప మోటార్‌కు కనెక్షన్ ఇవ్వలేదు. వేసవి కావడంతో తాగునీటి కోసం ఇతర కాలనీలకు వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొందని కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులు పూర్తి చేసి సమస్య పరిష్కరించాలని, లేదంటే ఆందోళన చేపడతామని హెచ్చరిస్తున్నారు. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రవీంద్ర ను వివరణ కోరగా సంబంధిత గుత్తేదారుడికి ఈ విషయాన్ని సూచించామని, సోమవారంలోపు పనులు పూర్తి చేసి కాలనీవాసుల తాగునీటి కష్టాలు తీరుస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.


తవ్వి వదిలేసిన పైపులైన్


అసంపూర్తిగా చేపట్టిన జలజీవన్ మిషన్ పనులు

ఆక్రమణలో శ్మశాన వాటికలు

కావలిటౌన్, మార్చి16: పట్టణంలోని నడిబొడ్డున రూ.కోట్లు విలువ చేసే శ్మశానవాటికల స్థలాలు అన్యాక్రాంతమవుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. శాంతినగర్‌లోని హిందూ శ్మశానవాటిక, క్రైస్తవ సమాధుల తోట, వైకుంఠపురంలోని హిందూ శ్మశాన స్థలాలు దాదాపు సగానికిపైగా ఆక్రమణలకు గురయ్యాయి. అంతేకాక అక్కడ నిర్మాణాలు చేపట్టి, అద్దెలకు కూడా ఇస్తున్నారు. ముసునూరులోని ట్రంకురోడ్డు వద్ద రూ. కోట్లు విలువ చేసే ముస్లిం శ్మశానవాటిక ఆక్రమణకు గురికాగా, అందులో కొంతభాగాన్ని కాపాడుకుని ప్రహరీ నిర్మించుకున్నారు. కాగా ఆయా మతపెద్దలు అక్రమణల విషయమై అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేశారు. అధికారులు వాటిపై చర్యలు తీసుకోకపోగా, ఫిర్యాదులను అడ్డుపెట్టుకుని అక్రమార్కులవద్ద మామూళ్లు పుచ్చుకున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.


శాంతినగర్‌లో ఆక్రమణకు గురైన హిందూ శ్మశానవాటిక

ప్రభుత్వ వైఫల్యాలే టీడీపీ గెలుపునకు నాంది

- రాష్ట్రంలో దుర్మార్గపు పాలనకు చరమగీతం పాడేద్దాం
- ఆత్మకూరులో టీడీపీ విజయం ఖాయం
- ఆనం రామనారాయణరెడ్డి


ఆత్మకూరులో మాట్లాడుతున్న ఆనం రామనారాయణరెడ్డి

ఆత్మకూరు, మార్చి 16: ఆత్మకూరులో టీడీపీ పటిష్టంగా ఉంది. నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ముందుకు సాగితే విజయం ఖాయమని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని రవితేజ కల్యాణ మండపంలో శనివారం నియోజకవర్గ తెలుగు యువత, ప్రొఫినల్స్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనం మాట్లాడారు. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి చారిత్రాత్మక ఘట్టమన్నారు. ఈ కూటమి ఆధ్వర్యంలో ఆదివారం చిలకలూరుపేటలో జరగనున్న ప్రజాగళం మహాసభతో ఎన్నికల సమరానికి శ్రీకారం చుడతామని చెప్పారు. రాష్ట్రంలో అవినీతి, అక్రమ పాలనను శాశ్వతంగా తుదిముట్టించడమే లక్ష్యంగా త్రిముఖ కూటమి వ్యూహాత్మకంగా ముందుకు కదులుతుందన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో పదేళ్లుగా అభివృద్ధి పూర్తిగా కుంటుబడిందని, పూర్వవైభం రావాలంటే టీడీపీ అధికారంలోకి రావాలన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ప్రణాళిక మేర ఎన్నికల ప్రచారాన్ని వేగవంతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు బుల్లెట్ రమణ పాల్గొన్నారు.

మహోన్నత వ్యక్తి పొట్టి శ్రీరాములు : ఇంటూరి

కందుకూరు మార్చి 16 : ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణ త్యాగం చేసిన మహోన్నత వ్యక్తి పొట్టి శ్రీరాములు అని కందుకూరు నియోజకవర్గ టీడీపీ ఉమ్మడి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరావు తెలిపారు. పట్టణంలోని పెద్ద బజారులో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి శనివారం ఆయన పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు దామా మల్లేశ్వరావు, మురారిశెట్టి వెంకటసుబ్బారావు, కొత్త వెంకటేశ్వర్లు, కొత్తూరి వెంకటసుధాకర్, నల్లమల్లి వెంకటేశ్వర్లు, మునగా పిచ్చయ్య, ఇస్కాల మురళి తదితరులు పాల్గొన్నారు.


అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాగేశ్వరావు

అమరజీవికి ఘనంగా నివాళి

కందుకూరు మండల ఆర్యవైశ్యసంఘం, వాసవీక్లబ్ లెజెండ్స్, వనితా క్లబ్‌ల ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా శనివారం ఘనంగా నివాళులర్పించారు. పట్టణంలోని బండ్లమిట్ట సెంటర్‌లో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం ఏరియా హాస్పటల్‌లో రోగులకు పండ్లు, బిస్కెట్లు, మజ్జిగ పంపిణీ చేశారు. బ్యాంక్ ఆఫ్ బరోడా ఆధ్వర్యంలో పట్టణంలోని జనార్ధనకాలనీ ప్రభుత్వ పాఠశాలకు వాటర్‌కూలర్ బహూకరించారు. విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు అందచేశారు. కార్యక్రమంలో పబ్బిశెట్టి శివ, మురారిశెట్టి శ్రీకాంత్, డాక్టరు తన్నీరు మల్లికార్జున, చీదెళ్ల వేణుగోపాలరావు, చక్కా కేశవ, కోట వెంకటనరసింహం, కనమర్లపూడి మురళి తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములుకు నివాళులు

కావలి : అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా శనివారం ట్రంకు రోడ్డులోని ఆయన విగ్రహానికి పలు రాజకీయపార్టీలు, ఆర్యవైశ్య నేతలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. టీడీపీ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు నివాళులు అర్పించారు. అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డితోపాటు మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్య, తిరువీధి ప్రసాద్, కటకం రాము, తటవర్తి రమేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే జైభారత్ పార్టీ ఆధ్వర్యంలో ఆ పార్టీనేతలు మాకినేని అరుణ, సిద్దూ, ఆర్యవైశ్య నేతలు పాదర్తి నాగరాజు, యేల్చూరు రవి, ప్రసాద్ ,రామకృష్ణ తదితరులు అమరజీవి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

● బడుగుల అభ్యున్నతికి కృషి

కందుకూరు : బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం టీడీపీ కృషి చేస్తుందని ఇంటూరి నాగేశ్వరావు తెలిపారు.పట్టణంలోని బృందావన కాలనీలో ఆయన శనివారం టీడీపీ జెండా ఎగురవేశారు. అనంతరం మాట్లాడుతూ కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని, ప్రతి కార్యకర్త టీడీపీ విజయం కోసం శక్తివంచన లేకుండా కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు దాసరి ప్రమోద్, గేరా సురేష్, పాలేటి కోటేశ్వరావు, జంగాల రాఘవ, ఉండ్రాళ్ల సతీష్, జంగాల వెంకట్రావు, కసుకుర్తి అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహుడి సేవలో నాగేశ్వరావు దంపతులు

వలేటివారిపాలెం : మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామిని కందుకూరు టీడీపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు, ఆయన సతీమణి సౌజన్యతో కలిసి శనివారం దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ఘనస్వాగతం పలికారు. అర్చకులు గౌరీశంకర్ అష్టోత్తర ప్రత్యేక పూజలు చేశారు. శాలువా, పూలమాలతో సత్కరించారు. అనంతరం స్వామివారి ప్రసాదం స్వీకరించారు ఆయన వెంట టీడీపీ నాయకులు శివయ్య తదితరులు ఉన్నారు.

డీసీపల్లిలో పొగాకు ధరలు

మర్రిపాడు, మార్చి 16: డీసీపల్లి పొగాకు బోర్డులో శనివారం కేజీ కనిష్ట ధర రూ.227, గరిష్ట ధర రూ.230 పలికింది. రైతులు బోర్డుకు 380 బేళ్లను తీసుకొని రాగా.. 13కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొని 377బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 3 బేళ్లు తిరస్కరించినట్లు వేలం నిర్వహణాధికారి జి.రాజశేఖర్ తెలిపారు.

నేతలను కలిసిన వైసీపీ నాయకులు

ఉదయగిరి రూరల్, మార్చి 16: నెల్లూరు పార్లమెంట్ వైసీపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి, జిల్లా వైసీపీ అధ్యక్షుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిలను శనివారం నెల్లూరులోని పార్టీ కార్యాలయంలో ఉదయగిరి వైసీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ ఓబులరెడ్డి, నాయకులు ఇత్తడి రమణ, ఉప్పుటూరి రమణ తదితరులు పాల్గొన్నారు.

ఇస్కపాలెంకు తరలిన టీడీపీ శ్రేణులు


జెండా ఊపి వాహనాలను ప్రారంభిస్తున్న బయ్యన్న, రియాజ్

ఉదయగిరి రూరల్, మార్చి 16: నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ శనివారం కొండాపురం మండలం సాయిపేట పంచాయతీ ఇస్కపాలెంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అంతకుముందు ఉదయం ఉదయగిరి మండలం నుంచి టీడీపీ శ్రేణులు ప్రత్యేక వాహనాల్లో ఇస్కపాలెంకు వెళ్లారు. వాహనాల ర్యాలీని మండల టీడీపీ కన్వీనర్ చింతన బోయిన బయ్యన్న, మైనారిటీ నాయకులు షేక్ రియాజ్‌లు జెండా ఊపి ప్రారంభించారు.

సీతారామపురం: నియోజకవర్గ తెలుగుదేశం అభ్యర్థి కాకర్ల సురేష్ కొండాపురం మండలం సాయిపేట గ్రామ పంచాయతీలోని ఇస్కపాలెంకు వెళ్లి ప్రచారం నిర్వహించారు. సీతారామపురం మండలంలోని తెలుగు తమ్ముళ్లు చింతల శ్రీను, మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్‌రాజు ఆధ్వర్యంలో శనివారం 60 కాన్వాయ్‌లతో వెళ్లారు.

చెత్త బుట్టల పంపిణీ


పంచాయతీ కార్యదర్శికి చెత్త బుట్టలు అందజేస్తున్న ఎంపీపీ సంపూర్ణమ్మ

అనంతసాగరం, మార్చి 16: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం పంచాయతీ కార్యదర్శులకు ఎంపీపీ సంపూర్ణమ్మ, ఎంపీడీవో తాజ్‌మస్రూర్ ప్రభుత్వం సరఫరా చేసిన డస్ట్ బుట్టలను అందజేశారు. వాటిని ఆయా గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రజలకు అందించి స్వచ్ఛ సంకల్పంపై అవగాహన కల్పించాలని కోరారు.

ఇబ్బందులు లేకుండా చూడాలి

సీతారామపురం, మార్చి 16: ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు 18వ తేదీ నుంచి ఒంటిపూట బడులు ప్రారంభం అవుతున్నందున అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించాలని శనివారం ఎంఈఓ మస్తాన్‌వలి తెలిపారు. పదో తరగతి పరీక్షల కేంద్రాలుగా వున్న పాఠశాలల్లో మధ్యాహ్నం 1 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించాలని హెచ్‌ఎంలకు సూచించారు.

అమరజీవి పొట్టిశ్రీరాములుకు ఘన నివాళి

ఉదయగిరి రూరల్: మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాలలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ గోపికృష్ణ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం ఉద్యమం చేసిన మహోన్నత వ్యక్తి పొట్టిశ్రీరాములని కొని యాడారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ అధికారి ఎం.కిషన్‌తేజ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంగం: స్థానిక తహసీల్దారు కార్యాలయ ఆవరణంలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి సీఐ రవినాయక్, ఆర్యవైశ్య నాయకులు గునుపూడి గిరి, రమేష్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రభాకర్, రాజా పాల్గొన్నారు.


సంగంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేస్తున్న సీఐ రవినాయక్


ఉదయగిరిలో నివాళులర్పిస్తున్న గోపికృష్ణ, అధ్యాపకులు

వింజమూరు: ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రాజేష్‌బాబు పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి సిబ్బందికి స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మండల కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సిబ్బందికి శిక్షణ

ఉదయగిరి రూరల్, మార్చి 16: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో శనివారం ఎన్నికల సిబ్బందికి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజారమేష్ ప్రేమ్‌కుమార్ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటికల్, వీడియో సర్వేకల్ బృందాలకు విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఆర్వో నెహ్రూబాబు, మాస్టర్ ట్రైనర్ సమీవుల్లా, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వింజమూరు: పట్టణంలో శనివారం మధ్యాహ్నం నుంచి రాజకీయ పార్టీల బ్యానర్లను తొలగించారు. పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఎన్నికలు కోడ్ అమలులో ఉన్నందువలన రాజకీయ పార్టీ నాయకులు హడావిడి చేయకుండా ప్రశాంతంగా ప్రచారం చేసుకోవాలన్నారు. ఆర్చీలకు బ్యానర్లకు కట్టేందుకు అనుమతి లేదని నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

లోక్‌అదాలత్‌లో 85 కేసుల పరిష్కారం

ఉదయగిరి రూరల్, మార్చి 16: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో న్యాయాధికారి జే.అంజయ్య ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో 85కేసులను పరిష్కరించారు. అందులో క్రిమినల్ 78, సివిల్2, బ్యాంకు మేటర్‌కు సంబంధించిన కేసులు 5ఉన్నాయి. ఆయా కేసుల్లో జరిమానా కింద రూ.94,100, ఒప్పందం కింద రూ.27లక్షలు, బ్యాంకు మేటర్ కింద రూ.2.62 లక్షలు వసూలు చేశారు. కార్యక్రమంలో సభ్యులు మురళి, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.


లోక్ అదాలత్ నిర్వహిస్తున్న న్యాయాధికారి అంజయ్య

టీడీపీలో చేరిన మాజీ ఎంపీపీ


చేజర్ల, మార్చి 16: మాజీ మండలాధ్యక్షుడు, తూర్పుకంభంపాడు టీడీపీ నాయకులు అన్నలూరు శ్రీనివాసులునాయుడు శనివారం మాజీ మంత్రి, ఆత్మకూరు తెలుగుదేశం అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు బుల్లెట్ రమణ సమక్షంలో టీడీపీలో చేరారు. శనివారం పెరుమాళ్లపాడు సమీపంలోని ఆనం ఫాంహౌస్ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో అన్నలూరు శ్రీనివాసులునాయుడుతో పాటు 50కుటుంబాలు పార్టీలో చేరారు. కార్యక్రమంలో నవకృష్ణ చౌదరి, నారాయణరెడ్డి కేశవచౌదరి పాల్గొన్నారు.

పరిశుభ్రతకు చర్యలు

ఉదయగిరి రూరల్, మార్చి 16: పట్టణంలోని సుద్దబావి వీధిలో పంచాయతీ పారిశుధ్య సిబ్బంది మురుగు కాలువను శుభ్రం చేసి పరిశుభ్రతకు చర్యలు చేపట్టారు. 'రహదారిపైనే మురుగు' అనే కథనం శనివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి కరీముల్లా పారిశుధ్య సిబ్బందితో కాలువల్లో పూడిక తీయించి రహదారిపై మురుగు నీరు ప్రవహించకుండా చర్యలు చేపట్టారు.

సంగంలో పారామిలిటరీ దళాల కవాతు

సంగం, మార్చి 16: మండలకేంద్రంలో పారా మిలిటరీ దళాలు శనివారం కవాతు నిర్వహించారు. త్వరలో జరుగబోయే శాసనసభ, లోకసభ ఎన్నికల్లో ప్రశాంత వాతావరణంలో ఓటుహక్కు వినియోగించేందుకు వీలుగా ఓటర్లకు భరోసా కల్పించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం పారా మిలిటరీ దళాలను పంపినట్లు సంగ సీఐ రవినాయక్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ నాగార్జునరెడ్డి ఉన్నారు.



తెలుగు తమ్ముళ్ల ప్రచారం

బిట్రగుంట, మార్చి 16: బోగోలు మండలంలో శనివారం తెలుగు తమ్ముళ్లు ఎన్నికల ప్రచారం చేశారు. ఇబ్రహీంపేటలో టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు, కావలి నుంచి కావ్య క్రిష్ణారెడ్డిని, నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి గెలిపించాలని ఇంటింటి ప్రచారం చేశారు. మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు ఆధ్వర్యంలో సుధీర్‌బాబు, మాధవరావు, అహ్మద్, ఖలీల్, మల్లిక, హరిబాబు, నరసింహరావు పాల్గొన్నారు. బోగోలు మార్కెట్ వీధిలో మాజీ ఎంపీటీసీ ముంతాల వెంకయ్య ఆధ్వర్యంలో గౌస్‌బాషా, వెంకటేశ్వర్లు, అరుణమ్మ, రమేష్ ప్రచారం చేశారు. అల్లూరు నుంచి కొండబిట్రగుంట వరకు బైక్ ర్యాలీగా వచ్చిన వారికి విజయ్‌కుమార్ యాదవ్ స్వాగతం పలికారు.

19న విద్యుత్ లోక్‌అదాలత్

లింగసముద్రం, మార్చి 16: ఈ నెల 19న ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు స్థానిక వేముల అంజయ్య కళ్యాణ మండపంలో విద్యుత్ లోక్ అదాలత్, అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు కందుకూరు ఈఈ ఏ వీరయ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి సీజీఆర్‌ఎఫ్ ఛైర్‌పర్సన్, రిటైర్డ్ జడ్జి ఎన్ విక్టర్ ఇమ్మాను యేలు, ఫోరం సభ్యులు ఒంగోలు విద్యుత్ ఎస్ఈ సత్యనారాయణ పాల్గొంటారని ఆయన తెలిపారు. లింగసముద్రం మండల విద్యుత్ వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలను పరిష్క రించుకోవాలన్నారు.

సోమశిలలో 12.479 టీఎంసీల నిల్వ

అనంతసాగరం, మార్చి 16: సోమశిల పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా శనివారం నాటికి జలాశయంలో 12.479 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 1600, ఉత్తర కాలువకు 600, దక్షిణ కాలువకు 370 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

చంద్రబాబు నమ్మకాన్ని వమ్ము చేయను : కాకర్ల

కొండాపురం, మార్చి16: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేయనని ఉదయగిరి నియోజకవర్గ టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్ అన్నారు. మండలంలోని సాయిపేట పంచాయతీ ఇస్కపాలెం నుంచి శనివారం ఆయన ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇస్కపాలెంలో డ్రైనేజీ వ్యవస్థతోపాటు రోడ్లు సరిగాలేవని, అలాగే మినరల్ వాటర్ ప్లాంటు ఏర్పాటు విషయమై ప్రజలు తనదృష్టికి తీసుకువచ్చారని పేర్కొన్నారు. తాను గెలిచాక సమస్యలు పరిష్కరిస్తానన్నారు. అంతకుముందు సాయిపేటలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అక్కడ నుంచి భారీ ర్యాలీగా ఇస్కపాలెం చేరుకున్నారు. గ్రామంలోని రామాలయంలో ప్రత్యేకపూజలు చేశారు. ఈసందర్భంగా కాకర్లను ఇస్కపాలెం ప్రజలు గుర్రంపై ఊరేగించారు.మక్కెనవారిపాళెంలో మాజీ జడ్పీటీసీ దామ మహేశ్వరరావు కాకర్లను గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎమ్.ఓంకారం, గంటా లక్ష్మీనరసంహులు, కుంకు మోహనరావు, దామా మహేశ్వరరావు, దామా శివబాబు, తదితరులు పాల్గొన్నారు.

కాకర్లకు ఘనస్వాగతం

కలిగిరి : కాకర్ల సురేష్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కలిగిరి నుంచి కొండాపురం వెళ్లే మార్గంలో కలిగిరమ్మ గుడి సర్కిల్ వద్ద అతనితోపాటు మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, ఉదయగిరి మార్కెటింగ్ మాజీ ఛైర్మన్ మన్నేటి వెంకటరెడ్డిలకు మండలవాసులు అపూర్వ స్వాగతం పలికారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి, జనసేన నాయకులు బండారు లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పలువురు నేతలు కార్లలో కొండాపురం మండలానికి బయలుదేరి వెళ్లారు.

అల్లూరులో బైక్ ర్యాలీ

అల్లూరు : టీడీపీ కూటమి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకోవడమే లక్ష్యంగా అల్లూరులోని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు శనివారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. టీడీపీ నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ ఆధ్వర్యంలో అల్లూరు కోసేరు సెంటరు నుంచి ఈ ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ర్యాలీ కొండబిట్రగుంట బిలకూట క్షేత్రానికి చేరుకొని ప్రసన్న వేంకటేశ్వరుడి పూజలు నిర్వహించారు. అంతకుముందు పోలేరమ్మ చెట్టు, ఆంజనేయస్వామికి పూజలు చేశారు. కార్యక్రమంలో బండి శ్రీనివాసులురెడ్డి, కృష్ణచైతన్య, అరగల రమణయ్య, సామంతుల కిరణ్‌రెడ్డి, మేడా శ్రావణ్‌కుమార్‌రెడ్డి, పొడమేకల మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


కొండాపురం : కాకర్లను గుర్రంపై ఊరేగిస్తున్న ఇస్కపాలెం గ్రామస్థులు

పలు కుటుంబాలు టీడీపీలో చేరిక

ఉలవపాడు : మండలంలోని కరేడు పంచాయతీలో పలు కుటుంబాల వారు శనివారం వైసీపీని వీడి టీడీపీలో చేరారు. కరేడు ఎస్సీ కాలనీ, చైతన్యనగర్, చిన్న పల్లెపాలెం, అలగాయపాలెం గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాలలో ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో పలు కుటుంబాల వారు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో నాయకులు రాచగల్ల సుబ్బారావు, కన్నా ప్రసాదు, పాలుబోయిన శ్రీనివాసులు, చిట్టా బంగారురెడ్డి, మెట్ట శ్రీనివాసులురెడ్డి, వాయిల శ్రీను, వల్లభుని రమణయ్యనాయుడు కోటయ్య, యరమల వాసు, నాయుడు సుధ, మద్దెల శ్రీధర్, కొల్లి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

మాలకొండ ఆదాయం రూ. 7,69,275

వలేటివారిపాలెం : మాలకొండ లక్ష్మీనరసింహస్వామికి శనివారం భక్తుల నుంచి రూ. 7,69,275 ఆదాయం లభించినట్లు ఆలయ డీసీ కేబీ శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. వివరాలు... అష్టోత్తరం టికెట్‌ల ద్వారా రూ. 7,150, కుంకుమార్చన ద్వారా రూ. 28,480, వివాహాల ద్వారా రూ. 12 వేలు, తలనీలాల ద్వారా రూ. 29,025, వాహనపూజల ద్వారా రూ. 2,920, ప్రత్యేకదర్శనం ద్వారా రూ. 2,30,900, స్థల పురాణం పుస్తకాల విక్రయం ద్వారా రూ. 8,80, రూముఅద్దెల ద్వారా రూ. 2,13,230, అన్నదానం ద్వారా రూ. 1,89,100, విరాళాల ద్వారా రూ. 23,050 ఆదాయం లభించిందన్నారు.

ట్రాక్టరు ఢీకొని యువకుడి మృతి

కందుకూరు : మట్టి ట్రాక్టరు ఢీకొని యువకుడు మృతి చెందాడు.ఈ ఘటన మున్సిపాలిటీ పరిధిలోని వెంకటాద్రిపాలెం సమీపంలో శనివారం సాయంత్రం జరిగింది. ఈ ప్రమాదంలో పొన్నలూరు మండలం విప్పగుంటకి చెందిన కొంకా మురళి(49) అక్కడికక్కడే మృతిచెందాడు. మురళి ఫిజియోథెరపి కోసం కందుకూరు వచ్చి మోటారుసైకిల్‌పై తిరిగి వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన ట్రాక్టర్ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది.

వాలీబాల్ కోర్టుల ప్రారంభం

ఉలవపాడు : మండలంలోని కరేడు చిన్నపల్లెపాలెం, పెద్దపట్టపుపాలెం గ్రామాల్లో యువత కోరిక మేరకు కందుకూరు టీడీపీ ఉమ్మడి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు స్వంత నిధులతో నిర్మించిన వాలీబాల్ కోర్టులను శనివారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాచగల్ల సుబ్బారావు, కన్నా ప్రసాదు పాల్గొన్నారు.

వాసుబాబుకు అభినందనలు

వలేటివారిపాలెం : టుబాకో బోర్డు వైస్ ఛైర్మన్‌గా శనివారం బాధ్యతలు చేపట్టిన వలేటివారిపాలెం నివాసి గుత్తా వాసుబాబుకు గ్రామస్థులతోపాటు పలువురు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వలేటి మాల్యాద్రి, వలేటి నరసింహం శాలువా, పుష్పగుచ్ఛం అందజేశారు. పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు కృషి చేయాలని వారు ఆయన్ను కోరారు.

కేంద్ర బలగాల కవాతు

బిట్రగుంట : బోగోలు మండలంలోని పలు గ్రామాల్లో శనివారం కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. కావలి రూరల్ సీఐ నాగభూషణం ఆధ్వర్యంలో కొండబిట్రగుంట, పాతబిట్రగుంట, ముంగమూరు, కడనూతల గ్రామాల్లో వారు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఏఎస్సై సుధాకర్‌రెడ్డి, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

అల్లూరు : స్థానిక వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో పాతబస్టాండు కూడలిలో శనివారం చలివేంద్రాన్ని ప్రారంభించా రు. పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకొని చేపట్టిన ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే విష్ణు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో సిద్దా ప్రసాద్, డీ బ్రహ్మానందరావు, ఎం సురేష్, వై సురేంద్ర పాల్గొన్నారు.

ఆదరించండి... అభివృద్ధి చేసి చూపిస్తా : కావ్య

కావలి రూరల్, మార్చి16: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తనను గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి పేర్కొన్నారు. కావలి మండలం తాళ్లపాలెం, అన్నగారిపాలెం పంచాయతీల్లో శనివారం ఆయన పర్యటించారు. గ్రామ నాయకులతో సమావేశమై ఎన్నికల్లో నిర్వహించాల్సిన విధి విధానాలపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గంలోని ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తామన్నారు.


టీడీపీలో చేరిన వారితో కావ్య క్రిష్ణారెడ్డి

● వైసీపీ నుంచి వలసలు

కాగా తాళ్లపాలెం, అన్నగారిపాలెం గ్రామాలకు చెందిన పలువురు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. తాళ్లపాలెంకి చెందిన వీరయ్య, మదన్‌గోపాల్‌రెడ్డి, పాలామల్లికార్జున్, శ్రీనివాసులు, లక్ష్మీపురానికి చెందిన మామిడి వెంకటరమణయ్య, చెంచంగారి పోతురాజు, మరో 12 మంది టీడీపీలో చేరారు. అలాగే వెంకటేశ్వరపురం నుంచి టీడీపీ లో చేరిన వారికి క్రిష్ణారెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు ఆవుల రామక్రిష్ణ, ఉప్పాల వెంకట్రావు, కండ్లగుంట మధుబాబు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

● రాక్షసపాలనకు విముక్తి

కావలి : ఎన్నికల షెడ్యూల్ విడుదల కావటంతో ఎట్టకేలకు రాక్షసపాలన నుంచి ప్రజలకు విముక్తి కలిగిందని టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం టీడీపీ కార్యాలయం వద్ద బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్‌తో రాష్ట్రంలో ప్రశాంతత వాతావరణం నెలకొంటుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుత్తికొండ కిషోర్, ఆవుల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా పదో తరగతి పరీక్షలు : ఆర్‌జేడీ

కావలిటౌన్, మార్చి16: పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ ఆర్‌జేడీ ముష్వా రామలింగం తెలిపారు. శనివారం స్థానిక శాంతినగర్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాల సమావేశ మందిరంలో పది పరీక్షల డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లతో ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. డీఈవో పీవీజే రామారావుతో కలిసి ముష్వా మాట్లాడుతూ సోమవారం నుంచి జరగనున్న పది పరీక్షలకు అన్నిరకాలుగా సిద్ధంగా ఉండాలన్నారు. ఎక్కడా అవకతవకలు జరగగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటికే పరీక్ష కేంద్రాలను గుర్తించామని, అక్కడి వసతులపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాదికారులు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కావలి పట్టణంలో బైక్ ర్యాలీ

కావలిటౌన్ : కావలి నియోజకవర్గాన్ని రూ.కోట్ల సొంతనిధులతో అభివృద్ధి చేశారని, తనను ఆదరించాలని పీఎస్సార్ ట్రస్ట్ అధినేత, స్వతంత్ర అభ్యర్థి పసుపులేటి సుధాకర్ కోరారు. శనివారం పట్టణంలో పెద్దఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. ముసునూరు శివారు వద్ద నుంచి ర్యాలీ పీఎస్సార్ కార్యాలయం వరకు సాగింది. అనంతరం పీఎస్సార్ మాట్లాడుతూ ఎన్ని అవినీతి, అక్రమాలు చేసినా పోటీ చేసేది రెడ్లే కాబట్టి, గెలిచేది వారేనని అన్నారు. బీసీలను వృద్ధిలోకి ఆశయంతో ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తున్నానన్నారు. కార్యక్రమంలో పసుపులేటి వెంకటేశ్వర్లు, పెనుగొండయ్య గౌడ్, దావులూరి శ్యాంసన్, శ్రీనివాసులు గౌడ్, షైనంపాటి జగదీష్, పలువురు పసుపులేటి అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



చంద్రబాబు నివాసానికి ర్యాలీగా తరలివెళ్తున్న మాగుంట శేన

నేడు బొప్పూడిలో ప్రజాగళం

- హాజరుకానున్న ప్రధాని మోదీ, చంద్రబాబు, పవన్ కళ్యాణ్
- భారీగా తరలుతున్న టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు

ఒంగోలు, మార్చి 16, (ఆంధ్రజ్యోతి): సాధారణ ఎన్నికలలో వైసీపీని మట్టికరిపించి, టీడీపీ నేతృత్వంలోని కూటమి విజయమే లక్ష్యంగా ఆదివారం చిలకలూరిపేట సమీపంలోని బొప్పూడి వద్ద భారీ బహిరంగసభ జరగనుంది. కూటమిలో భాగస్వామ్యమైన మూడు పార్టీల తరపున ప్రధాని నరేంద్ర మోదీ, టీడీపీ అధ్యక్షులు చంద్రబాబునాయుడు, జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ వంటి అగ్రనేతలు సభలో పాల్గొననున్నారు. రానున్న ఎన్నికలలో రాష్ట్రంలోని ఆ పార్టీల శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్నారు. సభకు ప్రజాగళం అని పేరు పెట్టారు. రాష్ట్ర భవిష్యత్ కోసమే మూడు పార్టీల మధ్య ఎన్నికల పొత్తు పెట్టుకుని ముందుకు పోతున్నారు. భారీగా మూడు పార్టీల శ్రేణులు సమీకరిస్తున్నారు. లక్షల మందితో నిర్వహించే ఈ సభ ఆదివారం మధ్యాహ్నం తర్వాత ప్రారంభం కానుండగా, సాయంత్రం 5 గంటలకు మోదీ ఈ సభలో పాల్గొంటారు. సభ జరిగే ప్రాంగణం ఉమ్మడి ప్రకాశం జిల్లాకు సమీప ప్రాంతం కావడంతో జిల్లా నుంచి మూడు పార్టీల శ్రేణులు భారీగా ఆ సభకు తరలుతున్నారు. ప్రధానంగా టీడీపీ నేతలు జనసమీకరణపై దృష్టిసారించారు. ఇప్పటికే ఆయా అసెంబ్లీ స్థానాల్లో పోటీచేసే అభ్యర్థులను అధిష్ఠానం ప్రకటించిన నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల ప్రచారం జోరందుకుంది. టీడీపీతోపాటు భాగస్వామ్యమైన పక్షాల కేడర్ మంచి ఊపు మీద ఉన్నారు. ఆయా నియోజకవర్గాల నుంచి భారీగానే సభకు కార్యకర్తలు తరలివెళ్లనున్నారు. ఒంగోలు, ఎస్ఎన్ పాడు, కొండపి, దర్శిల నుంచి అధికంగా వెళ్లే అవకాశం ఉండగా, ముఖ్యనేతలు అందరూ అందుకు సంబంధించిన ఏర్పాట్లపై శుక్రవారమే పూర్తిగా నిమగ్నమయ్యారు.

నగరంలో మాగుంట సందడి

- ఆయన కార్యాలయంలో కోలాహలం
- ఎంపీని కలిసిన గొట్టిపాటి, దామచర్ల
- భారీ కాన్వాయ్‌తో ఉండవల్లి తరలిన వైనం

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 16 : ఇటీవల వైసీపీకి రాజీనామా చేసిన ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి టీడీపీ చేరిక నేపథ్యంలో శనివారం నగరంలో సందడి వాతావరణం నెలకొంది. ఉదయం నుంచి మాగుంట కార్యాలయం వద్ద కోలాహలం నెలకొంది. స్థానిక రామనగర్‌లోని ఆయన కార్యాలయం వద్దకు ఒంగోలు పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల నుంచి అభిమానులు భారీగా తరలివచ్చారు. శనివారం సాయంత్రం ఉండవల్లిలో టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు సమక్షంలో మాగుంటతోపాటు ఆయన కుమారుడు, యువపారిశ్రామికవేత్త రాఘవరెడ్డి చేరిక నేపథ్యంలో ఒంగోలు నుంచి తన అభిమానులతో కలిసి భారీ ర్యాలీ ఏర్పాటు చేశారు. సుమారు 250కిపైగా వాహనాల్లో అభిమానులతో కలిసి బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా మాగుంట కార్యాలయం నుంచి ర్యాలీ వెళ్లిన రోడ్లన్నీ సందడిగా మారాయి.

మాగుంటతో భేటీ అయిన గొట్టిపాటి, దామచర్ల

కాగా ఒంగోలు ఎంపీ మాగుంటతో అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్, ఒంగోలు మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, జనసేన పార్టీ అధ్యక్షుడు షేక్ రియాజ్‌లు భేటీ అయ్యారు. శనివారం టీడీపీలో చేరికతోపాటు బొప్పూడి వద్ద ఎన్‌డీఏ కూటమి ఆధ్వర్యంలో జరిగే సభపై చర్చించారు. వారితో పాటు యువ పారిశ్రామికవేత్త రాఘవరెడ్డి ఉన్నారు.

పది పరీక్షలకు సర్వం సిద్ధం

- రేపటి నుంచి పరీక్షలు
- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు(విద్య), మార్చి 16 : జిల్లాలో సోమవారం నుంచి ప్రారంభమవుతున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. శనివారం సాయంత్రం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో పదవ తరగతి పరీక్షలకు 30,928 మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు తెలిపారు. వీరిలో రెగ్యులర్ 29,449 మంది కాగా ప్రైవేటు విద్యార్థులు 1479 మంది ఉన్నారన్నారు. 170 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని, పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45వరకు జరుగుతాయని తెలిపారు. విద్యార్థులు పరీక్షకు అరగంట ముందుగా కేంద్రాలకు చేరుకోవాలన్నారు. ప్రధాన ద్వారం వద్దనే విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీలు చేసిన తర్వాత లోపలికి అనుమతిస్తారని కలెక్టర్ తెలిపారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తామని తెలిపారు. పరీక్షల్లో అవకతవకలకు పాల్పడితే యాక్టు 25 ప్రకారం కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాపీయింగ్‌ను నిరోధించేందుకు 73 సిట్టింగ్‌స్క్వాడ్‌లను ఏర్పాటు చేశామన్నారు. 23మంది రెవెన్యూ, 25 మంది విద్యాశాఖ సిబ్బందితోపాటు మరో 23 మంది సీ సెంటర్ కస్టోడియన్లతో స్క్వాడ్లు ఏర్పాటు చేశామన్నారు. వీరికి అదనంగా జిల్లాస్థాయిలో 9 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, మరో ఇద్దరు ప్రత్యేక తనిఖీ అధికారులు కేంద్రాల తనిఖీని నిర్వహిస్తారన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించడంతోపాటు ప్రత్యేక పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు గ్రామాల నుంచి సకాలంలో కేంద్రాలకు చేరుకునేందుకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించామన్నారు. అలాగే కేంద్రాలను నో సెల్‌ఫోన్ జోన్లుగా ప్రకటించినట్లు తెలిపారు. కేంద్రాల్లో తాగునీటి సౌకర్యంతోపాటు ఇతర మౌలిక సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. విద్యార్థుల్లో ఎవరికైనా శారీరక వైకల్యంతో పరీక్ష రాయలేకపోతే వారికి ప్రత్యేకంగా స్క్రైబ్‌లను ఏర్పాటు చేయడంతోపాటు ఆ విద్యార్థులకు అదనంగా గంట సమయం కేటాయించినట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణ కోసం 78427772394, 7842777439 నెంబర్లు కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. సమావేశంలో పరీక్షల రాష్ట్ర పరిశీలకులు ఎం ఆర్.ప్రసన్నకుమార్, డీఈఓ డి.సుభద్ర, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ కే శివకుమార్‌లు పాల్గొన్నారు.

నేడు గ్రూపు-1 పరీక్ష

జిల్లాలో 9 కేంద్రాలు 6,016 మంది అభ్యర్థులు

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 16 : ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) గ్రూపు-1 పరీక్ష ఆదివారం నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. 6,016 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానుండగా అందుకోసం తొమ్మిది కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఒంగోలులో ఆరు కేంద్రాలు, టంగుటూరు మండలంలో రెండు, చీమకుర్తిలో ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గ్రూపు-1 పరీక్ష రెండు సెషన్స్‌లో జరగనుంది. ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు జరుగుతుంది. మొదటి సెషన్‌కు హాజరయ్యే అభ్యర్థులు ఉదయం 9.45లోపు కేంద్రంలోకి వెళ్లాలి. ఆ తర్వాత వచ్చే విద్యార్థులను అనుమతించరు. మధ్యాహ్నం సెషన్ 2 నుంచి 4 గంటల వరకు జరుగుతుంది. మధ్యాహ్నం సెషన్‌కు హాజరయ్యే అభ్యర్థులు 1.45లోపు కేంద్రంలోకి వెళ్లాలి.

కూలీల కొరత..నీటి ఎద్దడి

మిర్చి రైతులకు భారం..నష్టం

ముండ్లమూరు, మార్చి 16 : మండలంలోని పలు గ్రామాల్లో మిర్చి సాగు చేసిన రైతులకు ఒక వైపు కూలీల కొరత ఏర్పడడంతో తోటలలోనే కాయలు ఎండి పోతున్నాయి. మరో వైపు నీటి ఎద్దడి కారణంగా తోటలు వాడుముఖం పడుతున్నాయి. దీంతో మిర్చి సాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటను దక్కించుకునేందుకు రైతులు ఇళ్ల దగ్గర నుంచి ట్యాంకర్ల ద్వారా నీటిని తీసుకెళ్లి మిర్చి తోటల్లో ఉన్న నీటి కుంటలను నింపుకుంటున్నారు. తద్వారా తోటలను తడుపుకుంటున్నారు. మిర్చి పంటలకు వరుస తెగుళ్లు రావడంతో దిగుబడి గణనీయంగా పడి పోయింది. వచ్చిన దిగుబడి సైతం కోసేందుకు కూలీల డిమాండ్ కూడా ఏర్పడింది. చేలోనే కాయలు ఎండి పోయే పరిస్థితి వచ్చింది. వారం రోజులుగా నీటి ఎద్దడి ఏర్పడింది. మండలంలోని తమ్మలూరు, నాయుడుపాలెం, ఉమా మహేశ్వర అగ్రహారం, పూరిమెట్ల, మారెళ్ల, సుంకరవారిపాలెం, నూజెండ్లపల్లి, భట్లపల్లి, శంకరాపురంలలో ఎక్కువగా మిర్చిని సాగు చేశారు. తమ్మలూరులో మిర్చి తోటలకు పూర్తిగా నీటి ఎద్దడి ఏర్పడింది. దీంతో ఒక్కసారిగా వ్యవసాయ బోరులో నీరు నిలిచి పోవడంతో రైతులు చేసేదిలేక ఇళ్ల దగ్గర నుంచి ట్యాంకర్ల ద్వారా నీటిని తీసుకెళ్లి కుంటలకు పెట్టి ఆ తరువాత తోటలకు నీరు పెడుతున్నారు.

సైకిల్ స్పీడ్

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పలువురు ప్రముఖుల చేరికతో టీడీపీ కూటమిలో జోష్ పెరిగింది. శనివారం ఇటు ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డితోపాటు ఆయన కుమారుడు రాఘవరెడ్డి, వారి అనుచరులు చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. మరోవైపు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గరటయ్య, ఆయన కుమారుడు శాప్ నెట్ మాజీ చైర్మన్ క్రిష్ణచైతన్యతోపాటు అద్దంకి నియోజకవర్గానికి చెందిన వారి అనుచరులు పెద్దసంఖ్యలో బాబు సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఇంకో వైపు చీరాలకు చెందిన మాజీ మంత్రి రామారావు కూడా పార్టీలో చేరారు. దీనికితోడు గత కొన్నిరోజుల నుంచి ఆయా నియోజకవర్గాల్లో టీడీపీలో జరుగుతున్న వలసల పర్వం శనివారం కూడా కొనసాగింది. దీనితో ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఒక్కసారిగా రాజకీయ సమీకరణాలలో పెనుమార్పు చోటుచేసుకుంది. ఈ చేరికల పరంపరతో టీడీపీ కూటమిలో జోష్ పెరగగా అధికార వైసీపీలో అలజడి ఆరంభమైంది.

- పలువురు ప్రముఖులు, అనుచరులు చేరిక
- ఇటు మాగుంట, అటు బాచిన కుటుంబం
- ఒంగోలు లోక్‌సభలో పలువురు ముఖ్యులు చేరిక
- కృష్ణచైతన్య వెంట అద్దంకి నియోజకవర్గ నేతలు
- గరటయ్యతో కలిసి పార్టీలో చేరిన మాజీ మంత్రి పాలేటి
- కిందిస్థాయిలో కదులుతున్న అధికారపార్టీ కేడర్

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఇటీవల కాలంలో జిల్లాలో వైసీపీ నుంచి టీడీపీలోకి చేరుతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోంది. కొద్దిరోజుల క్రితం వైసీపీకి రాజీనామా చేసిన ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, అతని కుమారుడు రాఘవరెడ్డిలను శనివారం చంద్రబాబునాయుడు తెలుగుదేశం పార్టీలో చేర్చుకున్నారు. అటు అద్దంకి మాజీ ఎమ్మెల్యే గరటయ్య, ఆయన కుమారుడు చైతన్యబాబు సమక్షంలో ఉండవల్లిలోని ఆయన నివాసగృహంలో తెలుగుదేశంలో చేరారు. ఇటు ఎంపీ మాగుంటతోపాటు లోక్‌సభ పరిధిలోని వైసీపీకి చెందిన స్థానికసంస్థల ప్రజాప్రతినిధులు, కిందిస్థాయి నాయకులు టీడీపీలో చేరారు. ఇటు కృష్ణచైతన్యతోపాటు అద్దంకి నియోజకవర్గం నుంచి పలువురు ముఖ్యనాయకులు టీడీపీలో చేరారు. చీరాల నియోజకవర్గంలో బలహీనవర్గాలకు చెందిన మాజీమంత్రి డాక్టర్ పి.రామారావు కూడా గరటయ్యతో కలిసి టీడీపీలో చేరారు. దీంతో ఉమ్మడి జిల్లాలోని 10 నియోజకవర్గాలలో వైసీపీకి రాజీనామాలు చేసి టీడీపీలోకి ఆయా స్థాయిల్లోని ప్రముఖులు చేరడంతో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. అంతేకాక కిందిస్థాయిలో మరికొందరు నాయకులు వీరికి మద్దతుగా టీడీపీలో చేరేందుకు చర్చలు జరుగుతున్నాయి. తదనుగుణంగా ఆయా ప్రాంతాల్లో చేరికల పర్వం మరికొన్ని రోజులు కొనసాగే అవకాశం కనిపిస్తోంది. అనేక ప్రాంతాల్లో రాజకీయ సమీకరణలు టీడీపీ కూటమికి అనుకూలంగా మారబోతున్నాయి.



టీడీపీలో చేరిన ఎంపీ మాగుంట, రాఘవరెడ్డి



పాలేటికి కండువా వేసి ఆహ్వానిస్తున్న బాబు

మాగుంట ఆధ్వర్యంలో...

కాగా శనివారం ఉండవల్లిలో చంద్రబాబు సమక్షంలో ఎంపీ మాగుంట, ఆయన కుమారుడు రాఘవరెడ్డితోపాటు ఒంగోలు, కొండపి, దర్శి, కనిగిరి, గిద్దలూరు తదితర నియోజకవర్గాలకు చెందిన కొందరు అనుచరులు కూడా టీడీపీలో చేరారు. ఒంగోలులో మాజీ చైర్మన్ కుప్పం ప్రసాద్, అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ ఘనశ్యామ్‌తోపాటు పలువురు ఆయా వర్గాలకు చెందిన నాయకులు కూడా పసుపు కండువా కప్పించుకున్నారు. కొండపి నియోజకవర్గంలో మాగుంట అనుచరులు పెద్దసంఖ్యలో టీడీపీలో చేరారు. జరుగుమల్లి మాజీ ఎంపీపీ బెల్లం సత్యం, ప్రస్తుత ఎంపీపీ అయిన ఆయన సతీమణి నిర్మలతోపాటు మండలంలో వారితో కలిసి పయనిస్తున్న వారు టీడీపీ గూటికి వచ్చారు. అలాగే కొండపి ఎంపీపీ స్వర్ణకుమారితోపాటు ఆ మండలంలోని కొందరు నాయకులు, పొన్నలూరు, తర్వాత మర్రిపూడి, టంగుటూరు నుంచి మరికొందరు నాయకులు చేరారు. శింగ రాయకొండ మండలం నుంచి మాగుంట సంస్థల్లో పనిచేసే ఉద్యోగులతోపాటు కుటుంబ అభిమానులు చేరారు. దర్శి నియోజకవర్గం, దర్శి మున్సిపాలిటీలో కౌన్సిలర్ ఈసీరెడ్డి, అలాగే తూర్పుగంగవరం ఉపసర్పంచ్ వై.కాశిరెడ్డి, అభివృద్ధి ట్రస్టుబోర్డు చైర్మన్ గురుబ్రహ్మం, పోలవరం వైసీపీ నాయకులు శ్రీనివాసరావు, కురిచేడు మండలంలోని యాదవ సామాజికవర్గానికి చెందిన వ్యక్తులు టీడీపీలో చేరారు. కనిగిరి నియోజకవర్గంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చంద్రశేఖర్, అలాగే గిద్దలూరు నియోజకవర్గం రాచర్ల మండలంలో పట్టు ఉన్న సొసైటీ మాజీ అధ్యక్షులు రంగసాయి, వారి అనుచరులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

బాచినతో భారీ చేరికలు

అద్దంకి మాజీ ఎమ్మెల్యే గరటయ్య, ఆయన కుమారుడు చైతన్యతోపాటు నియోజకవర్గంలోని పలువురు ప్రముఖులు వైసీపీకి గుడ్‌బై చెప్పి టీడీపీలో చేరారు. కొరిశపాడు ఎంపీపీ సాదినేని ప్రసన్నకుమారి, ఆమె మస్తాన్‌రావు, బాపట్ల జిల్లా వైసీపీ రైతువిభాగం అధ్యక్షులు చింతల పేరయ్య, పంగులూరు, సంతమాగులూరు, కొరిశపాడు పార్టీ మండల అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, చింతా రామారావు, రావి శ్రీధర్, పంగులూరు జడ్పీటీసీ సభ్యురాలు ప్రమీల సుబ్బారావు, నాగులపాడు సొసైటీ మాజీ చైర్మన్ సందిరెడ్డి రమేష్, వెల్లలచెరువు సొసైటీ మాజీ అధ్యక్షుడు చింతా శ్రీధర్, 19వవార్డు కౌన్సిలర్ వేజెండ్ల నాగరాజు, టి.కొప్పెరపాడు సర్పంచ్ శ్రీను, బొమ్మనంపాడు ఎంపీటీసీ భర్త హనుమంతరావు, అనుమలపాడు, కశ్యాపురం, నక్కబొక్కలపాడు, కె.రాజుపాలెం తదితర గ్రామాల సర్పంచ్‌లతోపాటు ఎంపీటీసీ సభ్యులు వారితోపాటు టీడీపీలో చేరారు. మాజీ ఎంపీపీలు, సొసైటీ అధ్యక్షులు కూడా పెద్దసంఖ్యలో టీడీపీలో చేరారు. వీరందరికీ బాబు పార్టీ కండువాలు కప్పి పార్టీలో చేర్చుకున్నారు. మిగిలిన గ్రామాల్లోని మరికొందరు నాయకులు సోమవారం నుంచి నియోజకవర్గంలో జరిగే వివిధ కార్యక్రమాల్లో చేరబోతున్నట్లు చైతన్య తెలిపారు. చీరాలలో రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా పనిచేసి మంత్రిగా పనిచేసిన బలహీనవర్గాల నాయకులు డాక్టర్ పాలేటి రామారావు టీడీపీలో చేరడంతో నియోజకవర్గంలోని ఆయన అనుచరులు కూడా ఆయనబాటలోనే పయనించారు.



గరటయ్య, కృష్ణచైతన్యను పార్టీలోకి ఆహ్వానిస్తున్న అధినేత చంద్రబాబు

అమలులోకి ఎన్నికల కోడ్

- సార్వత్రిక సమరం షెడ్యూల్ ప్రకటించిన సీఈసీ
- ఏప్రిల్ 18న నోటిఫికేషన్ మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్
- అప్రమత్తమైన యంత్రాంగం
- నిబంధనల అమలుకు చర్యలు
- కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్



వైసీపీ ప్రచార పోస్టర్లను చించివేస్తున్న సిబ్బంది

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 16: సార్వత్రిక ఎన్నికల సమరానికి కేంద్ర ఎన్నికల సంఘం(సీఈసీ) నగారా మోగించింది. దేశవ్యాప్తంగా ఏడు దశల్లో ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్‌ను సీఈసీ శనివారం సాయంత్రం ప్రకటించింది. ఆ వెంటనే ఎన్నికల ప్రవర్తనా నియమావళి(కోడ్) అమలులోకి వస్తున్నట్లు ప్రకటించింది. దీంతో జిల్లాలో అధికార యంత్రాంగం తక్షణం కోడ్ అమలుకు చర్యలకు ఉపక్రమించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి సీఈసీ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం రాష్ట్రంలో ఏప్రిల్ 18న నోటిఫికేషన్ వెలువడనుంది. అలాగే మే 13న పోలింగ్, జూన్ 4న ఓట్ల లెక్కింపు జరుగుతుంది. ఆ ప్రకారమే జిల్లాలో ప్రక్రియ సాగుతుంది. జిల్లాలో తాజా లెక్కల ప్రకారం మొత్తం ఎనిమిది అసెంబ్లీ స్థానాల్లో 18,11,597 మంది ఓటర్లు ఉండగా వారి కోసం 2,183 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేశారు. అలాగే ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో పలు కీలక పనులను ఇప్పటికే చేపట్టారు.

ఫ్లెక్సీలు, పోస్టర్లు తొలగింపు

సీఈసీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటనతో కోడ్ అమలులోకి రావడంతో తక్షణ చర్యలపై ఎక్కడికక్కడ అధికారులు దృష్టిపెట్టారు. తొలుత జిల్లావ్యాప్తంగా రెవెన్యూ, పంచాయతీ, మునిసిపల్ అధికారులు, సిబ్బంది తమ పరిధిలోని రాజకీయపక్షాల అలాగే ఓటర్లను ప్రభావితం చేసే ఫ్లెక్సీలు, కటౌట్లు, హోర్డింగ్‌లు తొలగించే చర్యలు చేపట్టారు. అలాగే నేతల విగ్రహాలకు ముసుగులు వేయడం ప్రారంభించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఫొటోల తొలగింపు చర్యలు చేపట్టారు. ఈ ప్రక్రియ అంతా 24 నుంచి 48 గంటల్లో పూర్తిచేయాల్సి ఉంది. పోలీస్ అధికారులు కూడా పలుచోట్ల చెక్‌పోస్టులు పెట్టి తనిఖీలు ముమ్మరం చేశారు. కోడ్ అమలులో భాగంగా ఇంకా పలు చర్యలు తీసుకోవాల్సి ఉండటంతో కలెక్టర్ శనివారం సాయంత్రం కీలక అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, అధికారిక బృందాలు, మండల స్థాయి అధికారులతో నిర్వహించిన ఈ కాన్ఫరెన్స్‌లో తక్షణ చర్యలపై పలు సూచనలు చేశారు.

నియోజకవర్గం	కేంద్రాలు	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
వైపాలెం	265	1,04,777	1,01,617	01	2,06,395
దర్శి	282	1,13,768	1,11,663	09	2,25,440
సంతనూతలపాడు	256	1,04,997	1,08,707	04	2,13,708
ఒంగోలు	259	1,14,640	1,23,695	49	2,38,348
కొండపి	283	1,17,580	1,19,991	03	2,37,574
మార్కాపురం	257	1,07,448	1,06,000	08	2,13,456
గిద్దలూరు	284	1,18,747	1,19,454	20	2,38,221
కనిగిరి	207	1,20,564	1,17,859	13	2,38,436
మొత్తం	2,183	9,02,521	9,08,986	107	18,11,614

జిల్లాలో 18,11,614 ఓట్లు

11,908 ఓట్లు పెరుగుదల

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 16: జిల్లాలో 18,11,614 మంది ఓటర్లు ఉన్నారు. గత జనవరిలో ప్రకటించిన తుది ఓటర్ల జాబితాలో 17,99,706 ఓట్లు ఉండగా ఈ మూడు నెలల కాలంలో చేర్పుల అనంతరం 11,908 ఓట్లు పెరిగాయి. కనిగిరి నియోజకవర్గంలో అత్యధికంగా 2,38,436 ఓట్లు ఉండగా అత్యల్పంగా వైపాలెం నియోజకవర్గంలో 2,06,395 ఓట్లు ఉన్నాయి. జిల్లాలో పురుషులు 9,02,521 మంది ఉండగా, స్త్రీలు 9,08,986 మంది ఉన్నారు. పురుషుల కంటే స్త్రీల ఓట్లు 6,465 ఎక్కువ ఉన్నాయి. జిల్లాలో 2,183 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. జిల్లాలో నియోజకవర్గాల వారీగా ఓట్ల వివరాలు ఇలా ఉన్నాయి.

గడ్డి జింకను కాపాడిన విద్యార్థులు

అటవీశాఖాధికారులకు అప్పగింత

కనిగిరి, మార్చి 16 : కనిగిరి పట్టణ సమీపంలోని డిగ్రీ కళాశాల వద్ద శనివారం కుక్కల గుంపు గడ్డి జింకపై దాడిచేసి గాయపరచే సమయంలో విద్యార్థులు జింకను కాపాడి అటవీశాఖ అధికారులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. అరణ్యంలో ఉండాల్సిన వన్యప్రాణులు దాహార్తి కోసం జనారణ్యంలోకి వస్తున్నాయి. కనిగిరిలో శుక్రవారం ఎమ్మెల్యే మధుసూదన్‌యాదవ్ ఇంటి సమీపంలో గడ్డిజింక రావడంతో కుక్కలు వెంటపడ్డాయి. దీంతో చెట్లపొదల్లోకి వెళ్లి దాక్కున్న జింకను స్థానికుల ఇచ్చిన సమాచారంతో అటవీ అధికారలు వచ్చి జింకను సంరక్షించి కొండల్లో ఒదిలేశారు. తిరిగి శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని మైదానంలోకి తప్పిపోయి వచ్చిన గడ్డిజింకపై కుక్కల గుంపు వెంబడించి గాయపర్చబోగా ఉదయాన్నే వాకింగ్‌కు వచ్చిన విద్యార్థులు కుక్కల గుంపును తరిమికొట్టి జింకను రక్షించి అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు జింకను సంరక్షించి పునుగోడు కొండల అవతల ఉన్న అటవీ ప్రదేశాల్లో ఒదిలేశారు. కనిగిరి ఫారెస్ట్ రేంజర్ రామిరెడ్డి మాట్లాడుతూ వన్యప్రానుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. వాటిని దాడి చేసినా, చంపినా శిక్షకు గురవుతారని హెచ్చరించారు. జింకను కాపాడిన విద్యార్థులను ఆయన అభినందించారు.

డ్వామాలో కుర్చీలాట..!

పక్షంలో ముగ్గురు పీడీల మార్పు

ఒంగోలు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా నీటియాజమన్య సంస్థ (డ్వామా)లో కుర్చీలాట సాగుతోంది. ఆ సంస్థ జిల్లా ఉన్నతాధికారి అయిన ప్రాజెక్టు డైరెక్టర్ పోస్టుకు పక్షం రోజుల్లో ముగ్గురు అధికారులు మారారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అధికారుల నియామకాల్లో బంతాట అనేక సందర్భాల్లో బహిర్గతం కాగా, ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో అదేతంతు కొనసాగుతోంది. గత నాలుగున్నరేళ్లుగా కే.శీనారెడ్డి ఇక్కడ పీడీగా పనిచేస్తుండగా, సొంత జిల్లా, ఎక్కువకాలం పనిచేసిన నేపథ్యంలో ఎన్నికల నిబంధనలతో ఆయనను కలెక్టర్ దినేష్‌కుమార్ మాతృశాఖకు సరెండర్ చేశారు. ఫిబ్రవరి 27న ఆయనను సరెండర్ చేస్తూ ఇన్‌చార్జి పీడీ బాధ్యతలను మార్కాపురం ఏపీడీగా పనిచేస్తున్న నిర్మలదేవికి అప్పగించారు. ఆమె బాధ్యతలు స్వీకరించిన వారంరోజులకు పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో డీఎల్‌డీఓగా పనిచేస్తున్న వై.రాజగోపాల్‌ను ప్రభుత్వం ఇక్కడ పీడీగా నియమించింది. ఈనెల 11న ఆయన బాధ్యతలు స్వీకరించి పనిచేస్తుండగా, శుక్రవారం రాత్రి రాజగోపాల్‌ను తిరిగి సత్తెనపల్లి డీఎల్‌డీఓగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో ప్రస్తుతం బాపట్ల ఇన్‌చార్జి పీడీగా పనిచేస్తున్న కందుకూరు ఏపీడీ అర్జున్‌రావును నియమించారు. ఆయన శనివారం బాధ్యతలు స్వీకరించారు.

31 మండలాల్లో కరువు

రబీ సీజన్‌పై ప్రభుత్వ ప్రకటన

ఒంగోలు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రబీ సీజన్‌కు సంబంధించి 31 మండలాల్లో కరువు పరిస్థితులు ఉన్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఆ మేరకు శనివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ ఏడాది రబీ సీజన్‌లో 44శాతం లోటు వర్షపాతం ఉండగా, పంటల సాగు మూడింట రెండు వంతుల విస్తీర్ణంలో మాత్రమే జరిగింది. సరైన సమయంలో వర్షాలు లేక పలు పంటలు దిగుబడుల కూడా తగ్గిపోయాయి. అయితే సీజన్ ముగిసిన తర్వాత రెండు మాసాల పాటు పట్టించుకోని ప్రభుత్వం నాలుగురోజుల క్రితం కరువు పరిస్థితులపై హడావుడిగా జిల్లా అధికారులను నివేదికలు కోరింది. పంటల సాగు విస్తీర్ణం, దిగుబడులు, వర్షపాతం నమోదు, భూమిలో తేమశాతం, భూగర్భజలాల పరిస్థితి తదితర కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా కరువు మండలాల ఎంపిక జరుగుతుంది. ఆ ప్రామాణికాల ప్రకారం జిల్లాలోని 38 మండలాల్లో 20చోట్ల తీవ్ర కరువు, 11చోట్ల ఒక మోస్తారు కరువు పరిస్థితులు ఉన్నట్లు కలెక్టర్ దినేష్‌కుమార్ రెండు రోజుల క్రితం ప్రభుత్వానికి నివేదించారు. అలాగే మిగిలిన 7 మండలాల్లో కూడా పలు అంశాలు సాధారణ స్థాయిలో ఉన్నప్పటికీ పంట దిగుబడులు తక్కువగా ఉన్నందున ఆ ఏడు మండలాలను కూడా కలిపి మొత్తం 38 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించాలని నివేదికలో పేర్కొన్నారు. అయితే ఆ ఏడింటి విషయాన్ని పక్కన పెట్టిన ప్రభుత్వం 31 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించింది. ఆ మేరకు శనివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. కేంద్ర మార్గదర్శకాల ప్రకారం కరువు ప్రాంతాలుగా ప్రకటించిన మండలాల్లో పంటల రుణాల రీషెడ్యూల్, ఇన్‌పుట్ సబ్సిడీ అందజేత, తాగునీటికి నిధులు, అదనపు ఉపాధి పనిదినాల కల్పన, తదితర కరువు సహాయక చర్యలకు అవకాశం ఉంది. కానీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కరువు మండలాలుగా ప్రకటించిన ప్రభుత్వం తదుపరి చర్యలు ఏ మేరకు తీసుకుంటుందనేది ప్రశ్నార్థకమే. జిల్లాలో కరువు మండలాలుగా ప్రకటించిన వివరాలు ఇలా ఉన్నాయి.

తీవ్ర కరువు ఉన్న మండలాలు

వైపాలెం, దోర్నాల, కురిచేడు, ముండ్లమూరు, దర్శి, పొదిలి, మర్రిపూడి, పెదారవీడు, మార్కాపురం, కంభం, తర్లుపాడు, హెచ్ఎంపాడు, వెలిగండ్ల, పీసీపల్లి, సీఎస్‌పురం. పామూరు, ఎస్ఎన్‌పాడు, ఒంగోలు, కొత్తపట్నం, పుల్లలచెరువు,

ఒక మోస్తరు కరువు మండలాలు

దొనకొండ, కేకేమిట్ల, అర్ధవీడు, బీపేట, ఎస్‌జీపాడు, చీమకుర్తి, రాచర్ల, గిద్దలూరు, కొమరోలు, కనిగిరి, కొండపి.